www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
గురువారం 14 నవంబర్ 2024
సంపుటి :06 సంచిక : 165 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## ప్రజా కవి కాళోజి నిత్య స్మరణీయుడు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఢిల్లీ సీఎం అధికార నివాసంలో నిర్వహించిన కాళోజి వర్ధంతి 2 లో..
- కాళోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు



## ఇక ప్రాంతీయ భాషల్లోనూ వైద్యవిద్య

- దేశీయంగా మరో 75వేల మెడికల్ సీట్ల పెంపు
- పేదలకు ఆరోగ్యం చేరువ చేయాలన్న లక్ష్యం 2 లో..
- దర్భంగా ఎయిమ్స్ శంకుస్థాపనలో ప్రధాని మోదీ

## వికారాబాద్ ఘటనపై ప్రభుత్వం సీరియస్

- కుట్రలు చేసిన బిఆర్ఎస్‌ను వదిలేది లేదు
- ఎవరున్నా కఠినంగా శిక్షించి తీరుతాం
- దాడులతో రాష్ట్రాన్ని అప్రతిష్ట చేసే యత్నం
- దాడిని కెసిఆర్ ఎందుకు ఖండించడం లేదు
- దాడులు చేస్తే ఊరుకుంటామనుకుంటే మూర్ఖత్వమే
- రాష్ట్రంలో పరిశ్రమలు రావడం బిఆర్ఎస్‌కు ఇష్టం లేదు
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పరిశ్రమలు రావాల్సిందే
- వేర్వేరుగా ఘాటుగా హెచ్చరించిన భట్టి,కోమటిరెడ్డి, పొంగులేటి



**హైదరాబాద్,నవంబర్13 వెలుతురు:** వికారాబాద్ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా పలువురిని అరెస్ట్ చేయగా, పట్నంకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ క్రమంలో లగచర్ల గ్రామంలో జరిగిన ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసింది. బిఆర్ఎస్‌ను వదిలిపెట్టే ప్రసక్తి లేదని మంత్రులు హెచ్చరించారు. ఇప్పటికే ఐటీశాఖ మంత్రి 2 లో..

## 21, 22 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన

అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి



2 లో..



## నరేందర్ రెడ్డి అరెస్ట్ అక్రమం

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 13:** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ని రేవంత్ సర్కార్ అక్రమంగా అరెస్టు చేయడం పట్ల బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బుధ వారం ఆయన పట్నం నరేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పిన కేటిఆర్ , ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములను 2 లో..

## కేసీఆర్ బయటకు రావాలి

- భట్టి విక్రమార్క

10 సంవత్సరాలు సీఎం చేసిన వ్యక్తి మౌనంగా ఉంటే ఎట్లా

అధికారులపై దాడులు చేయడం దుర్మార్గం

కేసీఆర్ స్పందించాలి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 13:** పది సంవత్సరాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ను అడుగుతున్న ఇలా దాడులు చేయించడం కరెక్టేనా? అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రశ్నించారు .అలాగే రాష్ట్రంలో బాధ్యత 2 లో..



## తెలంగాణలో 15 పర్సంట్ కమీషన్ పాలన

- రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారు...
- 6గ్యారంటీల్లో ఒక్కటీ అమలు చేయలే
- కోట్ల యాడ్స్ ఇచ్చి మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాలనుకుంటున్నారు
- తెలంగాణ పైసలన్నీ మహారాష్ట్రలో ఖర్చు చేస్తున్నారు
- ముస్లిం రిజర్వేషన్లను సుప్రీంకోర్టే కొట్టేసింది
- అయినా మైనారిటీ రిజర్వేషన్ల పేరుతో మోసం చేసే కుట్ర
- కులగణన పేరుతో ప్రజల ఆస్తిపాస్తులపై కన్నేశారు

### ఛత్రపతి శివాజీ వారసులారా మొగల్స్ కోటను బద్దలు కొట్టిన చరిత్ర మీది

### కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టండి

నాగ్ పూర్ లో మీడియా సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్



**నాగ్ పూర్ వెలుతురు నవంబర్ 13:** తెలంగాణలో 'కమీషన్ల' పాలన కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రతి పనిలోనూ, కాంట్రాక్టుల్లోనూ 15 శాతం కమీషన్ తీసుకుంటూ తెలంగాణను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఇప్పటి వరకు పూర్తిగా అమలు చేయలేదన్నారు. అయినప్పటికీ అన్ని హామీలు అమలు చేస్తున్నట్లుగా మహారాష్ట్ర ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి యాడ్స్ ఇస్తూ మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఇవ్వలేదని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించినప్పటికీ తెలంగాణలో రుణమాఫీ అమలు చేసినట్లుగా మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ సొమ్మును ఖర్చు చేస్తూ తెలంగాణను మరింత దివాళా తీయిస్తున్నారని మండిపడ్డారు. ముస్లిం రిజర్వేషన్ల అమలు చెల్లదని సుప్రీంకోర్టు కొట్టేసినప్పటికీ మైనారిటీ రిజర్వేషన్ల అమలు పేరుతో మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తోందన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం రోజున నాగపూర్ లో మీడియా 8 లో..

## సీఎం రేవంత్‌ది తుగ్లక్ పాలన

- రేవంత్ భరతం పట్టడం ఖాయం
- వారి అల్లుళ్ల ప్రయోజనాల కోసం ఫార్మా విలేజ్‌లు
- ఫార్మాలా వన్ గురించి కనీస నాలెడ్జ్ కూడా లేదు
- కాంగ్రెస్ కుంభకోణాలను బయటపెట్టడానికే ఢిల్లీకి వెళ్లా
- కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు మొదలైంది
- రైతుల సమస్య కూడా పరిష్కరించని సంస్కారం కాంగ్రెస్‌ది
- 9 నెలలుగా రైతులు ఆందోళన చేస్తున్నా సీఎంకు కలిసే తీరిక లేదా..?
- తెలంగాణ భవన్ ప్రెస్‌మీట్‌లో రేవంత్‌పై నిప్పులు చెరిగిన కేటీఆర్



**హైదరాబాద్, నవంబర్ 13 వెలుతురు:** సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్ విధానాల వల్ల రాష్ట్రంలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి.. సీఎం రేవంత్ కుటుంబ సభ్యులపై వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ విధానాల వలనే లగచర్ల ఘటన జరిగిందన్నారు. కొడంగల్ నుంచే సీఎం రేవంత్ రెడ్డి భరతం 2 లో..



## వరి ధాన్యం కొనుగోలు రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలి

- మంత్రి ప్రభాకర్

- రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ కు ఆదేశం 2 లో..
- వరి ధాన్యం కొనుగోలు రవాణా కు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్లు- రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచన

## దేశంలో ఇక బుల్డోజర్ న్యాయం చెల్లదు



- జడ్జిలా వ్యవహరించే అధికారం లేదు
- ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుంది
- నిందితులు అయినంత మాత్రాన ఇళ్లు కూల్చేస్తారా
- రాష్ట్రాల బుల్డోజర్ న్యాయంపై సుప్రీం ఆగ్రహం
- చర్యలు తీసుకునే అధికారులపై పెనాల్టీ
- ఆక్రమణదారులకు తీర్పు వర్తించదు 2 లో..
- సుప్రీం ధర్మాసనం కీలక తీర్పు...

**న్యూఢిల్లీ,నవంబర్13 వెలుతురు:** బుల్డోజర్ల న్యాయంపై సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎగ్జిక్యూటివ్ అధికారులు న్యాయ ప్రక్రియను తమ చేతుల్లోకి తీసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. నిందితులను దోషిగా చిత్రీకరించలేమని, దాని ఆధారంగా వాళ్ల ప్రాపర్టీలను నాశనం చేయడం సరికాదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. కేవలం నిందితులో లేక దోషులో అయినంతమాత్రానా, వాళ్ల ఇండ్లను కూల్చడం రాజ్యాంగవ్యతిరేకమే అవుతుందని సుప్రీంకోర్టు చెప్పింది. వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న వారి ఇండ్లను అక్రమంగా కూల్చుతున్నారని వేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు న్యాయవిచారణ చేపట్టింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసుల్లో తీర్పును ఇచ్చింది. నిందితుల ఇండ్లను కూల్చడం



## ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని విజిట్ చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

**మహారాష్ట్ర వెలుతురు నవంబర్ 13:** మహారాష్ట్ర లోని నాగ్ పూర్ పట్టణంలో గల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సంస్థ కేంద్ర కార్యాలయాన్ని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సందర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు బుధవారం నాగ్ పూర్ కు వచ్చిన బండి సంజయ్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని సందర్శించి నిర్వాహకులతో కాసేపు మాట్లాడారు.

## కోచింగ్ సెంటర్ల అతిప్రచారానికి అడ్డుకట్ట

- వందకువందశాతం ఫలితాల ప్రకటనలకు చెక్
- ఎవరివో ఫోటోలు పెట్టి తమ ర్యాంకర్లు అంటే కుదరదు
- ఇష్టం వచ్చినట్లు ప్రకటనలు ఇస్తే అంతే సంగతులు
- తాజాగా మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం

Government of India

6 లో..

## పెద్దపల్లి జిల్లాలో పట్టాలు తప్పిన గూడ్స్

కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

పలు రైళ్లను రద్దు చేసిన దక్షిణమధ్య రైల్వే



2 లో..

## కుంచించుకుపోయిన బతుకమ్మకుంట

వృద్ధాలతో నింపి ఆక్రమించినట్లు గుర్తింపు

కూల్చివేతలు ఉండవన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, నవంబర్13 :

3 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## ప్రజా కవి కాళోజి నిత్య స్మరణీయుడు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 13:**
'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి... అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి... అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడ'ని ప్రకటించిన ప్రజా కవి కాళోజి నారాయణరావు నిత్య స్మరణీయులని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కాళోజి నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని ముఖ్య మంత్రి అధికారిక నివాసంలో కాళోజి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. కాళోజి నారాయణ రావు తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో కృషి చేశారని సీఎం కొనియాడారు. ఆయనను తెలంగాణ రాష్ట్రం. ప్రజలు ఎప్పటికీ మారువారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి. హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నేత. రోహన్ రెడ్డి లు పాల్గొన్నారు.

## 21, 22 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన

హైదరాబాద్, నవంబర్13 : ఈ నెల 21, 22 తేదీల్లో రెండు రోజులపాటు నగరంలో భారత రాష్ట్రపతి ముర్ము పర్యటించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారుల తో సమావేశమయ్యారు. కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేందుకు మాన్యువల్ ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఆమె ఆదేశించారు. పోలీసు శాఖ తగిన భద్రతా ఏర్పాట్లు, సరైన ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని అన్నారు. అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు అన్ని వేదికల వద్ద తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, ÷ర్ టెండర్లను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. వైద్యారోగ్యశాఖ సహాయక సిబ్బందితోపాటు అర్హులైన వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రపతి బస చేసే ప్రదేశం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఓంజఆ శాఖను ఆదేశించారు. అన్ని వేదికల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖ ను ఆదేశించారు. డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, డీజీ అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ బీ వెంకటేశం, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరీశ్, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## కేసీఆర్ బయటకు రావాలి

కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ బయటకు వచ్చి ఈ విషయంపై మాట్లాడండంటూ భట్టి విక్రమార్క కేసీఆర్ ను కోరారు. ఉన్నతస్థాయి అధికారులపై ఇట్లా దాడులు చేయించడం పై సమాజానికి ఏం సందేశం ఇస్తారు? భట్టి విక్రమార్క ప్రశించారు. ఈ దాడులు ఎటువైపు దారి తీస్తాయో మీకు తెలియదా? అంటూ కేసీఆర్ ను ప్రశ్నించారు, ప్రజా ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కుట్రపూరితంగా దుర్మార్గమైన దాడుల పట్ల ప్రభుత్వం కఠినంగా ఉంటుందన్నారు, అలాగే ఉద్యోగులు అధైర్య పడవద్దు. మీ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించండి. ఉద్యోగులు తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే నిత్యం పేద ప్రజల కోసం పని చేసే ఒక నిబద్ధత కలిగిన కలెక్టర్. ఐటీడీఏ లో అమాయకులైన గిరిజన ప్రజల కోసం మంచిగా పని చేసిన అధికారి భూములు కోల్పోతున్న ప్రజల కోసం ప్రభుత్వం తరుపున ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఎలా ఆదుకోవాలని వచ్చిన జిల్లా మెజిస్ట్రేట్ అధికారి పైన దాడులు చేయిస్తారా ..? అంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సంఘటనకు కారుకులైన వారు ఎవరైనా వదిలిపెట్టాం.. వెనుక ఎంత పెద్ద వారు ఉన్న చట్ట ప్రకారం శిక్షిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలు రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలి

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు. హైదరాబాద్ బ్యూరో. నవంబర్ 13:**
తెలంగాణ వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రవాణా శాఖకు సంబంధించిన లారీలు ఇతర వాహనాలు ఇబ్బంది లేకుండా స్థానిక జిల్లా రవాణా అధికారులు & కొను గోలు కేంద్రాల నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత లేకుండా రవాణా శాఖ తీసుకుం టున్న చర్యల పై అధికారులతో చర్చించి . జిల్లా కలెక్టర్లు స్థానిక రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ప్రభాకర్ సూచించారు . ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటుం దన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడానికి వాహనాల కొరత లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని రవాణా శాఖ అధికారులకు మంత్రి ప్రభాకర్ ఆదేశించారు.

## పెద్దపల్లి జిల్లాలో పట్టాలు తప్పిన గూడ్స్

పెద్దపల్లి,నవంబర్13 : జిల్లాలో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్లు రద్దయ్యాయి. పెద్దపల్లి-రామగుండం మధ్య రాఘవాపూర్ వద్ద మంగళవారం రాత్రి గూడ్సు రైలు బోల్తాపడింది. ఐరన్ కాయిల్స్‌తో వెళ్తున్న రైలు ఓవర్‌లోడ్‌లో 11 వ్యాగన్లు బోల్తా పడ్డాయి. వేగంగా వెళ్తున్న రైలు బోగీల మధ్య ఉన్న లింక్‌లు తెగిపోవడంతోపాటు ఒకదానిపై మరో బోగి పడి మూడు ట్రాక్‌లు దెబ్బతిన్నాయి. రాత్రి నుంచి ఘటనాస్థలిలో పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన కారణంగా దిల్లీ, చెన్నై మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దక్షిణ మధ్య రైల్వే 39 రైళ్లు రద్దు చేయడంతో పాటు 7 రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. 53 రైళ్లను దారి మళ్లించారు. 7 రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. నర్సాపూర్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-నాగ్‌పుర్, హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్- కాగజ్‌నగర్, కాజీపేట-సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్-కరీంనగర్, కరీంనగర్-బోధన్, సిర్పూర్ టౌన్- భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-బల్లార్షా, బల్లార్షా-కాజీపేట, యశ్వంత్‌పూర్-ముజఫర్‌పూర్, కాచిగూడ-నాగర్‌సోల్, కాచిగూడ-కరీంనగర్, సికింద్రాబాద్-రామేశ్వరం, సికింద్రాబాద్-తిరుపతి, ఆదిలాబాద్-పర్లి, అకోలా-పూర్ణ, ఆదిలాబాద్-నాందేడ్, నిజామాబాద్-కాచిగూడ, గుంతకల్లు-బోధన్ రైళ్లను రద్దు చేశారు. రాఘవపూర్ సమీపంలో యుద్ధ ప్రాతిపదికన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ట్రాక్‌పై బోల్తాపడిన గూడ్స్ డబ్బాలను సిబ్బంది తొలగిస్తున్నారు. తెగిపడ్డ విద్యుత్తు తీగలను పునరుద్ధరిస్తున్నారు. కొత్త పట్టాలను ఘటనా స్థలికి తెప్పించి శరవేగంగా పట్టాలను అమర్చు తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

# ఇక ప్రాంతీయ భాషల్లోనూ వైద్యవిద్య

(మొదటి పేజీ తరువాయి..)

పాట్నా,నవంబర్13 : త్వరలోనే హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటు లోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రయత్నాలు ప్రారంభించామని అన్నారు. దేశీయ భాషల్లో వైద్యవిద్య వల్ల సామాన్యులకు అందుబాటులోకి రావడమే గాకుండా, వైద్య సేవల్లో నాణ్యత పెరుగుతుందని అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను జోడించామని.. రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశంలో 1.5 లక్షలకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. దర్భంగా చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ప్రధాని మోదీ ఎయిమ్స్ దర్భంగాను ప్రారంభించారు. 1260 కోట్ల రూపాయలతో భాగల్‌పూర్ ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేశారు. ఆరోగ్య రంగంలో ప్రధానంగా ఐదు అంశాలపై మా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిరుపేదలకు మంచి ఆరోగ్య సౌకర్యాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ప్రధాన మంత్రి అన్నారు. దర్భంగా ఎయిమ్స్ బీహార్ ఆరోగ్య రంగంలో భారీ మార్పు తీసుకువస్తుందని ఆయన అన్నారు. దేశప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం, వారి జీవితాలను సులభతరం చేయడం మా ప్రధాన కర్తవ్యమని ప్రధాని మోదీ అన్నారు. దర్భంగా ఎయిమ్స్ నిర్మాణంతో మిథిలా, కోసి, తిర్హుట్ ప్రాంతాలతో పాటు, పశ్చిమ బెంగాల్, అనేక పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సౌకర్యాలు ఉంటాయి. పొరుగు దేశం నేపాల్ నుండి వచ్చే రోగులు కూడా ఈ ఆసుపత్రిలో చికిత్స పొందగలరు. దేశంలో ఆరోగ్యానికి సంబంధించి మా ప్రభుత్వం సమగ్ర దృక్పథంతో పనిచేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. మా మొదటి దృష్టి వ్యాధి నివారణపై ఉంది. వ్యాధిని సక్రమంగా నిర్ధారించడంపై రెండో దృష్టి, ప్రజలకు ఉచితంగా, చౌకగా వైద్యం అందించడం, వారికి తక్కువ ధరకే మందులు అందజేయడం, వైద్యుల కొరతను అధిగమించడం, చిన్న పట్టణాల్లోనూ అత్యుత్తమ వైద్య సదుపాయాలు కల్పించడం నాల్గవ దృష్టి. దేశంలో ఐదవ దృష్టి ఆరోగ్య సేవల్లో సాంకేతికతను విస్తరించడం ముఖ్యమని అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం దేశంలోని పేదల జీవితాల్లో పెనుమార్పు తెస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఈ పథకం కింద దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది చికిత్స పొందారు. ఆయుష్మాన్ భారత్ పథకం లేకుంటే వీరిలో ఎక్కువ మంది ఆసుపత్రిలో చేరి ఉండేవారు కాదు. ఆయుష్మాన్ యోజన ద్వారా కోట్ల కుటుంబాలు దాదాపు రూ. 1.25 లక్షల కోట్లు ఆదా చేశాయని అన్నారు. బిహార్ లోని దర్భంగాలో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్భంగాలో ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాపన చేసి, రూ. 12,100 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. బిహార్‌లో నీతీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఆటవిక రాజ్యంగా ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు కేవలం తప్పుడు వాగ్దానాలు మాత్రమే చేశాయని.. కానీ రాష్ట్రంలో నీతీశ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. ముందు ముందు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వికారాబాద్ ఘటనపై ప్రభుత్వం సీరియస్

(మొదటి పేజీ తరువాయి..)

శ్రీధర్ బాబు ఘాటు హెచ్చరికలు చేశారు. తాజాగా డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, పొంగులేటిలు ఘాటుగా స్పందించారు. వేర్వేరుగా మాట్లాడుతూ బిఆర్ఎస్ కుట్రలను ఛేదిస్తామని అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి చేయించింది బీఆర్ఎస్సేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. దాడులతో రాష్ట్రాన్ని ఏం చేద్దామనుకుంటున్నారని ప్రశ్నించారు. కలెక్టర్‌పై దాడిని బీఆర్ఎస్ ఎందుకు ఖండించలేదని, పదేండ్లుగా సీఎంగా పనిచేసిన కేసీఆర్ దీనిపై మాట్లాడరేంటని భట్టి నిలదీశారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావడం బీఆర్ఎస్‌కు ఇష్టం లేదని చెప్పారు. దాడి చేస్తే ఊరుకుంటామని అనుకుంటే మూర్ఖత్వమే అని అన్నారు. ఎవ్వరున్నా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించడం లేదని, అమాయకులైన ప్రజలను రెచ్చగొట్టి దాడి చేయించారని డిప్యూటీ సీఎం భట్టి ఆరోపించారు. భూమి కోల్పోతున్న రైతుల బాధ తమకు తెలుసని, భూమి కోల్పోయే వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తున్నామని భట్టి చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధితోనే రూరల్ ఏరియా అభివృద్ధి చెందుతుందని వివరించారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే భూసేకరణ కీలకమని ఆయన తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తే తప్ప ప్రపంచంతో పోటీ పడలేమని భట్టి స్పష్టం చేశారు. కొడంగల్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ప్లాన్ చేస్తున్నామని, రూరల్ ఏరియాకు అభివృద్ధిని విస్తరింపజేస్తామని ఆయన వివరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తాము ప్రజల పక్షాన పోరాడామని, తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ తరహాలో వ్యవహరించలేదని బీఆర్ఎస్ తీరుపై భట్టి మండిపడ్డారు. ఉద్యమంలో కూడా అమాయకులను రెచ్చగొట్టా రని, మీ కోసం అమాయక ప్రజలు బలి కావాలా అని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. దాడి ఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అధికారులపై దాడి చేయడం అమానుషమని, అధికారం కోల్పోవడంతో ఫ్రస్టేషన్ లో బీఆర్ఎస్ నేతలు ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తున్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దాడి చేసిన వారితో పాటు దాడికి ప్రోత్సహించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను, పాల్గొన్న వారిని విడిచిపెట్టమని.. అందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్, అధికారులపై దాడికి పాల్పడిన వారు కేటీఆర్‌తో ఫోన్‌లో టచ్‌లోనే ఉన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేయవచ్చని సూచించిన మంత్రి.. కలెక్టర్, అధికారులపై దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఇక ఫోన్ ట్యాపింగ్‌లో ఉన్నవాళ్లు జైలు ఊచలు లెక్క పెట్టాల్సిందే.. వారు ఎక్కడ దాక్కున్న రప్పించి జైలుకు పంపిస్తామని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ముగ్గురు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ పత్తి కొనుగోళ్లపై నెలకొన్న సందిగ్ధంపై నోరు మెదపడం లేదని.. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ కనీసం పత్తికి మద్దతు ధర గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. నోరు తెరిస్తే మూసీ ప్రక్షాళను అడ్డుకుంటామని మాట్లాడుతున్నారు తప్ప రైతుల గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి కొందరు రైస్ మిల్లర్ల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. రైతులను ఇబ్బందులు పెట్టేవారిపై చర్యలు తీసుకుంటామని.. రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరిక చేశారు. వారం రోజులల్లోగా మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే రైతులు వరి కోతలు ప్రారంభించారని.. రైస్ మిల్లర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వికారాబాద్ ఘటన వెనుక ఉన్నవారిని గుర్తించి.. ఆ నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్ ముసుగు వేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటన వెనక ఎవరున్నారో బయటపెడతామని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి హాజరైన మంత్రి.. భూములు, ఇళ్ల సమస్యలు, హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇళ్ల గురించి అధికంగా దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినట్లు మీడియాకు తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతీ పేదవారికి ఇళ్లు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించామన్నారు. 24 లక్షల ఇళ్లు పేదలకు ఇస్తామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చామని.. ఇచ్చిన మాట ప్రకారం ఇండ్లు ఇస్తామని చెప్పారు. మొదటి విడతలో స్థలం ఉన్నవారికి నిర్మాణం కోసం డబ్బులు ఇస్తామని ఆయన చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారుల ఎంపిక చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దేశంలోనే రోల్ మోడల్‌గా కొత్త ఆర్‌వోఆర్ చట్టం తీసుకు వస్తామన్నారు. రూ. 2 లక్షలకుపైగా ఉన్న రైతుల రుణమాఫీ చేయాల్సి ఉందని, డిసెంబర్ 9వ తేదీ లోపు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

(మొదటి పేజీ తరువాయి..)

## దేశంలో ఇక బుల్డోజర్ న్యాయం చెల్లదు

రాజ్యాంగ వ్యతిరేకం అని, అలాంటి చర్యలకు పాల్పడిన అధికారులపై పెనాల్టీ వేయాలని కోర్టు సూచించింది. నిందితులు, దోషులకు కొన్ని హక్కులు ఉంటాయని కోర్టు చెప్పింది. ఈ క్రమంలో బుల్డోజర్ల న్యాయంపై దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. రాత్రికి రాత్రే మహిళలు, చిన్నారులను వీధుల్లో చూడడం సంతోషకరమైన అంశం కాదు అని కోర్టు వెల్లడించింది. ఇండ్లను, అక్రమ ప్రాపర్టీలను ధ్వంసం చేసే పక్రియను వీడియో తీయాలని సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. ప్రజాభూమిలో అక్రమ నిర్మాణం చేపడితే తమ ఆదేశాలు ఆ కేసుల్లో అమల్లోకి రావు అని కోర్టు తెలిపింది. వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అధికారులు ఒక వ్యక్తి దోషి అని తేల్చి చెప్పలేరని, జడ్జిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులను కూల్చివేయడం తగదని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, ఆయా ప్రభుత్వాల అధికారులు మితిమీరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ధిక్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ధర్మాసనం హెచ్చరించింది. కూల్చివేత పక్రియలో నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే, ఆ ఆస్తి పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల జీతం నుంచి వసూలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. 'కార్యనిర్వాహక అధికారి ఒక వ్యక్తిని దోషిగా ప్రకటించలేరు. ఆ అధికారి న్యాయమూర్తిగా మారి, నిందితుల ఆస్తులను కూల్చివేయాలని నిర్ణయం తీసుకోలేరు. ఏకపక్ష చర్యల నుంచి పౌర హక్కులకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. ఒక సామాన్య పౌరుడి ఇంటి నిర్మాణంలో అతడి ఎన్నో ఏళ్ల శ్రమ, కలలు కలగలిసి ఉంటాయి. దానిలో వారి భవిష్యత్తు, భద్రత ఇమిడి ఉంటుంది. ఆ ఇంట్లో ఒక్కరే నిందితుడు అయినప్పుడు.. అందులో నివసించే మిగతా వ్యక్తులకు ఆశ్రయం లేకుండా ఎలా చేస్తారు..? అలాగే అక్రమకట్టడాల తొలగింపు కోసం ఇంటి యజమానికి 15 రోజుల గడువు ఇవ్వాలి. అంతేగాకుండా మూడు నెలల్లో మున్సిపల్ అధికారులు ఒక డిజిటల్ పోర్టల్‌ను సిద్ధం చేయాలి. ఇప్పటివరకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు, అక్రమ నిర్మాణాలపై తుది ఉత్తర్వులకు సంబంధించిన వివరాలు అందులో పొందుపరచాలని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. అయితే, రహదారులు, ఫుట్‌పాత్‌ల మీద, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలకు తమ ఆదేశాలు వర్తించవంటూ మినహాయింపు నిచ్చింది. కాగా ఈ విషయంపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యల ద్వారా పౌరుల గొంతు నొక్కడం సరైనది కాదని.. చట్టబద్ధమైన పాలన జరుగుతున్న సమాజంలో బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ప్రజల నివాసాల రక్షణ, భద్రత వారి ప్రాథమిక హక్కుల కిందకు వస్తాయని.. వాటిని కూల్చివేసే అధికారం ప్రభుత్వాలకు ఉండదని ఆయన పేర్కొన్నారు. దీనికి అనుమతిచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా కొద్దికాలంగా 'బుల్డోజర్' చర్యలు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇది రాజకీయాల్లో కీలక అంశమైంది. బుల్డోజర్ న్యాయం పేరుతో పలు రాష్ట్రాలు ఈ అస్త్రాన్ని ప్రయోగి స్తున్నాయి. యూపీలో తొలుత మొదలైన ఈ ధోరణి.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకూ పాకింది. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాలు నిందితుల ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపైకి బుల్డోజర్లను పంపించడాన్ని ఇప్పటికే పలు మార్లు సుప్రీం కోర్టు తప్పుబట్టింది. నిందితుల ఆస్తులపైకి బుల్డోజర్లను పంపించడం సరికాదని స్పష్టం చేస్తూ, అక్రమంగా ఒక్క కట్టడాన్ని ధ్వంసం చేసినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లేనని హెచ్చరించింది.

## నరేందర్ రెడ్డి అరెస్ట్ అక్రమం

కాపాడుకునేందుకు ప్రభుత్వం పై పోరాటం చేస్తున్నారని దానికి కుట్ర చేస్తున్నారని అరెస్ట్ చేయడం సరికాదన్నారు. రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న తమపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం తీరును నిరసిస్తూ రైతులు ఆందోళన చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం రైతులను మోసం చేసి భూములు లాక్కుంటే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. తాము రైతుల పక్షాన పోరాడుతామని, తమపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు చేస్తామని బెదిరించిన తాము పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి మరియు పలువురు బీఆర్ఎస్ సీనియర్ ,నాయకులు ,తదితరులు పాల్గొన్నారు ,

# సీఎం రేవంత్‌ది తుగ్లక్ పాలన

(మొదటి పేజీ తరువాయి..)

పడుతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిది అరెస్ట్ కాదు.. కిడ్నాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం సొంత అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం అల్లుడు సత్యనారాయణరెడ్డి, అన్న శరత్‌ల ఫార్మా కంపెనీలను విస్తరించటం కోసం ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. తన ఏడు ఎకరాల భూమి పోతుందనే కలెక్టర్‌ను సురేష్ అడిగాడని.. సురేష్ అనే వ్యక్తి.. బరాబర్ బీఆర్ఎస్ నాయకుడే అని స్పష్టం చేశారు. "సీఎం రేవంత్ .. వాడో పిచ్చోడు.. ఫార్ములా వన్ ఈ రేసు గురించి ఆయనకేం తెలుసు. నిఘా వ్యవస్థ వైఫల్యం వలనే లగచర్ల ఘటన.. కలెక్టర్ గన్ మెన్లు ఎక్కడ. ప్రభుత్వ కుట్రకు పోలీస్ ఉన్నతాధికారుల బలికావద్దు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సురేష్ పద్ధతిగా.. మర్యాదగా చెప్తే తప్పా. సొంత పార్టీ కార్యకర్తలతో మా నేతలు మాట్లాడితే తప్పా. సురేష్ మమల్ని కలవటం తప్పు అయితే.. రాహుల్ గాంధీ రోజూ తిట్టే అదానీని రేవంత్ కలవటం కూడా తప్పే. హైకోర్టులో పిటిషన్లు వేసి ప్రభుత్వం జడ్జిలను కూడా తప్పుదోవ పట్టిస్తుంది. ఇది ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఇందిరా గాంధీ ఎమర్జన్సీ పాలన. రేవంత్ పిచ్చి నిర్ణయాల వలనే కొడంగల్ రగులుతోంది. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్.. మహారాష్ట్రకు మూటలు మోస్తున్నాడు. రైతులు అక్రమ అరెస్టులు జరుగుతుంటే సీఎం ఎక్కడ. షోలాపూర్ చౌరాస్తాలో నిలబడినా.. రేవంత్‌ను ఎవరూ గుర్తుపట్టరు" అంటూ వ్యాఖ్యలు చేశారు. కనీసం సతీమణికి కూడా సమాచారం ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. తీవ్రవాదుల మాదిరి రైతులను పొలాల వెంబడి తరుముతున్నారన్నారు. ఫార్మా విలేజ్ వలన వచ్చే లాభమేంటో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర పెద్దలను తాను కలవటం తప్పు అయితే.. సీఎం గవర్నర్‌ను కలవటం కూడా తప్పే అని అన్నారు. కొడంగల్



రైతులు ఆరేడు నెలలుగా రగులుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోలేదని మండిపడ్డారు. ఫార్మా సిటీని రద్దు చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు అని చెప్పి.. మళ్ళీ యూటర్న్ ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసమే ఫార్మా సిటీ నిర్ణయం తీసుకున్నామని మాజీ మంత్రి చెప్పారు. అయితే సీఎం సొంత అల్లుడు సత్యనారాయణ రెడ్డి మాక్స్ బీఎన్ ఫార్మా కంపెనీ విస్తరణ కోసమే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు వెళ్ళని రేవంత్.. మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మాత్రం వెళ్తారన్నారు. తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ చెప్తుంటే.. ఐజీ దాడి జరిగిందంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. నేను ఢిల్లీకి వెళ్లింది అనుముల కుటుంబ కుంభకోణాలు బయటపెట్టేందుకు వెళ్లానని, మళ్లీ కూడా కుంభకోణాలను బయటపెడుతూనే ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు, పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్ అంశం, రాష్ట్రంలో భూసేకరణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న దురాగతాలపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ఢిల్లీకి వెళితే బీజేపీతో కాళ్ల బేరానికి వెళ్లినట్లా..? మరీ బీజేపీకే చెందిన గవర్నర్‌ను రేవంత్ రెడ్డి కలిస్తే అది కాళ్ల బేరానికి వెళ్లినట్లు కాదా..? అదానీ కాళ్లు పట్టుకొని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన మీద ఈడీ కేసు కాకుండా చూసుకున్నాడా..? లేదా..? చెప్పండి. నేను మలేషియా వెళ్లకుండానే వెళ్లినట్లు మీడియా వాళ్లు ఎలా రాస్తారు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ తుగ్లక్ ప్రభుత్వం నిర్ణయం కారణంగా అధికారులు బలి అవుతున్నారు. ప్రభుత్వం కుట్రలో అధికారులు బలి కావద్దని కోరుతున్నా. కొడంగల్‌లో రైతులతో భూసేకరణ పంచాయితీ వచ్చినప్పుడు పిలిచి మాట్లాడని కుసంస్కార ప్రభుత్వం ఇది. మా ప్రభుత్వంలో కూడా భూ సేకరణ సమస్యలు వస్తే రైతులను మెప్పించి ఒప్పించి, వాళ్ల కడుపులో తల పెట్టి మేము మంచి పరిహారం ఇచ్చాం. మల్లన్న సాగర్ వంటి ప్రాజెక్టును పూర్తి చేశాం. కానీ ఈ ముఖ్యమంత్రికి 9 నెలలుగా కొడంగల్‌లో ఆందోళన చేస్తున్న రైతులను కలిసే సమయం లేదని కేటీఆర్ మండిపడ్డారు. కలెక్టరే స్వయంగా దాడి జరగలేదని చెబుతున్నాడు. ఐజీ మాత్రం దాడి జరిగిందంటున్నారు. కానీ ఇది ఇంటలిజెన్స్ వైఫల్యం. దాడి జరుగుతున్న సమయంలో సెక్యూరిటీ ఏదీ? ఉద్దేశ పూర్వకంగా గొడవ సృష్టించి రైతులు భూసేకరణకు సహకరించటం లేదని భూములను గుంజుకునే కుట్ర చేస్తున్నారు. ముఖ్యమంత్రికి రియల్ ఎస్టేట్ ఫార్ములా, బ్యాగ్‌ల ఫార్ములా మాత్రమే తెలుసు. ఈయనకు ఈ రేస్ అంటే ఏంటో తెలుసా..? అని ప్రశ్నించారు. 11 నెలలుగా రోజుకో కుంభకోణం పేరుతో టైంపాస్ ప్రచారం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని మీడియా కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. మేము తప్పకుండా లగచర్ల రైతులకు అండగా ఉంటాం. ఆ ప్రాంతానికి మా పార్టీ నాయకులం వెళ్తాం. పీడిత, గిరిజన రైతులకు మేము కచ్చితంగా అండగా నిలబడతాం. లంబాడా హక్కుల సమితి వాళ్లను కూడా కలిసి వాళ్లతో పోరాటం చేస్తాం. భూ సేకరణ పేరుతో రేవంత్ రెడ్డి కుటుంబం చేస్తున్న దోపిడీ ప్రజల ముందు పెడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# త్వరలో బిజెపి 119 అసెంబ్లీ నియోజకవర్గంలలో పాదయాత్ర



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
బుధవారం రోజున బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాబోయే రోజుల్లో 119 అసెంబ్లీ నియోజకవర్గంలలో పాదయాత్ర చేయాలని సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రేమేందర్ రెడ్డి, దుగ్గల్ల ప్రదీప్ కుమార్, కాసం వెంకటేశ్వర్లు, ప్రకాష్ రెడ్డి, కొల్లి మాధవి, వీరేందర్ గౌడ్, శ్రీవర్ధన్ రెడ్డి, సుభాష్, బొక్క బాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, భరత్ గౌడ్, ఆనంద్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# తెలంగాణలో ఇంత దారుణమైన దాడులు చూడలేదు

## గాయపడ్డ అధికారులను పరామర్శించిన మంత్రులు



**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**
వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో కలెక్టర్, అధికారులపై జరిగిన దాడిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ చరిత్రలో అధికారులపై ఇంత దారుణమైన దాడులు ఎన్నడూ జరగలేదని.. ఇది కుట్రతో జరిగిన దాడి అని సీరియస్ అయ్యారు. అధికారులపై దాడి తెలంగాణ సంస్కృతి కాదని అన్నారు. లగచర్ల గ్రామస్తుల దాడిలో గాయపడ్డ కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్ రెడ్డిని ఎల్బీ నగర్ ఆర్కేఆర్ ఎన్ క్లేవ్‌లోని శ్రీహర్ష నిలయంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాటాడుతూ.. తెలంగాణ చరిత్రలో ఇంత దారుణమైన దాడులు ఎన్నడూ జరగలేదని అన్నారు. అధికారులపై దాడి విధానాన్ని బీఆర్ఎస్, ఆ పార్టీ నాయకులు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఏనాడు అధికారులపై ఇలాంటి కుట్రలు కానీ.. దాడులు కానీ చేయలేదని గుర్తు చేశారు. దాడుల సంస్కృతిని ప్రోత్సహిస్తోన్న బీఆర్ఎస్ నేతలపై చర్యలు తప్పవని మంత్రి హెచ్చ రించారు. భవిష్యత్?లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు నిజంగానే అన్యాయం జరిగే అవ కాశం ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్ళాలని.. అంతేకానీ ఇలా అధికారులపై దాడులకు పాల్పడటం సమంజసం కాదని హితవు పలికారు.

# రాజకీయం కోసం దాడులు సరికాదు

## మమ్ములను బలిపశువులు చేయకండి

## ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం

**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**
రాజకీయాలు చేసుకోండి.. కానీ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయకండని రాజకీయ నాయకులకు ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై జరిగిన దాడి ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన అధికారులపై దాడి చేయడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బండలు.. కర్రలతో దాడి చేశారని.. తెలంగాణ ఉద్యమం సమయంలో కూడా ఇలాంటి దాడులు జరగలేదని అన్నారు.కులగణన చేసే సమయంలో కూడా అధికారులు, సిబ్బందిపై మాటలతో దాడి చేస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదన్నారు. లగచర్లలో కలెక్టర్‌పై దాడి జరిగితే ఐఏఎస్ సంఘాలు ఖండించలేదని.. ఉద్యోగ సంఘాల నేతలుగా మేం ఆ దాడిని ఖండిస్తున్నామన్నారు. కలెక్టర్, అధికారులపై దాడిచేసిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భౌతిక దాడులతో విధి నిర్వహణ సమయంలో మా స్వేచ్ఛను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లగచర్ల దాడి తర్వాత తెలంగాణాలో ఉద్యోగులు భయంతో పని చేస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు భూసేకరణ జరగకుండా ఎక్కడైనా అభివృద్ధి జరిగిందా అని ఆయన ప్రశ్నించారు. లగచర్లలో మొన్నటి దాడి చూస్తే సిగ్గుగా ఉందని.. ఈ ఘటనతో తర్వాత ఒంటరిగా మహిళా వెళ్లి ఉద్యోగం చేస్తదా అని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు జనాలను రెచ్చగొట్టకుండా.. చైతన్యపర్చాలని సూచించారు. లగచర్ల దాడికి నిరసనగా 2024, నవంబర్ 14వ తేదీన లంచ్ అవర్లో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు.

# బుల్డోజర్ ఇప్పుడు గ్యారేజ్‌లో ఉంటుంది

## సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్

**లక్నో, నవంబర్ 13 ( వెలుతురు) :**
బుల్డోజర్ ఇప్పుడు గ్యారేజ్‌లో ఉంటుందని ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. 'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీంకోర్టు తీర్పును ఆయన స్వాగతించారు. ఇకపై పేదల ఇళ్లను కూల్చివేయలేరంటూ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై మండిపడ్డారు. నవంబర్ 20న ఉప ఎన్నికలు జరుగనున్న కాన్పూర్‌లోని సిసామావు అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. 'సుప్రీంకోర్టు ఏం చెప్పిందో మీకు తెలిసి ఉండాలి. ఈ ప్రభుత్వానికి ప్రతీకగా మారిన బుల్డోజర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యానించింది. ఈ తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు' అని అన్నారు. కాగా, ఇళ్లు కూలగొట్టే వారి నుంచి ఏమి ఆశించాలి? అని అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. 'ఇప్పుడు వారి బుల్డోజర్ గ్యారేజ్‌లో ఉంటుంది. పేదల ఇల్లు ధ్వంసం చేయలేరు' అని అన్నారు. సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్న కవి ప్రదీప్ పంక్తులను కూడా అఖిలేష్ యాదవ్ ప్రస్తావించారు. 'ప్రతి ఒక్కరూ ఇంటి కోసం కలలు కంటారు. ఆ ఇంటి కల నెరవేర్చుకోవాలని ప్రతి వ్యక్తి కోరుకుంటాడు' అని అన్నారు. సీఎం యోగి ప్రభుత్వంపై ఇంతకంటే బలమైన విమర్శలు ఉండబోవని మండిపడ్డారు.

# భారత సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞాన సంస్థ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ) ఏర్పాటుతో వీడియో గేమింగ్ రంగంలో నైపుణ్యాభివృద్ధికి పెద్దఎత్తున ప్రోత్సాహం

**ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ (ఐడీజీసీ)లో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు**

**ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ మూడు ప్రముఖ వీడియో గేమింగ్ డెవలపర్ కాన్ఫరెన్సులలో ఒకటైన ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ 16వ ఎడిషన్ హైదరాబాద్లో ప్రారంభం**

**వచ్చే ఏడాది ప్రారంభంలో భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ సమ్మిట్ తో మీడియా, వినోద రంగాలలో భారత్ అసమాన అంతర్జాతీయ కేంద్రంగా ఆవిర్భవించే అవకాశం: శ్రీ సంజయ్ జాజు**

**వేవ్స్ 'క్రియేట్ ఇన్ ఇండియా' ఛాలెంజ్ లో పాల్గొనాలంటూ యువతకు శ్రీ జాజు పిలుపు.**





**హైదరాబాద్ వెలుతురు పిఐబి 13 నవంబర్ 2024:**
మూడు రోజుల పాటు జరిగే ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ (ఐజీడీసీ) హైదరాబాద్ లోని హెచ్ ఐసీసీలో బుధవారం రోజున ప్రారంభమైంది. దేశ విదేశాల నుంచి ఎంతో మంది గేమింగ్ నిపుణులు దీనికి హాజరయ్యారు. ఏటా జరిగే ఈ సమావేశం.. 16 వ ఎడిషన్ లో సుమారు వంద మంది అంతర్జాతీయ, స్థానిక గేమింగ్ డెవలపర్లు, పబ్లిషర్లు తమ విశేష ప్రతిభావిష్కరణలతో సందర్శకులను ఆకట్టుకోనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ సంజయ్ జాజు మాట్లాడుతూ... గేమింగ్ పరిశ్రమ, దాని భవిష్యత్తును తీర్చిదిద్దడం గురించి ప్రభుత్వ ఆలోచనలు, దార్శనికతను పంచుకున్నారు. ప్రతిభను ప్రోత్సహించడానికి, గేమింగ్, యానిమేషన్, సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న వారిని ప్రోత్సహించడానికి, ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ ను నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గా ఏర్పాటు చేస్తోందని శ్రీ జాజు తెలిపారు. ఫిక్కీ, సీఐఐలు 52 శాతం, భారత ప్రభుత్వం 48 శాతం ఈక్విటీతో పీపీపీ పద్ధతిలో ఈ సంస్థను ఏర్పాటు చేయనున్నాయి. గేమింగ్ పరిశ్రమను భారత్ కేవలం ఉదయిస్తున్న పరిశ్రమగానే కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమగా కూడా చూస్తోందన్నారు. ప్రముఖ వీడియో గేమింగ్, ఇంటరాక్టివ్ ఎంటర్ టైన్ మెంట్ కంపెనీల వ్యవస్థాపకులు, సిఎక్స్ఒలతో శ్రీ సంజయ్ జాజు సమావేశమయ్యారు. ప్రభుత్వం దృష్టిని ఆకర్షించే, జోక్యం చేసుకునే అంశాలను పరిశ్రమ పెద్దలు ఆయన ముందు ఉంచగా, వాటిని సానుకూలంగా పరిశీలిస్తామని శ్రీ జాజు హామీ ఇచ్చారు.వీడియో గేమింగ్ పరిశ్రమ ప్రధానంగా విషయం (కంటెంట్), సృజనాత్మకతపై ఆధారపడిందని, భారతదేశంలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను సృష్టించడానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ గేమ్ డెవలపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి పనిచేస్తుందని, తద్వారా భారతదేశం ప్రపంచ గేమింగ్ రంగంలో ఆధిపత్యం చెలాయించగలదని శ్రీ జాజు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీ సంజయ్ జాజు మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 5 నుండి 9 వరకు జరిగే వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్– వేవ్స్ గురించి ప్రస్తావించారు. ఈ అత్యున్నత స్థాయి సదస్సు మొత్తం మీడియా, వినోద రంగాలకు అతిపెద్ద అనుసంధాన కార్యక్రమం అవుతుందని ఆయన అన్నారు. భారతీయ స్థానిక ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పడం, ప్రపంచ పెట్టుబడిదారులను భారత్ కు తీసుకురావడమే ఈ సదస్సును నిర్వహించడం ఉద్దేశమని ఆయన అన్నారు. ప్రపంచ మీడియా, వినోద పరిశ్రమలో భారత్ వాటా కేవలం 2 శాతమేనని, ఇంకా ఏడాదికి 20 శాతం వృద్ధికి పుష్కలమైన అవకాశాలున్నాయని సంజయ్ జాజు అన్నారు. లక్ష లోపు జనాభా ఉన్న పట్టణాల కోసం 237 స్థానిక ప్రైవేట్ ఎఫ్ఎం రేడియో చానళ్లను సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ త్వరలో వేలం వేయనుందని కార్యదర్శి తెలిపారు. ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా – ఐఎఫ్ఎఫ్ఐ ప్రారంభోత్సవంలో ప్రసార భారతి– ఓటీటీని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. దూరదర్శన్ ఫ్రీ డిష్ లో అందుబాటులో ఉన్న దాదాపు 60 ఛానళ్లు ఇకపై ఓటీటీ ప్లాట్ ఫామ్ లో అందుబాటులోకి రానున్నాయి. ఈ ఓటీటీ ద్వారా చాలా వరకు అలనాటి కార్యక్రమాల (ఆర్కైవ్ మెటీరియల్) ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. భారతదేశ వీడియో గేమింగ్, ఇంటరాక్టివ్ ఎంటర్టైన్మెంట్ పరిశ్రమను ఏకీకృతం చేయడం, ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడం లక్ష్యంగా గేమ్ డెవలపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జిడిఎఐ) ను కూడా ఈ రోజు అధికారికంగా ప్రారంభించారు.

# అందరికీ ఆరోగ్యం తెలంగాణ రాష్ట్ర స్థాయి సలహా సమావేశం

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
రెండు రోజుల పాటు, రాయల్ రివే హెూటల్, సికింద్రాబాద్‌లో క్రై (CRY) మరియు ఎఫోర్ట్ (EFFORT) స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో "అందరికీ ఆరోగ్యం" అనే అంశంపై ఒక సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల క్రై ప్రతినిధి బడుగు చెన్నయ్య, సభను ప్రారంభించి, చర్చా అంశంగా 'అందరికీ ఆరోగ్యం'ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పౌష్టికాహార నిపుణులు Ms. వీణ శత్రుజ్ఞ, డాక్టర్ ఎ.ఎల్. కందారే, ప్రొఫెసర్ రామకృష్ణ, అమూల్య నిధి, మరియు పీటర్ సునీల్ బాబు పాల్గొన్నారు. పీటర్ సునీల్ బాబు (CRY) మాట్లాడుతూ, ఆరోగ్యం అనేది సమాజంలోని పెద్ద వర్గం కోసం హక్కుగా ఉండాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య సేవల పరిస్థితి, అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. అందరికీ వైద్య సేవలు అందించేందుకు ధనిక, పేద వర్గాల మధ్య తారతమ్యాలను తొలగించుకోవాలని వారు అభిప్రాయపడ్డారు. వైద్య సేవలు అందకపోవడం వలన ఈ తారతమ్యాలు వస్తున్నాయని, భవిష్యత్తులో ఈ పరిస్థితి కొనసాగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాలు, ముఖ్యంగా చెంచు పెంటలు మరియు ఆదివాసి ప్రాంతాలలో వైద్య సేవలు అందక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. వారు జనాభా ప్రాతిపదికన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHCs) ఏర్పాటు చేయాలని, పేదవారికి వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం మరింత కృషి చేయాలని సూచించారు. డాక్టర్ వీణ శత్రుజ్ఞ మాట్లాడుతూ, పౌష్టికాహార లోపం వల్ల మనుషుల్లో ఎదుగుదలలో మించిన లోపాలు వస్తున్నాయని చెప్పారు. ఇది మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేకంగా కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె జాతీయ పౌష్టికాహార పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో అధ్యయనాలు చేపట్టినట్లు చెప్పారు. గర్భిణీ స్త్రీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే వారి శిశువులు ఆరోగ్యంగా, వయసుకు తగిన బరువు మరియు ఎత్తుతో జన్మిస్తారని చెప్పారు. డాక్టర్ ఎల్. కందారే అన్నారు, త్రాగునీరు మరియు పౌష్టికాహారం లోపం వల్ల నల్గొండ వంటి ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో పిల్లల ఎముకల ఎదుగుదల సరిగ్గా లేకపోవడం, కిడ్నీ మరియు న్యూరోలాజికల్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాల్లో పిల్లల ఆరోగ్యం దెబ్బతినడం వల్ల, రక్షిత మంచినీరు మరియు పౌష్టికాహారం అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అమూల్య నిధి, నేషనల్ కన్వీనర్, జన స్వత్యా అభియాన్ సంస్థ తరఫున మాట్లాడుతూ, ప్రభుత్వాలు వైద్య సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రైవేటీకరణ విధానాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రులను బలపరిచే దిశగా కృషి చేయాలని చెప్పారు. అందువల్ల, తెలంగాణ ప్రజలు తమ హక్కులను తెలుసుకొని, ఆరోగ్య సేవలపై ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి సరైన కృషి చేయాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలు పొందేందుకు చైతన్యంగా ఉండాలని ఆయన చెప్పారు. ఇది కేవలం ప్రజా రంగం మరియు ప్రైవేట్ రంగం మధ్య పోరాటం మాత్రమే కాదు, భారత రాష్ట్ర ప్రభుత్వాలు సమానమైన, శాశ్వతమైన, మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విభిన్న జిల్లాల నుండి కమ్యూనిటీ



ఆర్గనైజర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు కార్యకర్తలు తమ చర్చా అంశాలను పంచుకున్నారు మరియు వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు పొందారు. పాశం యాదగిరి గారు మాట్లాడుతూ ప్రభుత్వము అభివృద్ధి పేరున వాతావరణకాలుశ్యం జల కాలుష్యం వెదజల్లే కంపెనీలకు అనుమతులు ఇచ్చి ప్రజల ఆరోగ్యాలకు ముప్పు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణపై మీడియా బాధ్యత ఎంతో ఉందన్నారు నేటి మీడియా యజమాన్యం ఆరోగ్యం గురించి అంత ప్రాధాన్యత ఇవ్వట్లేదు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీటర్ సునీల్ బాబు (CRY), బడుగు చెన్నయ్య (CRY), విజయకుమార్ (EFFORT), డాక్టర్ వీణ శత్రుజ్ఞ (NIN), రమామిల్కోటే (OU), డాక్టర్ ఎల్. కందారే (NIN), ప్రొఫెసర్ రామకృష్ణ, లక్ష్మణరావు, కె. రమేష్, డాక్టర్ సన్నాకి మున్నా, డీ. హిమబిందు, డాక్టర్ కంచుకట్ల సుభాష్, బాలల హక్కుల ప్రజాధ్వని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొమ్ము తిరుపతి , జేర్ర ప్రతాప్ మరియు వివిధ జిల్లాల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# సిట్టింగ్ ఎంపీ పర్యటన అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై బాల్ రెడ్డి ఫైర్



**మహబూబ్ నగర్ వెలుతురు నవంబర్ 13:**
మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న లగచర్ల పర్యటన కి వెళ్తున్న ఎంపీ డీకే అరుణమ్మ ని పోలీస్ లని పెట్టి అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ వైఖరి కి నిదర్శనం అని తెలంగాణ బీజేపీ నాయకుడు, బొక్క బాల్ రెడ్డి విమర్శించారు . ఒక పక్క ఫార్మా కంపెనీ పేరుతో రైతుల భూములు కాజేసి, నిన్న రోజంతా గ్రామంలో పోలీస్ ల ద్వారా భయభ్రాంతులకి గురిచేసిన ప్రభుత్వం, బుధవారం రోజున ఒక సిట్టింగ్ ఎంపీ అయినా అరుణమ్మ అక్కడ ప్రజలకి ధైర్యం చెప్పడానికి వెళ్తూ ఉంటే,పోలీస్ లు కార్ కి అడ్డంగా నిలబడడం ఏంటి అని ప్రశ్నించారు.రాజ్యాంగం కోసం కబుర్లు చెప్పే రాహుల్ గాంధీ,ఒక సిట్టింగ్ ఎంపీ హక్కులు తమ ముఖ్యమంత్రి కాలరాస్తుంటే చూస్తూ కూర్చుంటారా అని అడిగారు.అరుణమ్మ ని అడ్డుకోవడం అంటే సూర్యకాంతి ని అడ్డుకోవడం లాంటిది అని రేవంత్ రెడ్డి గ్రహించాలి అని చెప్పారు.అరుణమ్మ అక్కడికి వెళ్తే తన బండారం,తన కుటుంబ సభ్యుల బండారం బయటపడుతుంది అనే భయమే ఇలా చేయడానికి కారణం అని,దీనిని ఖండిస్తున్న అని తెలిపారు



(మొదటి పేజీ తరువాయి..)

# కుంచించుకుపోయిన బతుకమ్మకుంట

నగరంలోని బతుమ్మకుంట కుంచించుకుపోయింది. వ్యర్థాలతో నింపి ఆక్రమించినట్లు గుర్తించారు. అయితే ఇక్కడి నిర్మానాల జోలికి వెళ్లరాదని హైడ్రా నిర్ణయించింది. అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దాని పునరుద్ధరణపై స్థానికులతో మాట్లాడారు. నిర్మాణ వ్యర్థాలు పోసి ఆక్రమించడంతో 16 ఎకరాలు ఉన్న బతుకమ్మ కుంట 5.15 ఎకరాలకు కుచించుకుపోయిందని, స్థానికుల విజ్ఞప్తితో చెరువు పునరుద్ధరణ పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. నివాసాలు, నిర్మాణాల జోలికి హైడ్రా వెళ్లదంటూ స్థానికులకు రంగనాథ్ భరోసానిచ్చారు. హైడ్రా కమిషనర్ రాకతో బతుకమ్మ కుంట పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు భద్రత మధ్య రంగనాథ్ బతుకమ్మ కుంటను పరిశీలించారు. అనంతరం ఆయన మిడియాతో మాట్లాడారు. 'బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు. కుంటను పునరుద్ధరిస్తాం. కూల్చివేతల చేపడతామనే అపోహ స్థానికుల్లో ఉంది. దాన్ని తొలగించేందుకే బతుకమ్మకుంటకు వచ్చాను. ప్రస్తుతమున్న ఐదు ఎకరాల విస్తీర్ణంలోనే పునరుద్ధరణ చేస్తాం. చెరువులోకి వరద నీరు వచ్చే మార్గాలపై అధికారులతో చర్చిస్తాం. హైడ్రాకు నోటీసులు ఇచ్చే అధికారం ఉంది. ఆక్రమణదారులకు హైడ్రా నోటీసులు వెళ్తూనే ఉంటాయని రంగనాథ్ తెలిపారు.

# సంపాదకీయం..

## గురివింద సామెత చందంగా కెటిఆర్ వ్యవహారం !

తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా ..అని వేమన ఏనాడో చెప్పాడు. ఇది అచ్చంగా బిఆర్ఎస్ నేతలకు వర్తిస్తుంది. మరీ ముఖ్యంగా కెటిఆర్, హరీష్ రావులకు అచ్చుగుద్దినట్లుగా ఉంటుంది. మొగుణ్ణి కొట్టి మొగుసాలకు ఎక్కిందన్నది సామెత. చేసిన తప్పులన్నీ చేసి..ఇప్పుడు కాంగ్రెస్ మీదపడి ఏడుస్తున్నారు. పదేళ్ల పాపాల గురించి మాట్లాడరు. తమ పాలనలో అవినీతి వ్యవహారాల గురించి సమాధానం చెప్పరు. తమ పాలనలో మల్లన్నసాగర్ రైతులు తిరగబడితే ఎందుకు కేసులు పెట్టారో చెప్పరు. ఖమ్మం జిల్లాలో రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో..ఎందుకు బేడీలు వేశారో చెప్పరు. కాళేశ్వరం అవినీతిపైనా మాట్లాడారు. వికారబాద్ జిల్లాలో రైతులను రెచ్చగొట్టిన ఘటనకు సమాధానం చెప్పాలి. నిజానికి ఫార్మా కంపెనీల సృష్ట ప్రదాత కెటిఆర్. దానిని ఎవరూ కాదనలేరు. రైతుల భూములను అడ్డంగా లాక్కుని వ్యాపారం చేయడం ఎవరు చేసినా నిలదీయాల్సిందే. కానీ బిఆర్ఎస్ కాదు. అది ప్రజలకు వదిలేయాలి. అవినీతి నేతలు నీతులు వల్లించడం సరికాదు. ఎందుకంటే బిఆర్ఎస్ గురించి చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా అవినీతి కథలు ఉన్నాయి. కానీ ఎదురుదాడి చేయడం, గగ్గోలు పెట్టడం ద్వారా పదినెలల ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్నారు. నిజంగానే అవినీతి జరిగితే బయటకు లాగుదాం. కానీ పదేళ్ల అవినీతి గురించి చర్చించకుండా..కేవలం పది నెల్లలోనే అవినీతి జరిగిందని చెప్పడం గురివింద సామెతను గుర్తు చేస్తోంది. ముందుగా పదేళ్ల అవినీతిపై ఊరూవాడా చర్చిద్దాం. ఎవరెవరి భూములు పోయాయో, ధరణితో ఎంతమందిని మోసం చేశారో చర్చిద్దాం. అవినీతిపై చర్చలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరున్నా వదిలిపెట్టకుండా రచ్చబండ ఏర్పాటు చేస్తే మంచిది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ తర్వాత పార్టీలోని కొందరు కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలతో సహజంగానే పార్టీలో కొంత నీరసం ఆవహించింది. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెల్చుకోక పోవడం కూడా గులాబీ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ పడింది. ఆ తర్వాత కొద్ది పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు పార్టీ మారడంతో కారు పార్టీలో నిస్తేజం నిండింది. మరోవైపు ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ రాజకీయ మౌనం పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ప్రతిపక్ష నేతగా చురుకుగా ఉండాల్సిన కెసిఆర్ ఇంటికే పరిమితం కావడం దారుణం కాక మరోటి కాదు. అధికారం లేకుంటే అసెంబ్లీలో అడుగు పెట్టమన్న రీతిలో కెసిఆర్, జగన్ తీరు ఉంది. ఈ క్రమంలో తమపై అవినీతి కేసుల దాడి పెరగడంతో ఆత్మరక్షణ కోసం బిఆర్ఎస్ విన్యాసాలు చేస్తోంది. ఎదురుదాడిని ఎంచుకుంది. ఇవన్నీ ప్రజలు నమ్ముతారని అనుకుంటే అవివేకం తప్ప మరోటి కాదు. ఇవన్నీ ఎక్కడ మెడకు చుట్టుకుంటాయో అన్న భయంతోనే కెటిఆర్ గత కొద్ది రోజులుగా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఇద్దరూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. అంశాలవారీగా కాంగ్రెస్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక విషయంలో న్యాయస్థానంలో సవాల్ విసిరారు. గతంలో ఎమ్మెల్యేలను మరి గొర్రెల్లాగానే కొనుగోలు చేశారా అన్నది చెప్పాలి. నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వరదలు, రైతుల రుణ మాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన,ఎమ్మెల్యే కౌషిక్ రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే అరికలపూడి గాంధీ సవాళ్ల వంటి అంశాలపై గగ్గోలు చేస్తున్నారు. ఇంత ప్రజాస్వామ్యయుతంగా మాట్లాడుతున్నారంటే అది రేవంత్ రెడ్డి సర్కార్ కల్పించిన స్వేచ్ఛ అని చెప్పక తప్పదు. గతంలో జర్నలిస్టులను మాట్లాడనీయలేదు. సోషల్ మీడియా వారిపైనా కేసులు పెట్టారు. వేధింపులు చేశారు. సిఎంను కలవకుండా చేశారు. మంత్రుల దగ్గరకు రాకుండా కట్టడి చేశారు. ఇన్ని మాట్లాడుతున్న కెటిఆర్ తన హయాంలో జరిగిన అవినతి కేసుల గురించి ముందుగా సమాధానం చెప్పాలి. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో విదేశీ కంపెనీకి అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.55 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని, ఈ కేసులో ఏసీబీ విచారణ చేస్తోంది. ఈ క్రమంలో కెటిఆర్‌ను ఎసిబి అరెస్టు చేస్తోందని కాంగ్రెస్ మంత్రులు గత కొద్ది రోజులుగా చెబుతున్నారు. అరెస్టుపై గవర్నర్ అనుమతి తీసుకున్నారని త్వరలోనే కేటీఆర్ అరెస్టు అవడం ఖాయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మంత్రి కేటీఆర్ ఢిల్లీ యాత్ర అందరినీ ఆకర్షించింది. అరెస్టు నుండి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వ సాయం కోసమే ఢిల్లీ వెళ్లారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన చేశారు. గతంలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితకు బెయిల్ ఎలా వచ్చిందో కూడా తమ వద్ద ఆధారాలున్నాయని చెప్పడం గమనార్హం. ఇలా తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో కేటీఆర్ ఢిల్లీలో కాలుపెట్టడం మరింత సంచలనానికి దారి తీసింది. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయకారి ఒప్పందం ఉందని అందరికీ తెలిసిదే. బీజేపీ నేతలతో మంతనాలు జరిపేందుకేనా అన్న ఊహాగానాలు చెలరేగాయి. ఈ క్రమంలో తెలంగాణలో తనపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా మంత్రి కేటీఆర్ అమృత్ టెండర్ల వ్యవహారన్ని తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అమృత్ పథకంలో స్కాంకు తెరలేపారని ఆరోపించారు. అమృత్ పథకంలో పనులకు గాను 8888 కోట్ల టెండర్లను పిలిచిన రేవంత్ రెడ్డి తన బావమరిది సృజన్ రెడ్డి కంపెనీ కట్టబెట్టారని కేంద్ర పురపాలక శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయనకు అందజేశారు. పార్లమెంట్ సమావేశాల్లోగా రేవంత్ సర్కార్ పై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. అంతే కాకుండా రెవెన్యూ మంత్రి పొంగులేటికి సంబంధించిన స్కాంలను బయటపెడతానని హెచ్చరించారు. తప్పులేదు. రేవంత్, పొంగులేటిలు తప్పు చేసివుంటే కోర్టుకీడ్చాల్సిందే. అందుకే అందిరి అవినీతిపైనా చర్చ జరగాలి. విచారణ జరగాలి. కేసులు వేయాలి. అందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు మాత్రమే పరిష్కారం చేయగలవు.

# అవినీతి వ్యవహారాల్లో కేంద్రం స్పందించేనా

### బిజెపి చిత్తశుద్ది నిరూపించుకునేనా

### అమృత్ టెండర్లతో సహా కాలేశ్వరంపైనా విచారించగలదా

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
అవినీతి వ్యవహారాల్లో కేంద్రం ఎప్పుడూ నిజాయితీగా వ్యవహరించడం లేదు. అవినీతి వచ్చిన సందర్భాల్లో విచారణలు జరగడం లేదు. అవినీతి నేతలను నిలదీయడం లేదు. కేసులు కూడా తెమలడం లేదు. కేవలం ఇడి, సిబిఐలు దాడులు చేయడం, జైళ్లకు పంపడం, విచారణలు సాగడం, బెయిళ్లు రావడం షరామామూలుగా మారింది. ఈ క్రమంలో దేశంలో రాజకీయ నేతలకు కేసుల భయం లేకుండా పోయింది. బిఆర్ఎస్ నేతల అవినీతి, జగన్ అవినీతిపైనా చర్యలు లేవు. ఇప్పుడు రేవంత్‌పైనా కెటిఆర్ ఆరోపణలు చేస్తున్నారు. అవినీతికి పాల్పడుతున్నారని, కాంగ్రెస్ కోసం ఎన్నికల ఖర్చును పంపుతున్నారని, రాహుల్‌కు కప్పం కడుతున్నారని ప్రధానంగా బిజెపి కూడా ఆరోపిస్తోంది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ఢిల్లీ వేదికగా ఆరోపణలు చేయడం వెనక కాంగ్రెస్‌ను దెబ్బకొట్టడం ద్వారా బిజెపికి మేలు చేస్తున్నారా అన్న చర్చ సాగుతోంది. ఇటీవలే మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ చేపట్టిన పథకాలపైన మాట్లాడి అక్కడి ఓటర్లను ప్రభావింత చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కేటీఆర్ ఢిల్లీ వెళ్లి మరీ కాంగ్రెస్ సర్కార్ ను, రేవంత్ తీరును గట్టిగా విమర్శిస్తూ మాట్లాడటం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే అమృత్ పథకంలో అవినీతికి తెరలేపారని చెప్పే ప్రయత్నం చేయడం, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటిపై ఈడీ దాడులు, ఏకంగా రేవంత్ రెడ్డి స్వంత నియోజకవర్గం కొడంగల్ లో ఫార్మా కంపెనీకి తన స్వంత అల్లుడి కోసం భూములు కట్టబెడుతున్నారని అందులో భాగంగా అక్కడి ప్రజలు తిరగబడ్డారని ఢిల్లీ పర్యటనలో చెప్పే ప్రయత్నం చేశారు. అటు బీజేపీకి- ఇటు బీఆర్ఎస్ కు ఉమ్మడి శత్రువు కాంగ్రెస్. ఈ నేపధ్యంలో కేటీఆర్ కామెంట్స్ ఎంతో కొంత



బీజేపీకి లాభం చేకూర్చే అంశం అనే చెప్పాలి. ఇదంతా బిజెపితో కలిసి ప్లాన్ చేశారని రాజకీయంగా చర్చ సాగుతోంది. ఇది ఆ రెండు పార్టీల వ్యూహంలో భాగమా.. లేక తనపై ఆరోపణలు చేసినందుకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారా అన్నది మాత్రం ఇప్పటికిప్పుడు చెప్పలేకపోయినా రానున్న రోజుల్లో బీజేపీ- బీఆర్ఎస్ దోస్తానా బయటపడనుంది. ప్రస్తుతం కేటీఆర్ ఢిల్లీ యాత్ర మాత్రం రాజకీయ వర్గాల్లో తీవ్రమైన చర్చకు దారి తీసిందనడంలో మాత్రం ఎలాంటి సందేహం లేదు. తెలంగాణలో జరిగిన అమృత టెండర్ల స్కాంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌కి తెలంగాణ ఏటీఎంలా మారిందని ఆరోపించిన ఆయన... తెలంగాణలో జరుగుతున్న అవినీతిపైన స్పందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జరుగుతున్న అవినీతి గురించి మహారాష్ట్ర ఎన్నికల్లో మాట్లాడడం కాదని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ టాక్స్ ఆరోపణలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆధారాలతో సహా తెలంగాణ అమృత్ టెండర్లలో అవినీతిపైన ఫిర్యాదు చేశామని ప్రధానమంత్రి స్పందిస్తారో లేదో చూడాల్సి ఉంది. నరేంద్ర మోడీ, బిజెపి నేతలు చేస్తున్న ఆరోపణలు నిజమే అయితే అమృత్ టెండర్లలలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇది బిజెపి చిత్తశుద్ధికి ఒక పరీక్ష అని గుర్తించాలి. అమృత్ టెండర్లలో ముఖ్యమంత్రి, మంత్రుల కుటుంబ సభ్యులకు టెండర్లు ఇచ్చారని కేటీఆర్ ఆరోపణ. రూ. 8888 కోట్లపైగా టెండర్లు ప్రభుత్వం పిలిచిందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ అవినీతిపై చర్యలకు దిగితే గతంలో కాళేశ్వరం ఎటిఎం అన్న ప్రధాని మోడీ బిఆర్ఎస్‌పైనా చర్యలు తసీఉకోవాల్సి ఉంటుంది. ఇది బిజెపి చేస్తేనే చిత్తశుద్ధిగా కేంద్రం వ్యవహరించినట్లుగా చూడాలి. లేకుంటే లోపాయకారి వ్యవహారం ఉన్నట్లే. తెలంగాణలో జరుగుతున్న అనేక అవినీతి కార్యక్రమాలపై ఎండగడ తామన్న బిజెపికి ఇదో మంచి అవకాశం. ఎలాంటి అర్హతలు లేకున్నా టెండర్లు కట్టబెట్టారంటున్నారు కేటీఆర్. ఇందుకోసం అన్ని అర్హతలు ఉన్న ఇండియన్ హ్యూమ్ పైప్ అనే కంపెనీ ఉపయోగించారన్నారు. కానీ టెండర్లు గెలుచుకున్న కంపెనీ కేవలం 20 శాతం పనులనే చేస్తుందన్నారు. మిగిలింది అంతా కేవలం రెండు కోట్ల రూపాయల వార్షిక లాభం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది కంపెనీకి ఇచ్చారని అంటున్నారు. ఈ మేరకు ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ స్టాక్ ఎక్స్చేంజికి సమాచారం ఇచ్చారన్నారు. అమృత్ టెండర్లపైన కేంద్రమంత్రి మనోహర్‌లాల్ కట్టర్ ఫిర్యాదు చేసినప్పుడు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు కేటీఆర్. తనపై ఎలాంటి కేసు పెట్టుకున్నా, విచారణలు చేసుకున్నా భయం లేదంటున్న కేటీఆర్ తనపై వచ్చిన ఆరోపణలపైనా విచారణ కోరాలి. తాను సుద్దపూసనని చెప్పడం సరికాదు.

# మరోమారు మోడీ విదేశీ పర్యటన

### 17 ఏళ్ల తరవాత తొలిసారిగా నైజీరియాకు ప్రధాని

### 16 నుంచి 21 వరకు వివిధ దేశాల్లో మోడీ పర్యటనలు

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు ఖండాల్లో మూడు దేశాలు పర్యటించనున్నారు. నవంబర్ 16 నుంచి 21 వరకు ఆయన ఆఫ్రికా ఖండంలోని నైజీరియాతో పాటు దక్షిణ అమెరికా ఖండంలోని బ్రెజిల్, గయానా దేశాలను సందర్శించనున్నారు. గ్లోబల్ సౌత్ నినాదంతో ప్రపంచం లోని దక్షిణ దిక్కున ఉన్న దేశాల గళాన్ని బలంగా వినిపిస్తున్న ప్రధాని మోదీకి ఈ మూడు దేశాల పర్యటన వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారింది. ఆయా దేశాలతోనే కాదు, ఆ ఖండాలతోనే సంబంధాలను మరింత మెరుగుపరుచుకోవడంలో ఈ పర్యటన కీలకంగా మారనుంది. ప్రధాని నరేంద్ర మోదీ రెండు ఖండాల పర్యటన వివిధ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచ వేదికపై భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాలతో పాటు కరేబియన్ దీవుల్లో దేశాలతో భారత బంధం మరింత దృఢోపేతం కానుంది.ప్రధాని మోదీ నైజీరియా పర్యటన విశేషాలను గమనిస్తే.. 17 ఏళ్ల తర్వాత భారత ప్రధాని తొలిసారిగా నైజీరియాలో పర్యటిస్తున్నారు. ఆ దేశ అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధాని మోడీ, నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు మధ్య వివిధ అంశాలపై చర్చలు జరుగుతాయి. ఇవి రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించడం, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో దోహదపడతాయి. భారత్, నైజీరియా దేశాలు 2007 నుంచి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి.



ఇందులో భాగంగా ఆర్థిక, ఇంధన, రక్షణ రంగాల్లో సహకారం అందించే ఒప్పందాలు కూడా ఉన్నాయి. దాదాపు 200 భారతీయ కంపెనీలు నైజీరియాలో ఇప్పటికే 27 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టాయి. ప్రధాని మోదీ ఇక్కడ భారతీయ సమాజాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ పర్యటన రెండు దేశాల మధ్య సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. నవంబర్ 18, 19 తేదీల్లో బ్రెజిల్‌లోని రియోడిజనీరో నగరంలో జరగనున్న జి20 సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారు. గతేడాది జీ-20 సదస్సును భారత్ విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఆ సదస్సుకు బ్రెజిల్ వేదికైంది. ప్రస్తుతం బ్రెజిల్, దక్షిణాఫ్రికాతో పాటు భారతదేశం కూడా ఉ20 ట్రోకాలో భాగంగా ఉంది. ఈ సమ్మిట్‌లో ప్రధాని మోదీ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన వివిధ అంశాలపై భారతదేశ వైఖరిని వ్యక్తపరుస్తారు. భారతదేశంలో ఉ20 న్యూఢిల్లీ లీడర్స్ స్టేట్‌మెంట్ ఫలితాలను కూడా సమీక్షిస్తారు. అంతే కాకుండా జి-20లో పాల్గొనేందుకు వచ్చిన పలువురు ప్రపంచ నేతలతో కూడా ప్రధాని ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. 1968 తర్వాత భారత ప్రధాని గయానాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడంతో ప్రధాని మోదీ గయానా పర్యటన చారిత్రక సందర్భంగా మారింది. గయానా అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ ఇర్ఫాన్ అలీ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. గయానాలో వలస పాలకుల కారణంగా భారత సంతతి ప్రజలు శతాబ్దాల క్రితమే వెళ్లి స్థిరపడ్డారు. అక్కడి జనాభాలో 31 శాతం హిందువులు ఉన్నారు. 2023లో ప్రెసిడెంట్ అలీ ఇండోర్‌లో జరిగిన 17వ ప్రవాసీ భారతీయ దివస్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రవాసీ భారతీయ సమ్మాన్‌తో ఆయన్ను సన్మానించారు. గయానాలో భారత ప్రధాని మోదీ, ఆ దేశాధ్యక్షుడు అలీ, ఇతర సీనియర్ నాయకులతో కీలక చర్చలు జరుపుతారు. అలాగే గయానీస్ పార్లమెంటును ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. భారతీయ ప్రవాసుల ప్రధాన సమావేశంలో కూడా ప్రధాని పాల్గొంటారు. ప్రధాన మంత్రి ఇక్కడ జరిగే రెండవ అంఖీఎఅక్షఓ-ఇండియా సమ్మిట్‌లో కూడా పాల్గొంటారు. అంఖీఎఅక్షఓ సభ్యదేశాల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఇది కరేబియన్ ప్రాంతంతో భారతదేశ స్నేహబంధాన్ని మరింతగా బలోపేతం చేయనుంది.

# మణిపూర్‌లో చల్లారని హింస

### మరోమారు కర్ఫ్యూ విధించిన అధికారులు




**ఇంఫాల్,నవంబర్13( వెలుతురు):**
మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగడం ఆందోళన కలిగించే అంశం. గత ఏడాదిగా మణిపూర్ ఆందోళనలు కొలిక్కి రావడం లేదు. ఈ క్రమంలో తాజా ఘటనల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించినట్లు అధికారులు తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని, భద్రతా అధికారులు తెలిపారు. మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లాలో భద్రతా బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో 11 మంది సాయుధ గ్రూపు సభ్యులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత, ఇంఫాల్‌లోయలో పలు ప్రాంతాల్లో హింసాకాండ చెలరేగిందని, ఇరు వర్గాలకు చెందిన సాయుధ సమూహాలు ఎదురు కాల్పులకు పాల్పడ్డాయని పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంఫాల్ పశ్చిమ, ఇంఫాల్ తూర్పు జిల్లాల్లో వివిధ గ్రామాల నుండి హింసాత్మక ఘర్షణలు నమోదయ్యాయని పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిషేధాజ్ఞలు విధించినట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. అదే సమయంలో తప్పిపోయిన వ్యక్తుల జాడ కోసం ఆపరేషన్ ప్రారంభించినట్లు పేర్కొంది. ఎన్‌కౌటర్‌లో మరణించినవారంతా కుకీ తెగకు చెందినవారని స్థానిక మీడియా వెల్లడించింది. కుకీల హత్యకు నిరసనగా కొండిపాంతాల్లోని ఆ తెగ మెజారిటీగా ఉండే ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 5.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు బంద్‌కు పిలుపునిచ్చింది.

### తిరుమలలో సామాన్యుల దర్శనం కోసం చర్యలు

### నేరుగా కౌంటర్ల వద్ద టోకెన్లు ఇచ్చేలా నిర్ణయం

**తిరుమల,నవంబర్13( వెలుతురు):**
తిరుమలలో భక్తులకు సులభ దర్శనం కోసం అధికారులు కృషి చేస్తున్నారు. దర్శనం కోసం నేరుగా వచ్చే భక్తులకు వేంకటేశ్వరుడి దర్శన టికెట్ల కేటాయింపు పక్రియను మరింత సులభతరం చేసినట్లు టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. గోకులం సమావేశ మందిరం వెనుక వైపు దర్శన టికెట్ల నూతన కౌంటర్ ను ఆయన బుధవారం ఉదయం ప్రారంభించారు. కౌంటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వయంగా యాత్రికుల వద్ద వివరాలు తీసుకుని మొదటి టికెట్ ను కేటాయించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఈవో మీడియాతో మాట్లాడుతూ ?. గతంలో ఉన్న వేంకటేశ్వరుడి కౌంటర్ క్యూలైన్లలో వర్షం పడినప్పుడు యాత్రికులు ఇబ్బంది పడటాన్ని గుర్తించి ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు. రోజుకు 900 టికెట్లను ఆఫ్ లైన్ ద్వారా కేటాయిస్తున్నట్లు తెలిపారు. గతంలో టికెట్ కేటాయింపునకు మూడు నుండి నాలుగు నిమిషాల సమయం పట్టేదనీ, ప్రస్తుతం ఒక నిమిషంలో టికెట్ కేటాయించేలా అప్లికేషన్ లో మార్పులు చేసినట్లు వెల్లడించారు. ఐదు కౌంటర్ల ద్వారా యాత్రికులు సులభతరంగా టికెట్లు కొనుగోలు చేయవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సిఇ సత్య నారాయణ, డిప్యూటీ ఈవో రాజేంద్ర, వీజీవో సురేంద్ర, ఏఈవో కళష్ణయ్య, ఇతర అధికారులు పాల్గన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

డెక్కన్ హాస్పిటల్ సోమాజిగూడ ఆధ్వర్యంలోచందిప్పలో ఉచిత వైద్య శిబిరం







**శంకర్పల్లి వెలుతురు నవంబర్ 13**

డెక్కన్ హాస్పిటల్ సోమాజిగూడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని డెక్కన్ హాస్పిటల్ ఎండి డాక్టర్ డీసీ రెడ్డి తెలిపారు. పేద రోగులకు అండగా డెక్కన్ హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ రామ్మోహన్ వారి సిబ్బందితో దాదాపు 150 మంది రోగులకు గుండె, కంటి, దంత, షుగర్, బిపి, చర్మ సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డెక్కన్ హాస్పిటల్స్ సోమాజిగూడ చైర్మన్ డాక్టర్ డి సి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మూసి పరివాహక ప్రాంతంలో పాటు ఆయా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మూలశేఖర్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్ విద్యాసాగర్, కోనపురం శేఖర్, ఉత్తర పల్లి వంశీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, పెంటారెడ్డి, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అమెరికా కార్డియాలజిస్ట్ డా. ఆళ్ళ శ్రీనివాసరెడ్డికి మరకత శివాలయానికి ఆహ్వానం



**శంకర్‌పల్లి వెలుతురు నవంబర్ 13**

అమెరికా కార్డియోలోజిస్ట్ డా. ఆళ్ళ శ్రీనివాసరెడ్డిని మరకత శివాలయ ఆల్ ఇండియా ప్రచార కమిటీ చైర్మన్ ధూపాటి దయాకర్ రాజు బుధవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆలయ చైర్మన్ దయాకర్, శ్రీనివాస్ రెడ్డిని ఆశీర్వదించి మరకత శివాలయ చిత్రపటాన్ని బహుకరించి ఆలయానికి ఆహ్వానించారు. సమయం చూసుకొని శంకర్‌పల్లి మండల చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ దర్శనానికి వస్తానని డాక్టర్ తెలిపినట్టు దయాకర్ రాజు పేర్కొన్నారు.

## నాగోల్ జంక్షన్ నుంచి బండ్ల గూడ వరకు నిర్మించే రోడ్డు కు శంకుస్థాపన కార్య క్రమంలో పాల్గొన్న ఏమ్మెల్యే సుధీర్ రెడ్డి



**వెలుతురు, ఎల్ బి నగర్, నవంబర్ 13:**

ఎల్ బి నగర్ నియోజక వర్గం నాగోల్ డివిజన్ పరిధిలోని నాగోల్ జంక్షన్ నుంచి బండ్లగూడా తాజా టిఫిన్స్ వరకు నూతనంగా నిర్మించే బి.టీ.రోడ్డు పనులకు బుధ వారం ఏ మ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్,ఆనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్ గౌడ్,డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ భారస పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి,సతీశ్ యాదవ్,శిల్ప, ఆజాద్,రంజిత్, శ్రీధర్ అధికారులు డి.ఈ.కనకయ్య, ఏ.ఈ.దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ శ్రీ నిలయంలో కాళోజీ వర్ధంతి

నివాళులు అర్పించిన మాభూమి సభ్యులు

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 13:**



'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించిన కాళోజీ నారాయణరావు గారి వర్ధంతిని ఎల్ బి నగర్ లోని వాసవీ శ్రీ నిలయంలో మాభూమి సాహితీ సాస్కృతిక చైతన్య వేదిక ఆధ్యాంలో వారి ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిదిగా జీవితాంతం ప్రజలకోసం జీవించి మరణానంతరం కూడా ప్రజల ఉపయోగార్థమే తన దేహాన్ని వైద్య కళాశాలకు అంకితం ఇవ్వడాన్ని మన మంతా ఆదర్శంగా తీసుకుని అవయవ దానం గాని, శరీర దానం కానీ చేయాలనీ వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాభూమి కార్యవర్గ సభ్యులు నరసింహ ప్రసాద్, ఉదయ్ శంకర్,యానాల నాగిరెడ్డి, రఘునందన్, శరణ్య, పద్మలత, విజయకుమార్, పవన్ కుమార్ రెడ్డి, శంకర్, అలివేలు మంగ, ఉమాదేవి, యాదగిరి, శంకర్, ఘంటా సుబ్రహ్మణ్యం మరియు చంద్రకళ పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే గారి చేతుల మీదగా వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం మరియు చెరువులో చేపల పంపిణీ కార్యక్రమం

**వెలుతురు న్యూస్ తలకొండపల్లి నవంబర్ 13.**



రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం లోని రాంపూర్ గ్రామం లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కల్వకుర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గారు. ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గారు మాట్లాడుతూ రైతులందరూ ప్రభుత్వ వడ్లకు కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలనీ కోరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల గురించి చేపట్టిన చెరువులలో చేపల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి , పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి , కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ , తలకొండపల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి mro గారు dfo పూర్ణిమ , రాంపూర్ గ్రామం మాజీ సర్పంచ్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి , రాంపూర్ సింగల్ విండో డైరెక్టర్ ఎండి నయీముద్దీన్ , మరియు సింగల్ విండో డైరెక్టర్ బృందం రాంపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ తిక్కల వెంకటయ్య , రాంపూర్ గ్రామ పెద్దలు కృష్ణా రెడ్డి గారు కాకి కృష్ణ గారు తిరుపతి రెడ్డి హరి మోహన్ రెడ్డి హరి మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు వివిధ గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు ప్రజలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాఠశాలకు పుస్తకాల వితరణ

### మాజీ ఉపసర్పంచ్ కావ్య కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ వారు లైబ్రరీ బుక్స్ అందజేత



**చేవెళ్ల వెలుతురు నవంబర్ 13**

చినిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ మంచి పాఠ్య పుస్తకం కొనుక్కో అని అన్న కందుకూరి వీరేశలింగం పంతులు ఆలోచనను ఆచరణలో పెడుతూ జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ వారు కందవాడ మాజీ ఉపసర్పంచ్ గౌండ్ల కావ్య కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలకు దాదాపు 30 వేల రూపాయల విలువగల విలువైన పుస్తకాలను విద్యార్థిని విద్యార్థులకు అందించడం జరిగింది. కందవాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోవ లక్ష్మి నిర్వహించే విద్యా కార్యక్రమాలను ప్రయోగాత్మక విద్యను చూసి ప్రభావితులై గ్రామస్తులు కావ్య క్రిష్ణ గౌడ్ ఈ పుస్తకాలను జాయ్ ఆఫ్ రీడింగ్ వారి సహకారంతో పాఠశాలకు ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోవ లక్ష్మి మాట్లాడుతూ ఈరోజు జాయ్ ఆఫ్ రీడింగ్ వారు విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ పుస్తకాలతో గ్రంథాలయాన్ని విద్యార్థులకు వాడుకలోకి తేవాలని అనుకుంటున్నట్లు ఈ రోజుల్లో సెల్ ఫోన్ లకు అలవాటు పడిన విద్యార్థులు పుస్తకాలకు దూరమై పఠనా శక్తిని కోల్పోతున్నారని జాయ్ ఆఫ్ రీడింగ్ వారు అందించిన పుస్తకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కావ్య క్రిష్ణ గౌడ్ ద్వారా మా పాఠశాల కార్యక్రమాలను చూసి ఆకర్షితులై గ్రంథాలయం నిర్వహణకు పుస్తకాలను అందించిన జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ వారికి ముఖ్యంగా హరిణి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణ గౌడ్, ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, రజినీ, దర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

## ధారూర్ జాతరకు ప్రత్యేక బస్సులు నడపాలని కోరిన పాస్టర్లు..

**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**



వికారాబాద్ జిల్లా ధారూర్ లో ప్రతి సంవత్సరం నవంబర్ మాసంలో మెథడిస్ట్ ప్రార్థన కూడికలు (జాతర ) నిర్వహించుకోవడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి నవంబర్ 12 మంగళవారం నుండి 17 నవంబర్ ఆదివారం వరకు జాతర ఉంటుంది. కావున జాతరకు తెలంగాణ రాష్ట్రంలో నుండే కాక కర్ణాటక మహారాష్ట్ర నుండి అత్యధిక ప్రజలు రావడం జరుగుతుంది. మన జహీరాబాద్ ప్రాంతం నుండి కూడా అనేక భక్తులు జాతరకు వెళ్ళుతుంటారు. కావున జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ధారూర్ క్రైస్తవ జాతరకు ప్రత్యేక బస్సులు నడపాలని స్థానిక పాస్టర్లు జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ ను కోరి వినతి పత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించిన మేనేజర్ దారూర్ జాతరకు శుక్రవారం 15 వ తేదీ నుండి ఆదివారం 17 వరకు ప్రత్యేక సర్వీసు బస్సులు నడుపుతామని తెలిపారు. అదేవిధంగా రైల్వే శాఖ వారు ఈ జాతరకు ప్రత్యేకంగా బీదర్ నుండి జహీరాబాద్ మీదుగా ప్రత్యేకమైన రైళ్లు కూడా ఏర్పాటు చేశారని సమాచారం. ఈ కార్యక్రమంలో రెవరెండ్ పాస్టర్ ఇజ్రాయేల్, రెవరెండ్ పాస్టర్ సామ్యూల్, రెవరెండ్ పాస్టర్ రవి, రెవరెండ్ పాస్టర్ అరుణ్ కుమార్, రెవరెండ్ పాస్టర్ విజయ్ చందర్ తదితరులు పాల్గొన్నారు..

## కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిద్దాం...

### ఆరోగ్యంగా ఆర్థికంగా ఎదుగుదాం!

### జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి జె.వెంకటి.

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 13:**





కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించి ఆర్థికంగా ఆరోగ్యంగా ఎదగవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి అన్నారు. బుధవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఆరోగ్య పర్యవేక్షకులకు మరియు సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సిబ్బంది అందరూ అర్హులైన దంపతులకు కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలని, అందుబాటులో ఉన్న తాత్కాలిక కుటుంబా నియంత్రణ పద్ధతులు పాటించేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన ఓరల్ ఫీల్స్, అంతరా ఇంజక్షన్, ఐ . యు. డి మరియు టూబెక్టమి పద్ధతులు ఆడవారికి అందుబాటులో ఉన్నాయని, అదేవిధంగా మగవారికి నిరోధ్ కండోమ్, వాసెక్టమి ఉన్నాయని, ప్రజలు వీటిని ఉపయోగించుకొని తమ కుటుంబమును నిర్ణీత ప్రణాళిక తో మెరుగైన జీవితాన్ని గడపవచ్చు అని సూచించారు. పర్యవేక్షకులు ఆరోగ్య సిబ్బంది విధిగా అర్హులైన వారిని మోటివేట్ చేసి ఈ కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించే టట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో గణాకాధికారి ఒమర్ సలీమ్, ఆరోగ్య విస్తరణ అధికారి కృష్ణ కుమార్ మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ లో ఉద్యోగాల కొరకు నోటిఫికేషన్ జారీ.

1) స్టెనో / టైపిస్ట్ (01)
విద్యర్హతలు : డిగ్రీ తో పాటు
షార్ట్ హ్యాండ్ (హయ్యర్ ) నిమిషానికి 120 పదాల స్పీడ్ ఉండాలి మరియు ఇంగ్లీష్ (హయ్యర్ )నిమిషానికి 45 పదాల టైప్ వచ్చి ఉండాలి.
క్యాటగిరి: జనరల్
2) రికార్డు అసిస్టెంట్ (01)
విద్యార్హతలు : 10 వతరగతి పాస్ అయి ఉండాలి.
క్యాటగిరి: OC (W) ఇట్టి ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని చైర్మన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మేడ్చల్ మల్కాజిగిరి నోటిఫికేషన్ జారి చేయడం జరిగింది. చివరి తేదీ : 30.11.2024 రోజున సాయంత్రం 5:00 గం. ల లోపు రిజిస్టర్ పోస్ట్ /స్పీడ్ పోస్ట్ ద్వారా చైర్మన్ , డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ కోర్ట్ కాంప్లెక్స్ అడ్రస్ కు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాల కోసం https://medchal-malkajgiri.dcourts.gov.in/ వెబ్ సైట్ ను సంప్రదించాలని తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరీ ఫైర్ ను ఏర్పాటు చేయించిన కౌన్సిలర్ కొశికె ఐలయ్య



**తుర్కయంజాల్, వెలుతురు: నవంబర్ 13**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ 22వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య వాటర్ ప్యూరీ ఫైర్ ను ఏర్పాటు చేయించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని గొప్ప స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వారు విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు షూ, బెల్టు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ డిఈ బిక్షపతి,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు తావు నాయక్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## కొంగరకలాన్ లో బిజెపి సభ్యత్వ నమోదు



**ఇబ్రహీంపట్నం, వెలుతురు: నవంబర్ 13**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ గ్రామంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క బిజెపి నాయకుడు కేంద్ర ప్రభుత్వ పథకాలు,బిజెపి పార్టీ అంత్యోదయ యొక్క ఉద్దేశం చివరి వ్యక్తి వరకు ఫలాలు చేరడమే మా పార్టీ యొక్క గొప్పతనం అని ప్రతి ఒక్కరికి వివరించి బిజెపి సభ్యత్వం తీసుకున్న విధంగా చెప్పాలని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మీడియా సెల్ కన్వీనర్ ఉడుతల అశోక్ గౌడ్, ఆదిభట్ల మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి గజ్జల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొనడం జరిగింది.

## అమరావతిలోనే హెచ్ఆర్‌సీ, లోకాయుక్త

### హైకోర్టుకు తెలిపిన ఎపి ప్రభుత్వం

**అమరావతి,నవంబర్13( వెలుతురు):**

హెచ్ఆర్‌సీ, లోకాయుక్త కమిషన్‌ను అమరావతిలోనే ఉంచుతామని ఎపి ప్రభుత్వం స్పష్టం చేసింది. హెచ్ఆర్‌సీ, లోకాయుక్త కమిషన్ తరలింపుపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. అందుకు వీలుగా చట్టసవరణ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు మూడు నెలలకు వాయిదా వేసింది. హెచ్ఆర్‌సీ, లోకాయుక్త కమిషన్ తరలింపుపై మద్దిపాటి శైలజ, ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

# పట్నం నరేందర్‌రెడ్డి 14 రోజుల రిమాండ్

### రిపోర్ట్‌లో కేటీఆర్ పేరు- అధికారుల పై హత్యయత్నం కు కుట్ర

పలు ముఖ్యకారణాలను గుర్తించిన పోలీసులు

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 13:**




రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో కేటీఆర్‌తో పాటు ఇతరుల ఆదేశాలున్నట్టు పోలీసుల రిమాండ్ రిపోర్ట్ లో పేర్కొన్నారు.అయితే రైతులను ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొట్టారు, అనుచరుడు భోగమోని సురేష్ ద్వారా ప్రభావితం చేశారని ఆరోపించారు,కొందరికి డబ్బులు ఇచ్చి దాడికి ఉసిగొల్పారు, అధికారులను చంపినా పర్వాలేదని, రైతులతో పట్నం నరేందర్‌రెడ్డి చెప్పారన్నది పోలీసుల రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇది ఇలావుండగా వికారాబాద్ జిల్లా లగచర్ల లో కలెక్టర్, ఇతర అధికారుల పై దాడి కేసులో బిఆర్ ఎస్ కొడంగల్ మాజీ ఏమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కి కొడంగల్ కోర్ట్ 14 రోజుల రిమాండ్ విధించింది, దీంతో ఆయన ను చర్ల పల్లి జైలుకు భారీ బందోబస్తు మధ్య తరలించారు. కాగా పోలీసులు ఆయనను జైల్ కు తరలించే సమయం లో బిఆర్ ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు, ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు, దీంతో పోలీసులు ఆయనను భారీ బందోబస్తు మధ్య జైల్ కు తరలించారు, కాగా పోలీసులు మాజీ ఏమ్మెల్యే నరేందర్ రెడ్డి పై హత్య యత్నం కేసు ను పెట్టారని న్యాయ వాది జక్కుల లక్ష్మణ్ తెలిపారు, ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని కావున కేసును డిస్మిస్ చేయాలని కోరినట్లుగా పేర్కొన్నారు, అయితే కోర్టు తీర్పు తర్వాత నరేందర్ రెడ్డి కి 14 రోజుల రిమాండ్ విధించారు, దీంతో ఆయన గల ఆరోగ్య సమస్యల పై వినపించగా కోర్టు ఆయనకు ఇంటి నుంచి ఆహారం సరఫరా, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరగా కోర్టు అంగీకరించిందన్నారు,



## రామన్నపేట ఆసుపత్రి సూపరింటెండెంట్ గా సివిల్ సర్జన్ డాక్టర్ ఈశ్వర్ కు బాధ్యతలు



**వెలుతురు న్యూస్ నవంబర్ 13**

రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ గా డాక్టర్ టి. ఈశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి సూపరిండెంట్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బి. వీరన్న ఆరోగ్య కారణాల రీత్య తమ బాధ్యతలను ఆసుపత్రిలో, సీనియర్ డాక్టర్ గా పనిచేస్తున్న సివిల్ సర్జన్ డాక్టర్ ఈశ్వర్ కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈశ్వర్ మాట్లాడుతూ,ప్రజలకు అందుబాటులో, ఉంటూ సేవలు అందిస్తానని, తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

## టీజీపిఎస్సీ చైర్మన్ గా బీసీలకి అవకాశం కల్పించాలి

### కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని నిరూపించుకోవాలి - జాజుల లింగంగౌడ్



**మిర్యాలగూడ వెలుతురు నవంబర్ 13:**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిసెంబర్ 3న పదవీ కాలం పూర్తవుతున్న సంధర్భంగా నూతన చైర్మన్ గా బీసీలకి అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి నేటి వరకు మంత్రుల నుండి కార్పొరేషన్ చైర్మన్ ల వరకు కేవలం ఒకే సామాజిక వర్గానికి పెద్ద పీట వేస్తూ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అరకొర పదవులు మాత్రమే కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు ఒక ప్రక్క దేశమంతా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాట దక్కాలని కాలికి బలపం కట్టుకొని తిరుగుతుంటే తెలంగాణ రాష్ట్రంలో మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఒకే ఒక కులానికి అన్ని పదవులు కేటాయిస్తూ సగానికి పైగా ఉన్న బీసీలను విస్మరిస్తున్నారని ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని నిరూపించుకోవాలంటే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ చైర్మన్ గా బీసీలకు అవకాశం కల్పించాలని లింగంగౌడ్ కోరారు.

## గ్రామ వార్డు మహిళా కార్యదర్శులపై అసెంబ్లీలో చర్చ

### గతంలో నిబంధనలకు విరుద్ధంగా పోలీసు డ్యూటీ

### ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన హోంమంత్రి అనిత

**అమరావతి,నవంబర్13( వెలుతురు):**



రెండో రోజు ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ వార్డు మహిళా కార్యదర్శులపై అసెంబ్లీలో చర్చ జరిగింది. మహిళా కార్యదర్శులు విధి నిర్వహణలో స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. వారికి జాబ్ చార్ట్‌పై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, మాధవి రెడ్డి కోరారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి వంగలపూడి అనిత సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన అనాలోచిత చర్య వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. గ్రామ మహిళా కార్యదర్శులకు పోలీస్ డ్రెస్ ఇవ్వాలని వైసీపీ వాళ్ళు చూశారని తెలిపారు. ఎన్‌బీడబ్ల్యూలను ఇంప్లిమెంట్ చేయాలని మహిళా కార్యదర్శులను పంపారన్నారు. వీళ్ళకు నిబంధనలకు విరుద్ధంగా అన్ని రకాల పోలీస్ డ్యూటీలు ఇచ్చారని.. దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హోంమంత్రి అనిత సమాధానం ఇచ్చారు.అంతకు ముందుకు ప్రశ్నోత్తరాల్లో భాగంగా చింతలపూడి ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్ట్ పురోగతిపై ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ప్రశ్నించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టిందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల ఆరు సంవత్సరాలకు ముందు పెట్టిన మోటార్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వీటిని వినియోగానికి తేవడానికి రూ.2000 కోట్లు ఖర్చు చేస్తే సాధ్యమవుతోందని వెల్లడించారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిస్తూ.. నాలుగు జిల్లాలకు సాగు తాగు నీరు అందించేందుకు చింతలపూడి ఎత్తిపోతలను ప్రారంభించారని తెలిపారు. తెలుగుదేశం హయాంలో రూ.3038 కోట్లు ఖర్చు చేసి 40 శాతం పనులు పూర్తిచేశారన్నారు. అయితే 2019-24లో కేవలం రూ.760 కోట్లు ఖర్చు చేసి కేవలం 5 శాతం పనులను మాత్రమే పూర్తయ్యాయన్నారు. చింతలపూడి ఎత్తిపోతల ఆలస్యానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం సభలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి.

## గ్రూప్ 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

### సూర్యాపేటలో మొత్తం 30 సెంటర్లు ఏర్పాటు చేశాం

### 8951 అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు

### సూపర్ ఇంటెండెంట్ బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పించిన జిల్లా అదనపు ఎస్పీ మేక నాగేశ్వర రావు



**వెలుతురు న్యూస్ సూర్యాపేట నవంబర్ 13:**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్ 3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు ఎస్పీ మేక నాగేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో చీఫ్ సూపర్ ఇంటెండెంట్, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు



రూట్ ఆఫీసర్లు కు రీజనల్ కోఆర్డినేటర్ ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా. వెంకటేశులుతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..... ఈనెల 17 ,18 తేదీలలో నిర్వహించే గ్రూప్ 3 పరీక్షకు సూర్యాపేటలో మొత్తం 30 పరీక్ష కేంద్రాలు ఉండగా 8951 విద్యార్థులు పరీక్ష కు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రానికి అనుమతించేటప్పుడు విద్యార్థుల హాల్ టికెట్, ఏదైనా గుర్తింపు కార్డును తనిఖీ చేసి పంపాలని పేర్కొన్నారు . మొత్తం 68 బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ల ను అందుబాటులో ఉంచామని ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ఫర్నిచర్ ,త్రాగునీరు మెడికల్ కిట్ అభ్యర్థులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఎలక్ట్రానిక్స్ వస్తువులకు అనుమతి లేదని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని గుర్తు చేశారు.

## ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలి

### రైతులకు 48 గంటల్లో వారి ఖాతాలో జమ....

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్.....



**వెలుతురు న్యూస్ సూర్యాపేట నవంబర్ 13 :**

ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం సూర్యాపేట మండలంలోని పిల్లలమర్రి, బాలెంలా, రామన్నగూడెం,పిఎసిఎస్, ఐకెపి నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు, రైతులు తరలించిన ధాన్యం నిల్వలను, వాటి నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. మాశ్చరైజ్ మీటర్ ద్వారా ధాన్యం తేమశాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తీసుకువచ్చేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ధాన్యం కోనుగోలు అనంతరం మిల్లులకు రవాణా దిగుమతి వేగంగా జరగాలని టాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రైతులకు 48 గంటల్లో డబ్బులు వారి ఖాతాలో జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, పిఎసిఎస్ సీఈవో శ్యాంసుందర్ రెడ్డి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## షీటీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన

### సూర్యాపేట టౌన్ PS పరిధి.

**వెలుతురు న్యూస్ సూర్యాపేట నవంబర్ 13**



ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ మేక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, సూర్యాపేట షీ టీం మహిళా SI నీలిమ గారు, సూర్యాపేట పట్టణం లోని శ్రీరామ్ నగర్ కాలనీ లోని సాయి గౌతమి జూనియర్ కళాశాలలో సుమారు 400 మంది విద్యార్థిని, విద్యార్థులకు షీ టీమ్స్ , సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. షీ టీం మహిళా SI నీలిమ గారు మాట్లాడుతూ జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ అధ్వర్యంలో షీ టీమ్స్, సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో, స్కూల్లో కళాశాలలో, వసతి గృహాలలో చదువుకునే విద్యార్థులు, యువతి యువకులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా, ATM కార్డ్ వివరాలు,OTP వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని



తెలిపినారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను DP లుగా పెట్టుకోవద్దని చెప్పారు.మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు.గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్వర్డు పెట్టుకోవాలని అన్నారు. మహిళల రక్షణ పై పటిష్టంగా పనిచేస్తున్నామని, ఆకతాయిలా ఆటలు సాగవని, మహిళలను ఆడపిల్లలను గౌరవించాలని తెలియజేశారు అదేవిధంగా ఆత్మ రక్షణ కొరకు మెలుకువలు నేర్చు కోవాలన్నారుఎవరైనా మీ ఆత్మగౌరవాన్ని భంగపరిచినట్లయితే షీ టీం నెంబర్ 8712686056 కు సమాచార తెలియజేయవచ్చు అన్నారు.టీ సేఫ్ యాప్ గురించి విద్యార్థినిలకు వివరించారు. ఈ కార్యక్రమం నందు షీ టీమ్స్ ఏఎస్ఐ సాలయ్య, సాయి గౌతమి కళాశాల ప్రిన్సిపల్ యరగాని లక్ష్మయ్య, మహిళా సాధికారత కేంద్రంనుంచి రేవతి, వినోద్, తేజస్విని, మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోచింగ్ సెంటర్ల అతిప్రచారానికి అడ్డుకట్ట

(మొదటి పేజీ తరువాయి..)

**న్యూఢిల్లీ,నవంబర్13 :**

వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణనిచ్చే కోచింగ్ సెంటర్లు తప్పుడు ప్రకటనలు చేయకుంటా కేంద్రం ఆంక్షలు విధించింది. గతంలో ర్యాంకులు సాధించిన వారి ఫోటోలను కూడా పెట్టి ప్రకటనలు ఇవ్వరాదని హెచ్చరించింది. కోచింగ్ కేంద్రాలు చేసే 100 శాతం జాబ్ గ్యారెంటీ, 100 శాతం సెలెక్షన్ వంటి తప్పుడు ప్రకటనలను నియంత్రించేందుకు కేంద్రం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. కోచింగ్ సెంటర్ల అతి ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'మా కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకుంటే వందశాతం జాబ్ సెక్యూరిటీ ఇస్తాం.. నూటికి నూరు శాతం జాబ్ గ్యారంటీ' ఇలాంటి ప్రకటనలు ఇకపై కనిపించకూడదని కోచింగ్ సెంటర్లను కేంద్రం హెచ్చరించింది. ఇలాంటి మోసపూరిత, అవాస్తవ ప్రకటనలతో కోచింగ్ సెంటర్లు అభ్యర్థులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న కోచింగ్ సెంటర్లకు కేంద్రం బుధవారం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ విషయంలో కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థకు అనేక ఫిర్యాదులు వస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. 'తమ సక్సెస్ రేటు, సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తీసుకున్న కోర్సులు మొదలైన విషయాల గురించి కోచింగ్ సెంటర్లు ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల నుంచి కొంత సమాచారాన్ని దాస్తుండడం గమనించినట్లు కేంద్రం వెల్లడించంది. ఇలా విద్యార్థులను తప్పుదోవ పట్టించే విషాయలను అంగీకరించబోమని అన్నారు. అందువల్ల వాటి నిర్వాహకుల కోసం పలు మార్గదర్శకాలు రూపొందించామని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే వెల్లడించారు. కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, అయితే ప్రకటనలనేవి వినియోగదారుల హక్కులను దెబ్బతీయకూడదని ఆమె అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి ఇప్పటికే జరిమానాలు విధించామని తెలిపారు. ప్రస్తుతం కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారికి వినియోగదారుల రక్షణ చట్టం కింద పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తామని అధికారులు పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్లు అందించే కోర్సులు, వాటి వ్యవధికి సంబంధించి తప్పుడు ప్రకటనలు చేయకూడదన్నారు. అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైన తర్వాత వారి రాతపూర్వక అనుమతి లేకుండా కోచింగ్ సెంటర్‌లు అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉపయోగించకూడదని తెలపింది. కోర్సుల గురించి ముఖ్యమైన సమాచారాన్ని బహిర్గతం చేయాలని పేర్కొంది. అయితే చాలా మంది యూపీఎస్సీ అభ్యర్థులు సొంతంగా చదువుకొని ప్రిలిమ్స్, మెయిన్స్ క్లియర్ చేసి, కేవలం ఇంటర్వ్యూలకు మాత్రమే కోచింగ్ తీసుకుంటారు. అటువంటి విషయాలను కోచింగ్ సెంటర్లు బహిరంగంగా తెలియ జేయాలని సూచించింది. ఉద్యోగాలకు ఎన్నికైన అభ్యర్థులు తమ వద్ద ఏ కోర్సులో శిక్షణ తీసుకున్నారో తెలియజేయాలన్నారు. చట్టబద్ధంగా అనుమతి తీసుకున్న భవనాల్లో మాత్రమే కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి. అభ్యర్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, భద్రత కల్పించాల్సి ఉంటుంది.

## ఆదిలాబాద్ వెలిగిపోతోంది

### ఉద్యోగాల వేటలో సామాన్యుల అసామాన్య ప్రతిభ

### ఒకేసారి ఆరు ఉద్యోగాలు కొట్టేసిన యువతి నిఖిత

**ఆదిలాబాద్, నవంబర్13 వెలుతురు:**



ఇటీవలి కాలంలో ఆదిలాబాద్ జిల్లాల్లో పలువురు సర్కార్ కొలువులు సొంతం చేసుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని చిన్న బుగ్గారం చిన్న పల్లె నుంచి కూడా పలువురు యువతీ యువకులు ఈ ఏడాది సర్కార్ కొలువులు సొంతం చేసుకున్నారు. గతంలో ఈ గ్రామానికి చెందిన కొందరు జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపిక కావటం ఆ పల్లెని ఓ మలుపుతిప్పింది. వారిని ప్రేరణగా తీసుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని పట్టుబట్టారు. ప్రస్తుతం ఈ గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారి సంఖ్య అక్షరాలా 82 మందికి చేరింది. వీరంతా రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్యం వంటి వివిధ శాఖల్లో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జరిగిన పలు ప్రభుత్వ నియామకాల్లో ఆదిలాబాద్ జిల్లా తండాకు చెందిన ఓ యువతి ఏకంగా ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించింది. గురుకుల డీఎల్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకర్‌గా నిలిచింది. చిన్నబుగ్గారానికి చెందిన నిఖితకు చిన్నప్పటి నుంచి టీచింగ్ అంటే మహా ఇష్టం. ఎప్పటికైనా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కావాలనేది ఆమె లక్ష్యం. దీంతో ప్రయత్నాలు ప్రారంభించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏడాది వ్యవధిలోనే ఏకంగా 5 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. గతేడాది 2023 సెప్టెంబర్ నుంచి 2024 ఆగస్టు వరకు జరిగిన పలు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమై.. పరీక్షలు రాసింద. రోజుకి 7 నుంచి 10 గంటల వరకు ష్టపడి చదివి అనుకున్నది సాధించింది. మొదట సోషల్ వెల్ఫేర్‌లో పీజీటీగా, ఆ తర్వాత టీజీటీ అనంతరం.. జేఎల్, డీఎల్, గ్రూప్ 4 పోస్టులకు వరుసగా ఎంపికైంది. తాజాగా టీఎస్పీఎస్సీ నిర్వహించిన జేఎల్ పరీక్షలోనూ సత్తా చాటింది. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే పేదరికం అడ్డు కాదని నిఖిత నిరూపించింది. ÷ళిఘాలయ రాష్ట్రంలో వ్యవసాయ శాస్త్రవేత్తగా పనిచేసే ఇందల్‌కుమార్, హైదరాబాద్‌లోని నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ సెంటర్‌లో పనిచేసే భూగర్భ నిపుణులు డాక్టర్ లోహిత్‌కుమార్, ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జైసింగ్ కూడా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారే. ఏడాది కిందట ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లలో పరీక్ష రాసి ఇటీవల 6 ప్రభుత్వ ఉద్యోగాలను సాధించిన నిఖిత ఈ గ్రామానికి చెందిన యువతే. ఇక్కడ ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నవారు, పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులు కూడా ఉన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారులపాలు

### వారం రోజులుగా కొనుగోళ్ల కేంద్రాల వద్దనే ధాన్యం

### బోనస్ మాట దేవుడెరుగు.. కొనే నాథుడే లేడు : మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, నవంబర్ 13 వెలుతురు:**

క్వింటాల్‌కు రూ. 500 ఇస్తానన్న సీఎం రేవంత్ బోనస్ మాట దేవుడెరుగు.. కనీసం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడే లేడని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలైందని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతేడాది నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే ఈ సంవత్సరం కృష్ణా నదిలో పుష్కలంగా నీళ్లు రావడం వల్ల ఐదున్నర లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. సాగు పెరిగిన కారణంగా నల్గొండ జిల్లాలో ఏడున్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం అంచనా వేసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మూడు లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేసే పరిస్థితి నల్గొండ జిల్లాలో లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలయిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేక, గన్నీ బస్తాలు అందించలేక రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రైతులు రూ .1800లకు క్వింటాల్ చొప్పున దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేను అడుగుతున్నాను ఎన్నికల ముందు బాండ్ పేపర్ రాసి రైతులకు 500 బోనస్, 15000 రైతుబంధు ఇస్తానని చెప్పి మాట తప్పవా లేదా? రైతుల వడ్ల లోడ్ ఎత్తమంటే మహారాష్ట్రకు నోట్లో కట్టల లోడ్ ఎత్తుతున్నాడు ముఖ్యమంత్రి. నల్గొండ జిల్లాలో 9,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, రూ. 200 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంటే అందులో రూ. 50 కోట్లు మాత్రమే చెల్లించారు. రైతులకు సకాలంలో డబ్బులు అందించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని హరీశ్‌రావు తెలిపారు. వడ్లకు మద్దతుధర వస్తలేదని రైతులు మిర్యాలగూడలో రాస్తారోకో చేసిన పరిస్థితి. కొన్న వడ్లకు కూడా విపరీతంగా తరుగు పెట్టి రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. నిన్న జగిత్యాల జిల్లా పర్యటనలో అక్కడి రైతులని అడిగితే ఒక కిలో సన్నవడ్లు కూడా కొనలేదని చెప్పారు. ఇప్పటివరకు నల్గొండ జిల్లాలో కూడా ఒక కిలో సన్న వడ్లను కొనలేదు. సన్న వడ్లను కొనే వ్యవస్థ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ విఫలమైందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

### ఇందిరమ్మ పాలన కాదు..

# రాక్షస పాలన

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**హైదరాబాద్, నవంబర్ 13 ( వెలుతురు) :**
ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం, రాజీవ్ పరిపాలన అని చెబుతూనే రాక్షస పాలన సాగిస్తుందని విమర్శించారు. పచ్చని పొలాల్లో ఫార్మసిటీ పేరిట చిచ్చుపెట్టారు. న్యాయం కోసం ప్రజలు ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. నడి రాత్రి రైతులను అరెస్టు చేయడమే మీ రైతు రాజ్యమా..? అని ప్రశ్నించారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలపై ఎన్ని ఆంక్షలు పెట్టినా ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ భయపడదన్నారు. జనం మిమ్మల్ని ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని, అక్రమంగా అరెస్టు చేసిన పట్నం నరేందర్ రెడ్డి, రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన అధికారి

**లక్నో, నవంబర్ 13 ( వెలుతురు) :**
లంచం తీసుకుంటూ అధికారులు ఓ అధికారి చిక్కిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో ఈ సంఘటన జరిగింది. మదర్సా మంజురియా అక్తరుల్ ఉలూమ్‌కు చెందిన ఆరిఫ్, రాజ్‌పురా నుంచి వసుంధర గ్రామానికి మదర్సాను తరలించేందుకు మైనారిటీ సంక్షేమ శాఖకు దరఖాస్తు చేశాడు. వక్ఫ్ సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ ఆసిఫ్ ఆ ఫైల్‌ను ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉంచాడు. ఉన్నతాధికారుల వద్దకు ఆ ఫైల్ పంపేందుకు లక్ష లంచం డిమాండ్ చేశాడు. కాగా, ఒకేసారి అంత డబ్బు ఇవ్వలేనని ఆరిఫ్ తెలిపాడు. దీంతో వాయిదాల్లో లంచాన్ని చెల్లించాలని అధికారి ఆసిఫ్ చెప్పాడు. అయితే విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌ను ఆరిఫ్ ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో అధికారి ఆసిఫ్‌ను ట్రాప్ చేశారు. తొలి వాయిదా లంచం కింద రూ.18,000 తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. అతడిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

## అసెంబ్లీలో డీఎస్సీపై వివరాలు వెల్లడించిన మంత్రి లోకేశ్‌కుమార్

### ప్రశ్నోత్తరాల సమయంలో సమాధానం



**అమరావతి, నవంబర్ 13 ( వెలుతురు ) :**
ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల్లో భాగంగా డీఎస్సీపై సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇచ్చారు. తెలుగుదేశం ఆవిర్భావం తరువాత 11 డీఎస్సీలు వేశారని.. లక్షా 50 వేల మంది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారని తెలిపారు. ఇందులో 9 డీఎస్సీలు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వేసినవే అని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి సంతకం మెగా డీఎస్సీ వేశారని.. దానిలో భాగంగా టెట్ తరువాత డీఎస్సీ వెయాలని నిర్ణయించామన్నారు. డీఎస్సీకి త్వరలోనే నోటిఫికేషన్ 16 వేల పైచిలుకు పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారు. నిరుద్యోగ యువత పోరాటం మూలంగానే 93 శాతం విజయాన్ని అందుకున్నామన్నారు. సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోలో తొలి హామీ 20 లక్షల ఉద్యోగాలు అని.. దానికి ఉన్న మంత్రి వర్గ ఉపసంఘంకు తనను ఛైర్మన్‌గా సీఎం చంద్రబాబు నాయుడు నియమించారని తెలిపారు. డీఎస్సీ పై గతంలో ఎన్ని కేసులు పడ్డాయో వాటిని స్టడీ చేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అధికారులు తగినంత సమయం కావాలని అడిగారన్నారు. ఇప్పుడు ఇచ్చే నోటిఫికేషన్ పకడ్బందీగా వేయాలని వారికి చెప్పామని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ వచ్చే ఏడాది భర్తీచేస్తామని ప్రశ్నోత్తరాలు సందర్భంగా మంత్రి లోకేస్ సమాధానం ఇచ్చారు. ప్రశ్నోత్తరాల అనంతరం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ ప్రారంభమైంది. ఎమ్మెల్యే కూన రవి కుమార్ చర్చను మొదలుపెట్టారు. 2014లో కేంద్రంలో ఉన్న ప్రభుత్వం అప్రజాస్వామికంగా రాష్ట్రాన్ని విభజించారన్నారు. గత ప్రభుత్వం విధ్వంసంతో పాలనను ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్రాన్ని దెబ్బతీసి అన్ని వ్యవస్థలను నాశనం చేశారన్నారు. 2019-24 మధ్య కాలంలోని జగన్ ప్రభుత్వం కంటే బ్రిటిష్ ప్రభుత్వమే మేలంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్ వచ్చాక విద్యుత్ ఒప్పందాలను రద్దు చేశారని.. అలాగే నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును నిలిపేశారని... అమరావతిని కూడా నిలిపేశారని మండిపడ్డారు. ఏజెన్సీలు మార్చడం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని కూన రవి కుమార్ పేర్కొన్నారు.

# ట్రాఫిక్‌జామ్ వెనకున్న మతలబేమిటంటే!




**బెంగళూరు, నవంబర్ 13 ( వెలుతురు) :**
బెంగళూరులోని ఎంజీ రోడ్డులో లేదా ఢిల్లీలోని రింగ్ రోడ్డులో మీరెప్పుడైనా ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కున్నారా? ఒకవేళ ఇరుక్కుపోయి ఉంటే.. ఆ ప్రాంతాల్లో ఎందుకు ట్రాఫిక్‌జామ్ అయిందో మీకు తెలుసా? ఆ మార్గా ల్లో ఎక్కువ కార్లు తిరుగుతుండటమే అందుకు కారణం. ప్రతిఒక్కరూ సొంత వాహనంలో వెళ్తే ఇలాగే ట్రాఫిక్‌జామ్ అవుతుంది కదా! 15 నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యానికి గంట సేపు ప్రయాణించాల్సి వస్తుంది. ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ప్రయాణించే కారుకు ఎంత జాగ అవసరమవుతుందో ఒక్కసారి ఆలోచించండి. అదే జాగలో పట్టే బస్సు లేదా రైలు బోగిలో ఎంతో మంది ప్రయాణించవచ్చు.సొంత కార్లున్నప్రతిఒక్కరూ వాటికి బదులు బస్సులను ఆశ్రయించినట్టు ఒక్కసారి ఊహించుకోండి. మన రోడ్లపై ప్రయాణం సాఫీగా సాగుతుంది కదా. ఆ బస్సులు ఎలక్ట్రికలో, హైబ్రిడో లేదా ఇతర హరిత ఇంధనంతో నడిచేవి అయితే, కాలుష్యం కూడా చాలా త్వరగా తగ్గిపోతుంది. మన దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలు ఆర్థిక కార్యకలాపాలకే కాదు, అర్బనైజేషన్‌కు కూడా ప్రసిద్ధి. అధిక జనాభా, ట్రాఫిక్‌జామ్, అర్బనైజేషన్ వల్ల కలిగే ఇబ్బందులకు ఈ నగరాలు ప్రతీతి. వీటిని అధిగమించేందుకు వివిధ ప్రతిపాదనలు, కార్యక్రమాలు ఉన్నప్పటికీ ఈ నగరాలు ఎప్పుడూ రద్దీగానే కనిపిస్తాయి. ప్రజా రవాణాను మెరుగుపరచడం, మెట్రో సేవలను మరింతగా విస్తరించడం లాంటి చర్యల ద్వారా కార్ల రద్దీని కొంతమేరకు తగ్గించవచ్చు. వాటికితోడు క్యాబ్‌లు, ఆటో రిక్షాలు ఉండనే ఉన్నాయి. అయినప్పటికీ చాలామంది సొంత వాహనాల్లో వెళ్లేందుకే ఇష్టపడతారు. రద్దీ ప్రదేశాల్లో కార్లకు అనుమతి నిరాకరించడం, పార్కింగ్ రుసుములను పెంచడం లాంటి చర్యల ద్వారా కార్ల వాడకాన్ని, తద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు. కానీ, ప్రభుత్వాలు అలా చేయడం లేదు. అందుకు విరుద్ధంగా కార్ల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయి. ఎందుకంటే, మన దేశంలో జరిగే కార్ల కొనుగోళ్లలో ఈ మూడు నగరాల వాటా చాలా ఎక్కువ. సుమారు 30-35 శాతం కార్లు ఈ నగరాల్లోనే అమ్ముడవుతున్నట్టు ఒక అంచనా. కార్ల వల్ల ట్రాఫిక్, కాలుష్యం లాంటి సమస్యలు ఉన్నప్పటికీ, అవి ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయని చెప్పడంలో ఎలాంటి సంశయం అక్కర్లేదు. ఒకవేళ ప్రజా రవాణా మెరుగైతే యథావిధిగా కార్ల కొనుగోళ్లు తగ్గిపోతాయి. ప్రజలు కొత్త కార్లను చాలా తక్కువ సంఖ్యలో కొనుగోలు చేస్తారు. ఇప్పటికే కార్లున్న వారు వాటిని మితంగా వాడతారు. అయితే, ఇది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ చాలా పెద్దది. దేశ జీడీపీలో ఈ రంగం వాటా సుమారు 7 శాతం. అంతేకాదు, లక్షల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తున్నది. ఆటోమొబైల్ ఇండస్ట్రీ అంటే ఒక్క కార్లకు సంబంధించినది మాత్రమే కాదు. తయారీదారులు, డీలర్‌షిప్‌లు, సర్వీస్ సెంటర్లు, అనుబంధ పరిశ్రమలు ఇలా అనేకం అందులో భాగం. ఒక్కసారిగా కార్ల కొనుగోళ్లు పడిపోతే.. ఈ మొత్తం చైన్ సిస్టమ్ దెబ్బతింటుంది. పెట్టుబడులు తగ్గిపోతాయి. అది లేఆఫ్‌లకు దారితీస్తుంది. చివరికి పరిశ్రమలు మూతబడతాయి. ఆటోమొబైల్ రంగం ప్రత్యక్షంగా 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నది. అంతేకాదు, దానిపై ఆధారపడి పరోక్షంగా లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. వీరంతా రోడ్డున పడతారు. అంతకుమించి 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యం నీరుగారిపోతుంది. పన్నులు, డ్యూటీలు, ఇతరత్రా రూపంలో ఆటోమొబైల్ రంగం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారీగా ఆదాయం వస్తున్నది. వాహనాలపై జీఎస్టీ, రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇంధనంపై ఎక్సైజ్ డ్యూటీల రూపంలో ఈ ఆదాయం ప్రభుత్వాలకు సమకూరుతున్నది. ఒక్కసారిగా కార్ల కొనుగోళ్లు పడిపోతే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పడిపోతుంది. అది మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం చూపుతుంది. అందుకే బస్సు, మెట్రో లాంటి ప్రజా రవాణాను ప్రభుత్వాలు కొంతమేరకే అభివృద్ధి చేస్తాయే తప్ప, మనం కార్లు కొనడం మానేసేంత గొప్పగా మెరుగుపరచవు.

# ఆర్థికం.. మందగమనం

### పడిపోతున్న పట్టణ వినిమయం

### పెరుగుతున్న కుటుంబ రుణ భారాలు

### హెచ్చు వడ్డీ రేట్లతో ఒత్తిడి

### స్టాక్ మార్కెట్ల కుదేలు..

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
భారత ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఛాయలు కొట్టచ్చినట్లు కనబడుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక వేగంగా వృద్ధి చెందుతున్నామని బిజెపి పాలక వర్గాల ప్రచారానికి.. వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. దేశంలోని పట్టణ ప్రజల్లో వినియమం తగ్గడం, కార్పొరేట్ల ఆదాయాల్లోనూ పతనం చోటు చేసుకుంటుంది. అధిక వడ్డీ రేట్లు, హెచ్చు పన్నులకు తోడు కుటుంబ రుణ భారాలు పెరిగిపోతూ.. వ్యక్తిగత రుణాలు చెల్లించలేని పరిస్థితులు పెరుగుతున్నాయి. వెరసీ ఈ ప్రభావం కార్పొరేట్ కంపెనీల అమ్మకాలపై పడుతోంది. దీంతో ఇటీవల సెప్టెంబర్ త్రైమాసికంలో అనేక కంపెనీలఆదాయాలు భారీగాపడిపోయాయి.మరోవైపుదలాల్ స్ట్రీట్ అమ్మకా ల ఒత్తిడితో బెంబెలెత్తుతోంది. స్టాక్ మార్కెట్లలో పండుగ వాతావార ణం ఆవిరై మదుపర్లుభారీ నష్టాలనుఎదుర్కొంటున్నారు.ఈ పరిణా మాలన్నీ మాంద్యానికి సంకేతాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మధ్యతరగతి కొన లేరు..: ఆదాయాలు తగ్గడంతో పట్టణ వినిమయం భారీగా పడిపోతోంది. ముఖ్యంగా అధిక వడ్డీ రేట్లు, హెచ్చు ద్రవ్యోల్బణంతో చిన్న మొత్తాల రుణాలు పొందిన వారు తిరిగి సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఉద్యోగులు, కార్మికుల వేతనాల్లోనూ పెంపుదల అంతంత మాత్రమే ఉంటుంది. సెప్టెంబర్ త్రైమాసికంలో విత్తయేతర కార్పొరేట్ కంపెనీలు తమ సిబ్బంది వేతన వ్యయాలను 0.8 శాతమే పెంచాయి. ఇంతక్రితం జూన్ త్రైమాసికంలో 1.2 శాతం పెంపుదల ఉంది. దీని ప్రభావాలు ఇప్పుడు అన్ని రంగాలపై కనబడుతోందని నెస్లే ఇండియా సిఇఒ సురేష్ నారాయణన్ పేర్కొన్నారు. ప్రీమియం వినియోగం బలంగానే ఉన్నప్పటికీ.. మధ్యస్థ విభాగంలో ఒత్తిడి నెలకొందన్నారు. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో తమ అమ్మకాల్లో కేవలం 1.4 శాతం పెరుగుదలమాత్రమే ఉందన్నారు.గత రెండేళ్లలో ఇదే అత్యల్ప వృద్ధి రేటు అన్నారు.పండగ సీజన్‌లో స్పోర్ట్స్‌యుటిలిటీ వెహికల్ (ఎస్‌యు వి) విభాగంలో అమ్మకాలు పడిపోయి 7లక్షల కార్లు నిల్వ ఉండిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మైక్రోఫైనాన్స్ రుణాల జారీలోనూ పతనం పెరిగింది. ఈ పరిణామాలు మధ్యతరగతి ప్రజల్లో ఆదాయాల పతనాన్ని, మందగమనాన్ని స్పష్టం చేస్తున్నాయి.

జిడిపి డౌన్..: ప్రపంచంలోనే వేగంగా పెరుగుతోన్న ఆర్థిక వ్యవస్థగా చెప్పుకుంటున్న భారత్‌లో అన్ని రంగాల కంపెనీల్లో మందగమనం వైరస్ క్రమంగా పుంజుకుంటుంది. బజాజ్ ఆటో, మారుతి సుజుకి, హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే తదితర సహా చిన్న బ్యాంక్‌లు, ఎన్‌బిఎఫ్‌సిలు ఆదాయాలను కోల్పోతున్నాయి. ఆర్థిక సంవత్సరం 2023-24లో 8.2 శాతం వృద్ధిని నమోదు చేసిన భారత్ ప్రస్తుత 2024-25 తొలి త్రైమాసికంలో జిడిపి 6.7 శాతానికి పరిమితమయ్యింది. రెండో త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాలను 7.2 శాతం నుంచి 7 శాతానికి తగ్గిస్తూ ఆర్‌బిఐ అంచనా వేసింది. 2024-25లో 7.2 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. భారత వృద్ధి 6.5 శాతానికి పరిమితం కావొచ్చని గోల్డ్‌మాన్ సాచే అంచనా వేసింది.

వాహన అమ్మకాలు డీలా..: ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులకు ప్రధాన గీటురాయిగా చూసే వాహన అమ్మకాల్లోనూ పతనం చోటు చేసుకుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ అక్టోబర్ 28న వెల్లడించిన రిపోర్ట్ ప్రకారం.. ఎఫ్ఎడిఎ గణంకాలను ఉదహరిస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో వాహన అమ్మకాలు 2.3 శాతం తగ్గాయని వెల్లడించింది. రెండో త్రైమాసికంలో పట్టణ అమ్మకాల్లో తగ్గుదలనే ప్రధాన కారణమని పేర్కొంది. మరోవైపు ఎఫ్ఎంసిజి అమ్మకాల పెరుగుదల 2.8 శాతానికి క్షీణించాయి. ఈ రంగం గతేడాది ఇదే త్రైమాసికంలో 10.1 శాతం వృద్ధిని సాధించింది.

దలాల్ స్ట్రీట్‌లోనూ నిరాశలు..: గడిచిన నెల రోజులుగా దలాల్ స్ట్రీట్‌పై బేర్ పంజా కొనసాగుతోంది. అమ్మకాల ఒత్తిడితో రిటైల్ ఇన్వెస్టర్లు భారీ నష్టాలను చవి చూస్తున్నారు. భారత మార్కెట్ నుండి భారీగా ఎఫ్ఐఐలు తరలిపోవడమూ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు నిదర్శనం. బెర్న్‌స్టెయిన్ ఇండియా స్ట్రాటజీ రిపోర్ట్ ప్రకారం.. "నిఫ్టీ 100లోని కంపెనీలు దాదాపు 48 శాతం తమ అంచనాలను కోల్పోయాయి. ఇది మార్చి 2020 తర్వాత అత్యధికం. ఇప్పుడు మార్కెట్లలో ఉత్సాహం (పార్టీ) ముగుస్తోంది. నిఫ్టీ 50 ఆల్‌టైం గరిష్టాల నుంచి 10 శాతం పతనమయ్యింది. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థతో ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవడానికి ఓ కారణం. భారత్‌లోని హెచ్చు ద్రవ్యోల్బణం,



తక్కువ వేతనాల పెరుగుదల మార్కెట్లపైనా ప్రతిబింబిస్తుంది. గతంలో ఏడాదికి 30 శాతం రాబడిని అందుకున్న ఇన్వెస్టర్లు వచ్చే ఏడాది ఒక్క అంకె స్థాయిలోనే రాబడి పొందే అవకాశం ఉంది." అని బెర్న్‌స్టెయిన్ రిపోర్ట్ పేర్కొంది.

రెండంకెల్లో షేర్ల పతనం: ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న బలహీనతల నేపథ్యంలో దలాల్ స్ట్రీట్‌లో దిగ్గజ కంపెనీల షేర్లు బేర్‌మంటున్నాయి. నిఫ్టీ50లో ఆల్‌టైం గరిష్టాలను చవి చూసిన స్టాక్స్ నేల చూపులు చూస్తున్నాయి. కొన్ని స్టాక్స్ అథోపాతాలానికి పడిపోతున్నాయి. దీంతో వీటిల్లో పెట్టుబడులు పెట్టిన సగటు రిటైల్ ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళనకు గురైతున్నారు. కొత్త పెట్టుబడులు పడిపోతున్నాయి. నవంబర్ 4 నాటి మార్కెట్ వివరాల ప్రకారం పరిశీలిస్తే అనేక కంపెనీల షేర్లు రెండంకెల స్థాయిలో క్షీణించాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ ఈ ఏడాది ఆల్‌టైం గరిష్ట స్థాయి రూ.3,435 వద్ద నమోదు కాగా.. 16 శాతం పతనమై రూ.2,897కు పడిపోయింది. ఆసియన్ పేయింట్స్ స్టాక్ 15 శాతం విలువ కోల్పోయి రూ.2,915 వద్ద నమోదయ్యింది. ఇండుస్‌ఇండ్ బ్యాంక్ ఏకంగా 37 శాతం, మారుతి సుజుకి 19 శాతం, హీరో మోటో కార్ప్ 23 శాతం, టాటా మోటార్స్ 30 శాతం, యాక్సిస్ బ్యాంక్ 15 శాతం, హిందుస్థాన్ యూనిలీవర్ 17 శాతం, కొటాక్ మహీంద్రా బ్యాంక్ 11 శాతం, నెస్లే ఇండియా 19 శాతం, టిసిఎస్ 14 శాతం చొప్పున నష్టపోయాయి.

డిమాండ్ లేమీ..: గడిచిన రెండున్నరేళ్లలో ఆర్‌బిఐ ఒక్క సారి కూడా వడ్డీ రేట్లను తగ్గించలేదు. అంతక్రితం వరుసగా 2.50 శాతం మేర పెంచి రెపోరేటును 6.50 శాతానికి చేర్చింది. దీంతో రుణ గ్రహీతలపై తీవ్ర భారం పడుతోంది. మరోవైపు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్ట్ కాలంలో భారత సరుకుల ఎగుమతుల్లో కేవలం 1.1 శాతం పెరుగుదల మాత్రమే ఉంది. ఇది ఉద్యోగాల కల్పనకు ఏమాత్రం సరిపోదు. గడిచిన రెండు త్రైమాసికాల్లో డిమాండ్ లేమితో సిమెంట్, ఇనుము, ఉక్కు, రసాయనాల లాంటి ప్రధాన రంగాలు ప్రతికూల వృద్ధిని చవి చూడటం ఆందోళనకరం. తయారీ రంగంలోనూ డిమాండ్ సన్నగల్లింది. ఏడాది క్రితంతో పోల్చితే వినియోగదారుల్లో విశ్వాసం సన్నగిల్లిందని అనేక సర్వేలు చెబుతున్నాయి. ఈ పరిణామాలు ఆర్థిక వ్యవస్థలో తీవ్ర ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయని స్పష్టమవుతోంది.

## పెట్రోలు బంకుల్లో ఈ సేవలు అందుతున్నాయా?

### మనం రోజూవారీ ఉపయోగించే పెట్రో ఉత్పత్తులు నాణ్యమైనవే వినియోగిస్తున్నామా?

### తప్పుడు కొలత, కల్తీలతో మోసపోతున్నామా?

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
ఈ విషయాన్ని ఆయా పెట్రోలు బంకుల్లోనే మనం నిర్ధారించుకోవొచ్చు. గ్యాస్, పెట్రోలు, డీజిల్, ఇతర పెట్రోలియం ఉత్పత్తులను విక్రయించే కొందరు వినియోగదారులను బురిడీ కొట్టిస్తుంటారు. పెట్రోలు వాహనంలో నింపుకునేటప్పుడు ఖచ్చితంగా పంపుపైన డిజిటల్ అంకెల్లో జీరో (సున్నా)ను గమనించిన తర్వాత మాత్రమే సరిచూసుకోవాలి. ఒక వేళ మోసం జరిగితే, ఆధారాలతో కేసు వేసి, జరిగిన నష్టానికి పరిహారం పొందొచ్చు. పెట్రోలు బంకుల్లో ఇంకా అనేక సేవలను మనం పొందవచ్చు.

ప్రతి బంకులోనూ ఐదు లీటర్ల బ్రాసు క్యాను తూనికలు, కొలతలశాఖ ముద్రతో ధృవపత్రంతో వెరిఫికేషన్ సర్టిఫికెట్‌తో ఉంచాలి. వినియోగదారులు కోరుకున్నప్పుడు ఆ ఐదు లీటర్ల బ్రాస్ క్యాన్‌తో కొలతలు సరిచూసుకోవచ్చు. అది వినియోగదారుడికి ఉన్న ప్రాథమ హక్కు. పెట్రోలు బంకులకు వెళ్లినప్పుడు లీటరు ధరపై అనుమానం ఉంటే ఆ బంకు నుంచే అక్కడ ఏర్పాటు చేసిన ఆర్ఎస్‌పి బోర్డుపై ఉన్న సెల్‌నంబరుకు మెసేజ్ పంపిస్తే మీరు ఉన్న బంకులో లీటరు ధర ఎంతో డైరెక్టుగా ఆయిల్ కార్పొరేషన్ నుంచే మీ ఫోన్‌కు వెంటనే మెసేజ్ వస్తుంది. అలాగే ద్విచక్ర వాహనాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఉచితంగా మిషన్ ద్వారా ఆయిల్ మార్చుతారు. ఆయిల్ కొనుగోలు చేసినప్పుడు బిల్లు పొందొచ్చు. ఆ బిల్లులో తారీఖు, సమయం, ఎంత మొత్తం చెల్లించారు, క్వాలిటీ, డీలర్ ఫోన్ నంబరు, వ్యాట్‌నంబరు అన్నీ వివరాలు ఉండాలి. కొన్ని బంకుల్లో ఎప్పుడూ కంపెనీ వారు ఇచ్చే రివార్డు పాయింట్లు ప్రతి కొనుగోలుపైనా, పండుగలకు కంపెనీ వారు అందించే స్కీములు తదితర వివరాలను తెలుసుకోవచ్చు. బంకుల్లో ఎక్కడైనా



వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా తెలియజేయటానికి ఆయా బంకు కంపెనీ సేల్స్ ఆఫీసర్ పేరు, ఫోన్ నంబరు కలిసి స్టిక్కర్లు లేదా బోర్డు ఉండి తీరాలి. దానిపైనున్న నంబరుకు ఫోన్ చేసి కలిగిన అసౌకర్యం గురించి తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటారు.

పెట్రోలు : నాణ్యమైన పెట్రోలును బ్రాండెడ్ ఎక్స్‌పి 95 పెట్రోలుగా కూడా పిలుస్తుంటారు. దీనిని బి6 ఇంజన్లు కలిగిన కొత్తకార్లకు వాడతారు. పెట్రోలు నాణ్యతను తెలుసుకోవాలంటే వాట్‌మెన్ 2 కంపెనీ ఫిల్టరు పేపరుపై ఒక చుక్క పెట్రోలు వేస్తే పెట్రోలు కల్తీ ఉంటే అక్కడ మరక పడుతుంది. కల్తీ లేకపోతే మీరు చుక్క వేయకముందు ఎలా ఉంటుందో అలాగే ఉంటుంది.

డీజిలు : దీని నాణ్యత తెలుసుకోవాలంటే డెన్సిటీ చెక్ చేయాలి. తేడా వస్తే ఫిర్యాదు నమోదు చేయాలి. ప్రతి పెట్రోలు బంకులోనూ డెన్సిటీ రిజిస్టరు (డెన్సిటీ అంటే సాంద్రతను తప్పనిసరిగా ప్రతిరోజూ అన్ని వివరాలు నమోదు చేసి ఉంచాలి. దానిని ప్రతి వినియోగదారుడు అడిగి చూసుకునే హక్కు ఉంది.)

తాగునీరు : పెట్రోలు బంకుల్లో స్వచ్ఛమైన తాగునీరు, సామాన్య ప్రజల సౌలభ్యం కోసం ఉచితంగా అందించాలి. ఏ బంకులోనైనా తాగునీటి సౌకర్యాలు అందుబాటులో లేకపోతే మీరు ఆయిల్ కంపెనీలకు ఫిర్యాదు చేయొచ్చు.

ఫోన్ సేవలు : మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకున్నా, మీ వద్ద సెల్‌ఫోన్ పనిచేయకపోయినా భయపడాల్సిన అవసరం లేదు. ఏ పెట్రోలు బంకు నుంచైనా ల్యాండ్‌ఫోన్ సేవలు పొందొచ్చు.

మరుగుదొడ్లు : పెట్రోలు పంపుల వద్ద శుభ్రమైన మూత్రశాలలు అందుబాటులో ఉంచాలి. దీన్ని ఉపయోగించటాన్ని ఎవరూ అడ్డుకోరాదు. పెట్రోలు బంకులో సరైన బాత్‌రూమ్స్ వంటివి లేకుంటే మీరు ఆయిల్ కంపెనీకి ఫిర్యాదు చేయొచ్చు. మహిళలకూ, పురుషులకు వేర్వేరుగా బాత్రూమ్‌లు ఉండాలి.

అత్యవసర మందులు : ప్రతి పెట్రోలు బంకు వద్ద అత్యవసర మందులు (ప్రథమ చికిత్స కిట్టు) అందుబాటులో ఉండాలి. తద్వారా సాధారణ ప్రజలు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకోవచ్చు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీనితోపాటు అన్ని మందులపై ఎక్స్పైరీ తేదీ కూడా ఉండాలి. ఈ పెట్టెలోని మందులు పాతవి కాకూడదు. ఎక్కడైనా ప్రథమ చికిత్స కిట్టు ఇవ్వటానికి నిరాకరిస్తే రాతపూర్వకమైన ఫిర్యాదు చేయొచ్చు.

నాణ్యత తెలుసుకునే హక్కు : యోగదారులకు పెట్రోలు, డీజిల్ నాణ్యత, పరిణామాన్ని తెలుసుకునే హక్కు కూడా ఉంది. పెట్రోలు పంపు యజమానులు దీనికి ఏర్పాట్లు చేయాలి. అలా చేయకపోతే ఫిర్యాదు చేయొచ్చు.

నోటీసు బోర్డు : పెట్రోలియం సంస్థ పేరు, సంప్రదింపు నంబరు రాసి పెట్రోలు బంకు యజమాని దానిని ప్రజలకు కనిపించేలా నోటీసు బోర్డు ఏర్పాటుచేయాలి. దీని ద్వారా వినియోగదారులకు పెట్రోలు బంకు యజమాని లేదా సంబంధిత సంస్థను సంప్రదించేందుకు అవకాశం లభిస్తుంది. ప్రతి పెట్రోలు బంకు వద్ద ప్రారంభం, ముగింపు సమయం నోటీసు ద్వారా తెలపాలి.

బిల్లులు ఇవ్వాలి : పెట్రోలు, డీజిల్ బిల్లు కొన్ని కారణాలతో బంకులో పనిచేసే వారు ఇవ్వటానికి నిరాకరిస్తే దాని గురించి కూడా ఫిర్యాదు చేయొచ్చు.

గాలినింపుకునే సౌకర్యం : బంకు యాజమాన్యాలు వాహనాల్లో గాలిని నింపటానికి ఎలక్ట్రానిక్ యంత్రాన్ని, గాలిని నింపటానికి ఒక వ్యక్తిని నియమించాలి. ఈ సదుపాయం ఉచితంగా అందించాలి.

పైన పేర్కొన్న సదుపాయాల్లో ఏవి మీకు అందుబాటులో లేకున్నా మీరు సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదుచేయొచ్చు. లేదా పెట్రోలు బంకులో ఉన్న ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ సెల్‌నంబరుకు వాట్సాఫ్ లేదా ఇమెయిల్ ఐడికి ఫిర్యాదు చేయొచ్చు.

నాణ్యమైన ఉత్పత్తులను సంబంధిత వాహనాలకు పరిమితిని తెలుసుకుని వాహన తయారీదారుల ప్రతిపాదిత ఆయిల్‌ను ఇంజన్‌కు అందించటం ద్వారా ఇంజన్ కాలపరిమితిని, రక్షణను కల్పించుకోవచ్చు.

## బహిరంగ వేలంలో రైస్ మిల్ విక్రయం



**కొల్చారం, వెలుతురు న్యూస్ నవంబర్ 13:**
మండల పరిధిలోని వరిగుంతం గ్రామంలో గల శ్రీధర్ గుప్తాస్థిరాస్తులను ప్రభుత్వం బుధవారం బహిరంగ వేలంలో విక్రయించింది. నర్సాపూర్ పట్టణానికి చెందిన పైడి శ్రీధర్ గుప్తా సివిల్ సప్లై శాఖకు చెల్లించవలసిన బకాయిల కింద అతనికి చెందిన స్థిరాస్తులు మూడు ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో గల పండ్ల తోట, నిర్మాణంలో ఉన్న రైస్ మిల్లును అధికారులు గతంలో మూడుసార్లు వేలం వేయగా కొనటానికి ఎవరు ముందుకు రాలేదు. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో మహిపాల్ ఆధ్వర్యంలో కొల్చారం తాసిల్దార్ గఫర్ మియా కార్యాలయం ఆవరణలో బుధవారం మరో మారు వేలం నిర్వహించారు. ఈ వేలంలో పెద్దపల్లి జిల్లా రాంపల్లి గ్రామానికి చెందిన తాటిపర్తి శివకుమార్ మొదటి స్థిరాస్తి పండ్లతోటను కోటి 76 లక్షలు, రెండవ స్థిరాస్తి రైస్ మిల్లును 9 కోట్ల 60 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ గఫర్ మియా మాట్లాడుతూ విక్రయించిన ఆస్తుల విలువ మొత్తం 11 కోట్ల 36 లక్షలలో 25 శాతం రెండు రోజుల్లోగాచెల్లించాలని, మిగతాది నెల గడువులో చెల్లించాలని కొనుగోలుదారుకు సూచించారు. మొత్తం విలువ చెల్లించిన తర్వాత కలెక్టర్ ధ్రువీకరణ మేరకు రిజిస్ట్రేషన్ చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మహమ్మద్ గౌస్, డిప్యూటీ తాసిల్దార్ నాగవర్ధన్, గిర్దావర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ సురేష్ శెట్కార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సిడిసి చైర్మన్ ముబీన్....



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం చెరకు అభివృద్ధి కౌన్సిల్ చైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ ముబీన్ మంగళవారం సాయంత్రం జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్ ని హైదరాబాద్ లోని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సీడీసీ చైర్మన్ ఎంపికకు సహకరించిన ఎంపీ కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ సిడిసీ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ ముబీన్ కు సి డి సి చైర్మన్ గా నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు...



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని పస్తాపూర్ లో గల ఎస్ వి ఫంక్షన్ హాల్ లో బుధవారం జరిగిన డాక్టర్ చంద్రశేఖర్ కుమారుని పెళ్లి వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ పిఎసిఎస్ చైర్మన్ మచ్చేందర్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు యాకూబ్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరూ రాథోడ్, మండల సోషల్ మీడియా ఇంచార్జి విజయ్ రాథోడ్, మాజీ సర్పంచులు చిన్నారెడ్డి, పర్వేజ్ యువ నాయకులు భీమ్ రావ్ రాథోడ్, శేఖర్, నారాయణ రెడ్డి తదితరులు.

## వివాహ వేడుకలకీ హాజరైన సిద్దం:ఉజ్వల్ రెడ్డి



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పరిధిలోని పస్తాపూర్ గ్రామంలోని ఎస్.వీ. కన్వెన్షన్ లో బుధవారం జరిగిన డాక్టర్ సోమ.చంద్రశేఖర్ తనయుడి వివాహ వేడుకలకీ జహీరాబాద్ పార్లమెంట్ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్దం.ఉజ్వల్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ సిడిసి చైర్మన్ ముబీన్, జహీరాబాద్ మండల అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా నాయకులు ప్రజాప్రతినిధులు, మాజీ యంపిటిసి లు, తాజా మాజీ సర్పంచ్ లు,మాజీ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూత్ కాంగ్రెస్, ఎన్.యస్.యూ.ఐ. నాయకులు కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.



# గ్రూప్- 3 పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ

### 18 పరీక్షా కేంద్రాలలో 8 వేల 947 మంది అభ్యర్థులకు ఏర్పాట్లు

### గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్

**పెద్దపల్లి, వెలుతురు, నవంబర్ -13:**
జిల్లాలో గ్రూప్ 3 పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ టిజిపిఎస్సి గ్రూప్ -3 పరీక్షా ఏర్పాట్లు, సన్నద్ధతపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 17 ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు రెండు సెషన్లు, నవంబర్ 18న ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు గ్రూప్ 3 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పక్కాగా జరగాలని అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. గ్రూప్ 3 పరీక్షను పెద్దపల్లి జిల్లాలో మొత్తం 8 వేల 946మంది అభ్యర్థులు పాల్గొంటున్నారని వీరి కోసం 18 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి 3 పరీక్ష కేంద్రాలకు తహసిల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసామని, పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రూప్ పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ అవసరమైన మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు వీలుగా జాయింట్ రూట్ అధికారులను నియమించాలని అన్నారు. ప్రతి 150 మంది అభ్యర్థులకు ఒక జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ సిబ్బందిని ఐడెంటిఫికేషన్ అధికారులు గానీ నియమించామని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్ష రాస విద్యార్థులకు అవసరమైన త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, పరీక్ష కేంద్రాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని, బెల్ ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదని, ఎవరు ఫోన్ తీసుకొని రావద్దని అన్నారు. పరీక్షా కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ షాపులు మూసివేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్ లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్ లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించడం జరగదని, ఈ అంశాన్ని అభ్యర్థులకు చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ సి విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కొల్‌కతాలో భారీ అగ్ని ప్రమాదం

**కోల్‌కతా, నవంబర్ 13 ( వెలుతురు) :**
పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని సంధ్యా బజార్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ ఫైటర్స్ ఫైరింజన్ల సాయంతో మంటలను అర్పుతున్నారు. మంటలను ఆర్పేందుకు మొత్తం ఆరు ఫైరింజన్‌లను వినియోగిస్తున్నారు. సంధ్యాబజార్‌లో వరుసగా దుకాణ సముదాయాలు ఉంటాయని, ఒక దుకాణం లో చెలరేగిన మంటలు క్రమంగా పక్కనున్న దుకాణాలకు విస్తరించాయని స్థానిక అధికారులు తెలిపారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమై ఉంటుందని చెప్పారు. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పుతున్న దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.

## బాధితుడికీ ఎల్ ఓ సి అందజేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉజ్వల్ రెడ్డి ....



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం బడంపేట గ్రామానికి చెందిన సజ్జాపూర్ నర్సింహులు అనారోగ్య సమస్య రావడంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం 2 లక్షల 50 వేల రూపాయలు ఖర్చు వస్తుందని వైద్యులు తెలుపడంతో బాధితుడికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి ని సంప్రదించగా తక్షణమే వారు స్పందించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ల సహకారంతో బాధితుడు నర్సింహులు కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రెండు లక్షల యాభై వేల రూపాయల ఎల్ ఓ సి ని విడుదల చేయించారు. మంజూరైనా ఈ ఎల్ ఓ సి ని జహీరాబాద్ పార్లమెంట్ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్ రెడ్డి చేతుల మీదుగా బాధితుడు నర్సింహులు కుటుంబ సభ్యులకుకీ అందించారు. ఈ కార్యక్రమంలో కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంలింగా రెడ్డి, సిడిసి చైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ ముబీన్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవి ఆశీస్సులతో మానవాళి సుఖసంతోషాలతో ఉండాలి...

### మాజీ ఎంపిటిసి దేశెట్టి పాటిల్



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కేంద్రంలోని పస్తాపూర్ వార్డులో భాగమైన మహీంద్రా కాలనీలో గల జేకే కన్స్ట్రక్షన్స్ కార్యాలయంలో దీపావళిని పురస్కరించుకుని చైర్మన్ దేశెట్టి పాటిల్ లక్ష్మీ పూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి బొమ్మ దేశెట్టి పాటిల్ మాట్లాడుతూ లక్ష్మీదేవి తల్లి ఆశీస్సులతో సమస్త ప్రజానీకం సుఖ సంతోషాలతో ఉండి రైతులందరు పడిపంటలతో కళకళలాడలని, ప్రజలందరూ ఆయుష్షు ఆరోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పూజ అనంతరం మాజీ డిఆర్ యూసీసీ మేంబర్ షేక్ ఫరిద్, మాజీ కౌన్సెలర్ బెజుగం సతీష్, సిరి కన్స్ట్రక్షన్స్ వ్యవస్థాపక చైర్మన్ నడిమీదొడ్డి ప్రవీణ్ కుమార్ (ఫైడ్ గుమ్మాల్) బృందంలు హాజరై లక్ష్మీదేవిని దర్శించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బెజుగం సతీష్ కుమార్, మాజీ రైల్వే మేంబర్ షేక్ ఫరిద్, బొమ్మ సిద్ధప్ప, ఫైడ్ గుమ్మల్ కాంటెస్టెడ్ ఎంపిటిసి నడిమీదొడ్డి ప్రవీణ్ కుమార్, సీనియర్ పాత్రికేయులు తయ్యబ్ అలీ, పబ్బతి సంతోష్ కుమార్ గుప్త, మ్యాతరి తుల్జారం, అబ్దుల్లా సిద్దిఖీ, నాయకులు రాం శెట్టి ఇప్పేపల్లి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 15 పర్సంట్ కమీషన్ పాలన

(మొదటి పేజీ తరువాయి..)
సమావేశం నిర్వహించారు. కర్నాటక బీజేపీ ప్రతిపక్ష నేత నారాయణస్వామి, హిమాచల్ ప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్ బిందాల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగడి మనోహర్ రెడ్డి లతో కలిసి బండి సంజయ్ కుమార్ ఏం మాట్లాడారంటే....

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడికి (మహారాష్ట్ర)కు వచ్చి మాట్లాడినవన్నీ పచ్చి అబద్దాలే. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని చెప్పడం అవాస్తవం. తెలంగాణ సొమ్మును వెచ్చించి మహారాష్ట్రలో యాడ్స్ ఇచ్చారు. కానీ ఆ యాడ్స్ లో ఆరు గ్యారంటీల ఊసే లేదు. తప్పుడు హామీలతో ఇక్కడ ప్రజలను మోసం చేయాలనుకుంటున్నారు. అందుకే వాస్తవాలు చెప్పేందుకే మీ ముందుకొచ్చాను.

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలలో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయనేలేదు. మేనిఫెస్టోలో పొందుపర్చిన 420 హామీల్లో కూడా ఒక్కటీ అమలు చేయలేదు. ఎందుకంటే కాంగ్రెస్ ఫోర్ ట్వంటీ సర్కార్.

తెలంగాణలో ప్రతి మహిళకు ఒక తులం (10 గ్రాములు) బంగారం, ఒక స్కూటీ, నెలకు రూ. 2,500 నెలసరి పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఒక్కరికి కూడా ఇవ్వలేదు. నిరుద్యోగ యువతకు ప్రతి నెల రూ.4 వేల నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇయ్యలే. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. వృద్ధాప్య పింఛన్‌ను నెలనెలా రూ.4 వేలు ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారు. పేదలకు ఇండ్ల జాగాతోపాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలిజస్తామని మోసం చేశారు.

తెలంగాణలో రైతులను నిండా ముంచారు. రైతులు, కౌలు రైతులకు ప్రతి ఎకరానికి రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలిస్తామని హామీ ఇచ్చారు. వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. బోనస్ సంగతి దేవుడెరుగు... కనీస మద్దతు ధర (MSP) కూడా



లభించకుండా చేస్తున్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏలివ్వలేదు. పీఆర్సీ అమలు చేయలేదు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతం పెంచుతామని బీసీ వర్గాలను కూడా మోసం చేశారు.

కాంగ్రెస్ పార్టీ తొలుత హిమాచల్ ప్రదేశ్‌లో 10 గ్యారంటీలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. కర్ణాటకలో పాంచ్ న్యాయ్ పేరుతో, తెలంగాణలో ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చాక ప్రజలను నిలువునా మోసం చేశారు. హర్యానాలోనూ ఇట్లాంటి హామీలతో అధికారంలోకి రావాలని భావిస్తే... ప్రజలు కాంగ్రెస్‌ను తిప్పి కొట్టారు. ఇప్పుడు మళ్లీ మహారాష్ట్రలోనూ మహిళలకు రూ.3 వేలు, నిరుద్యోగ యువతకు రూ.4 వేలు ఇస్తామని హామీలు గుప్పిస్తున్నారు. కుల గణన వాగ్దానం చేస్తూ మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారు. విజులైన మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ అబద్ధాలను విశ్వసించరు.

తెలంగాణలో కుల జనగణన పేరుతో ఆస్తిపాస్తుల వివరాలు సేకరించాలని చూస్తుంటే ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కుల గణన సంగతి తరువాత ముందుగా 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలోనే నిండా అవినీతిలో కూరుకుపోయింది. రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారు. మూసీ పునరుజ్జీవం పేరుతో రూ.1.5 లక్షల కోట్లను దోచుకునేందుకు సిద్ధమయ్యారు. మూసీ పునరుజ్జీవానికి బీజేపీ వ్యతిరేకం కాదు. ఆ పేరుతో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకం. తెలంగాణలో 15 శాతం కమీషన్ల పాలన నడుస్తోంది. ఏ పని కావాలన్నా, ప్రాజెక్టు కావాలన్నా 15 శాతం కమీషన్ తీసుకుంటున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం తో కలిసి పనిచేస్తూ ఒక వర్గం ఓట్ల కోసం హిందువులపై వివక్ష చూపుతోంది. తెలంగాణలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయి. గత పది నెలల్లోనే దాదాపు 100కుపైగా దేవాలయాలపై దాడులు జరిగాయి. సల్మాన్, సలీం, ఖుర్షీద్, ఇక్బాల్ వంటి వారు ఇట్లాంటి దాడులకు పాల్పడుతున్నా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు.

కాంగ్రెస్ పార్టీ ఇదే ఫార్ములాను మహారాష్ట్రలో కూడా అమలు చేయాలని ప్రయత్నిస్తోంది. కులం, మతం ఆధారంగా చీల్చి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది. 2004లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ సుప్రీంకోర్టు ముస్లిం రిజర్వేషన్లను కొట్టివేసింది. అయినప్పటికీ ఇదే హామీని మహారాష్ట్ర ప్రజలకు ఇస్తూ మరోసారి మోసం చేయాలని చూస్తోంది. ఈరోజు పత్రికలో చదివాను. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పనుల కాంట్రాక్టుల్లో 4 శాతం పనులు ముస్లిం లకు ఇవ్వాలని ప్రతిపాదనలు రూపొందించింది. ఇది దుర్మార్గమైన చర్య.

మహారాష్ట్ర ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మస్థలం మాత్రమే కాదు. దేశానికి నడిబొడ్డుగానూ నిలిచింది. భక్తి ఉద్యమం, స్వాతంత్ర్య పోరాటం, ఇంకా ప్రతి రంగంలో దేశానికి నాయకత్వం వహించింది. మొగల్స్ కోటను బద్దలు కట్టిన చరిత్ర మహారాష్ట్రది. ముస్లిం రిజర్వేషన్లను అమలు చేయాలనుకుంటున్న కాంగ్రెస్ కు మద్దతిస్తారా? ఆ ప్రశ్నే ఉత్పన్నం కాకూడదని కోరుతున్నా.

మహారాష్ట్రను అభివృద్ధిలో అన్ని విధాలా ముందుకు తీసుకెళ్లడానికి, ప్రజలకు సేవ చేయడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరుతున్నా. జై భారత్, జై మహారాష్ట్ర. ధన్యవాదాలు.

## కొడంగల్ అభివృద్ధికి మోకాలడ్డు

### లగచర్లలో దాడి వెనక కుట్ర

### సీఎం రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి

**వికారాబాద్, నవంబర్13 వెలుతురు:**
లగచర్ల ఘటన దురదృష్టకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు, కొండగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ తిరుపతి రెడ్డి అన్నారు. 50 సంవత్సరాలుగా వెనకబడిన కొండగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సీఎం పరితపిస్తుంటే బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు అడ్డుపడుతున్నారని తిరుపతి రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గం అభివృద్ధి కాకుండా ఆ పార్టీ నేతలంతా శాయశక్తులా పని చేస్తున్నారని మండిపడ్డారు. కొంతమంది చిల్లర, మల్లర మూకలను రప్పించి అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని తిరుపతి రెడ్డి ధ్వజమెత్తారు. కొడంగల్ నియోజకవర్గాన్ని ఇప్పుడు అభివృద్ధి చేసుకోకపోతే జీవితంలో ఎప్పటికీ అభివృద్ధి చేసుకోలేమని తిరుపతి రెడ్డి చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులపై మె?న్న జరిగిన దాడిలో ఎంత మంది ఉన్నారో వారందరిపై విచారణ జరిపి కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూములు కోల్పోతున్న రైతులు పరిహారం కావాలంటే సీఎం రేవంత్ రెడ్డి, కలెక్టర్



ప్రతీక్ జైన్ లేదా తమకు చెప్పుకోవాలని కోరారు. అల్లరి మూకలతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే నష్టపోయేది కొడంగల్ ప్రజలేనని ఆయన ఉద్ఘాటించారు. ఇప్పుడు వచ్చిన అవకాశం మళ్లీమళ్లీ రాదని తెలిపారు. కేటీఆర్, హరీశ్ రావు, నరేందర్ రెడ్డిలు అమాయక యవతను మద్యానికి బానిసలుగా చేశారని, వారిని రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నారని తిరుపతి రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల మోసపూరిత మాటలు నమ్మి యువకులు మోసపోవద్దని ఆయన హెచ్చరించారు. గొడవలకు పోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రైతులను ఒప్పించి, మెప్పించి, వాళ్ల అంగీకారంతో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తామని తిరుపతి రెడ్డి తేల్చి చెప్పారు.

## నేడు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా...




**గోదావరిఖని, వెలుతురు, నవంబర్ 13:**
ఆదిత్య అనఘా మల్టీ స్టేట్ క్రెడిట్ కార్పోరేషన్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ కళాశాల లో టాస్క్ కోఆర్డి నేటర్ సుబ్బారావ్ ,మెంటర్ ఉషారాణి ఆధ్వర్యంలో ఈ రోజు(గురువారం) జాబ్ మేలా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .ఈ జాబ్ మేళా లో ఆఫీసర్ సీనియర్ ,ఆఫీసర్ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మరియు బ్రాంచ్ మేనేజర్ ఉద్యోగాల ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. కంపెనీ నిర్వహించే ఈ ఉద్యోగమేళాకు అర్హతల విద్యార్థిని విద్యార్థులు తమ ఒరిజినల్ మరియు జిరాక్స్ సర్టిఫికెట్ తో పాటు పూర్తి బయోడేటా రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని గురువారం ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణానికి హాజరుకావాలని మరింత సమాచారం కోసం 9849740479 నెంబర్ లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలి

**ఇంటింటి సర్వే వివరాలను పకడ్బందీగా సేకరించాలి**

**ఓదెల మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**





**ఓదెల, వెలుతురు, నవంబర్ -13:**
జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఓదెల మండలంలో విస్తృతంగా పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ను పరిశీలించారు. ఓదెల మండలంలోని కొలనూరు , లంబాడి తండ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద వచ్చిన ధాన్యాన్ని ప్యాడి క్లీనర్ల ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. నాణ్యత ప్రమాణాలను పరీక్షించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సన్న రకం ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు లేకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని బ్యాగులు అందుబాటులో పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ పక్కగా చేయాలని, ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించాలని, ఏ ఒక్క కుటుంబం కూడా మిస్ కావడానికి వీల్లేదని కలెక్టర్ అధికారులకు సూచించారు.. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఓదెల మండల తహసిల్దార్ యాకన్న, ఎంపీడీవో తిరుపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభావిత గ్రామాలలో అభివృద్ధి పనులను పరిశీలించిన సంచాలకులు



**గోదావరిఖని, వెలుతురు,నవంబర్. 13:**
ఆర్జీ-1ఏరియాలోని పలు ప్రభావిత గ్రామాలలోజరిగిన అభివృద్ధి పనులను పరిశీలించుటకు డైరెక్టర్,సైంటిస్ట్-ఎఫ్ మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్ మెంట్,ఫారెస్ట్, క్లైమెట్ ఛేంజ్,గౌవర్నమెంట్ ఆఫ్ఇండియా తరుణ్ కత్తుల, రెండో రోజు,బుధవారం, సందర్శించడము జరిగినది. సింగరేణి ప్రభావిత గ్రామలలో పర్యావరణ పరిరక్షణ, సంరక్షణలో భాగంగా ప్రతి 6నెలలకు ఒక్కసారితనికి చేయటంలోభాగంగా సమీపగ్రామాల పరిసర ప్రాంతాల్లో రేమిడేషన్ ప్లాన్ , న్యాచురల్ కమ్యూనిటి రోసోర్స్, గురించి, ముస్యాల, సుందిళ్ళ, జనగామ సింగరేణి ప్రభావిత గ్రామలలో జరిగిన రోడ్ల నిర్మాణం,సోలార్ లైట్స్,ఆర్. ఓప్లాంట్స్, జనగామ గ్రామములో ఉన్నత పాటశాల నందు నిర్మించిన అదనపు గదులు, వంటరూము, టాయిలెట్స్, గోదావరి పుష్కరఘాట్,వాటిని సందర్శించడం జరిగినది. అనంతరం జిడికే2 & 2ఏ, ఇంక్లైన్ దగ్గర నిర్మాణ దశలో ఉన్న17ఎం ఎల్ డి సివేజ్, ట్రీట్ మెంట్ ప్లాంట్, నీటి శుద్ధి ప్లాంట్ నుసందర్శించి అక్కడజరుగుతున్న పనులగురించి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ. 1జియం,లలిత్ కుమార్, కార్పోరేట్ ఎన్విరాన్, మెంట్, జియం బి.సైదులు, ఎన్విరాన్, మెంట్ అధికారులు కార్పోరేట్, రవికిరణ్, సి. హెచ్.శ్రీనివాసు ఏరియా ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ఫారెస్ట్ అధికారి కర్ణ, సివిల్ ఇంజనీర్ వసంత్ కుమార్, పాల్గొన్నారు.

## కళా ప్రదర్శనలు సమాజ చైతన్యమే లక్ష్యంగా ఉండాలి

**గోదావరిఖని, వెలుతురు, నవంబర్ 13**
స్థానిక నియర్ అండ్ డియర్ ఫ్రెండ్లీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, రామగుండం ట్రస్మా సహకారంతో 'విద్యా విలువలు' అంశంతో ఇటీవల నిర్వహించిన లఘు చిత్రాలపోటీ విజేతలకు బహుమతులు అందజేసి, అభినందించారు. స్థానిక మార్కండేయ కాలనీలోని రెయిన్ బో స్కూల్ లో మంగళవారం రాత్రి నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం మండల విద్యాధికారి చంద్రయ్య, టీవీ, సినీ నటులు వాలి సత్య ప్రకాష్ మాట్లాడుతూ సమాజాన్ని ఆలోచింపజేసే కథాంశంతో లఘు చిత్రాల పోటీ నిర్వహించడం అభినందనీయమన్నారు. నేడు సోషల్ మీడియా చాలా ప్రభావశీలంగా ఉందని, సమకాలీన అంశాలపై లఘు చిత్రాలు నిర్మించాలన్నారు. వచ్చిన చిత్రాలను ప్రదర్శించగా..'మట్టిలో మాణిక్యం' లఘుచిత్రం ప్రథమ బహుమతి, 12వేల రూపాయలు గెలుచుకోగా, 'అక్షర' ద్వితీయ బహుమతి, ఆరు వేల రూపాయలు, 'విద్య' తృతీయ బహుమతి, మూడు వేల రూపాయలు, 'విలువ, టీవీ వద్దు-చదువే ముద్దు' ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నాయి. అతిథులు విజేతలకు నగదు బహుతులతో పాటుగా జ్ఞాపికలు, సర్టిఫికెట్లులందజేసి, దర్శక నిర్మాతలను, అతిథులను శాలువాలతో సత్కరించారు. సంస్థ




అధ్యక్షులు పీఎస్ అమరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేశవ రెడ్డి, బుచ్చి రెడ్డి, సీనియర్ పాత్రికేయులు మల్లావఝుల వంశీ, దయానంద్ గాంధీ, మేజిక్ రాజా, సంస్థ ప్రధాన కార్యదర్శి దామెర శంకర్, విజయానంద్, సంజీవ్, డాక్టర్ మంద భాస్కర్ యాదవ్, పొన్నం విజయ్ కుమార్ గౌడ్, వేముల అశోక్, చిత్ర దర్శక, నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల పరిశీలన

**రాఘవపూర్ -కన్నాల వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు**

**ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**






**పెద్దపల్లి, వెలుతురు,నవంబర్ -13:**
జిల్లాలోని రాఘవపూర్ కన్నాల వద్ద జరుగుతున్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మండలం రాఘవపూర్ కన్నాల రైల్వే ట్రాక్ వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు ఘటనాస్థలానికి చేరుకొని అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి 8.30 గంటలకు రాఘవపూర్ కన్నాల రైల్వే ట్రాక్ వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పి ప్రమాదం జరిగిందని, ఈ సమాచారం అందుకున్న కలెక్టర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని బుధవారం తెల్లారుజామున వరకు ఉండి పోలీసు సిబ్బంది తో కలసి అవసరమైన చర్యలు చేపట్టారు. సింగరేణి సంస్థతో మాట్లాడి ఘటన స్థలానికి వెంటనే భారీ క్రేన్లు తీసుకుని వచ్చి పట్టాలు తప్పిన గూడ్స్ రైలును క్లియర్ చేసే పనులు ప్రారంభించారు. బుధవారం ఉదయం మళ్లీ ఘటన స్థలానికి వెళ్ళిన కలెక్టర్ అక్కడ జరుగుతున్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులను ట్రాక్ పై ట్రాలి పై వెళ్లి పరిశీలించి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రైల్వే జీఎంను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి తహసిల్దార్ జ్యోతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గ్రూప్- 3 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

### తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి

**నవంబర్ 17న రెండు సెషన్స్, 18న ఉదయం గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ**

**గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్షించిన టి.జి.ఎస్.పీ.ఎస్.సి చైర్మన్**




**పెద్దపల్లి, వెలుతురు, నవంబర్ -13:**
గ్రూప్ 3 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి టిజిపిఎస్సి గ్రూప్ -3 పరీక్షా ఏర్పాట్లు, సన్నద్ధత పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 17 ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు రెండు సెషన్లు, నవంబర్ 18న ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు గ్రూప్ 3 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పక్కాగా జరగాలని అధికారులకు చైర్మన్ సూచించారు. గ్రూప్ 3 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా జిల్లా స్థాయిలో చేస్తున్న ఏర్పాట్ల వివరాలను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రాలు, ఇతర ముఖ్యమైన సామాగ్రి స్ట్రాంగ్ రూమ్ లో స్టోర్ చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్ లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్ లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించడం జరగదని, ఈ అంశాన్ని అభ్యర్థులకు చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని చైర్మన్ సూచించారు. పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించాలని చైర్మన్ సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేయాలని, ఎక్కడ ఎటువంటి పొరపాటు రాకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతి 3 నుంచి 4 పరీక్ష కేంద్రాలకు తహసిల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని, పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చూడాలని చైర్మన్ సూచించారు. గ్రూప్ పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ అవసరమైన మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు వీలుగా జాయింట్ రూట్ అధికారులను నియమించాలని,ప్రతి 150 మంది అభ్యర్థులకు ఒక ఐడెంటిఫికేషన్ అధికారులు గానీ నియమించాలని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, సంబంధించిన అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యం గల క్రీడాకారులకు ప్రత్యేక సహకారం అందిస్తాం

### ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్



**గోదావరిఖని, వెలుతురు ,నవంబర్ ,13**
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైన కరాటే క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే క్రీడల్లో ప్రతిభ ఘనపరుస్తూ పథకాలు సాధిస్తున్న నైపుణ్యం గల క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక సహకారాన్ని అందిస్తుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ హామీ ఇచ్చారు. బుధవారంసాయంత్రం రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కార్యాలయంలో ఇటీవల సంగారెడ్డి లో జరిగినఅండర్ 14 స్కూల్, గేమ్స్, ఫెడరేషన్, రాష్ట్రస్థాయి పోటీలో బంగారు పతకాలు సాధించిజాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కరాటే క్రీడాకారులను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అభినందించారు. ఈ సందర్భంగా, ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలో రాణించాలని పిలుపునిచ్చారు, క్రీడాల భివృద్ధికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. త్వరలో రామగుండంలో నిర్వహించబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీలపై ఎమ్మెల్యే, మక్కాన్, సింగ్ చర్చించారు. ఎస్ జి ఎఫ్ కరాటే పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచిస్తూ పోటీలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ పేర్కొన్నారు. ఎస్ జి ఎఫ్, జాతీయస్థాయి కరాటే పోటీల్లో అత్యధిక పథకాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జపాన్ షీటోరియో, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తగరపు శంకర్,విక్టరీ షుటో ఖాన్, మాస్టర్ సురేష్ , జపాన్ ,సిటోరియో కరాటే స్కూల్ తెలంగాణ స్టేట్ చీఫ్ అండ్ బెల్ట్ ఎగ్జామినర్ కరాటే శ్రీనివాస్,టైగర్ కరాటే క్లబ్ అధ్యక్షులు పసుపునుటి శంకర్, రాజ్ కుమార్,శ్రీనివాస్, పాల్గొన్నారు.

## గీతా కార్మికుడిని పరామర్శించిన జక్కే వీరస్వామిగౌడ్



**జమ్మికుంట వెలుతురు నవంబర్ 13:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం లోని విలాసాగర్ గ్రామానికి చెందిన గీతా కార్మికుడు ముంజాల సదయ్య గౌడ్ తాటి చెట్టుపై నుండి పడి శనివారం రోజున తీవ్రగాయలై ఎడమచేయి విరిగినది.హాస్పటల్ నుండి ఇంటికి రాగ అతన్ని పరామర్శించిన సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘము రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జక్కే వీరస్వామిగౌడ్ మాట్లాడుతు రాష్ట్రంలోని గీతా కార్మికులందరికి కాటమయ్య రక్షణ కవచాలు ప్రభుత్వం అందించి గీతా కార్మికుల ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపాలని వీరస్వామిగౌడ్ డిమాండ్ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్టంలో అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న చెట్టుమిడికెల్లి పడిన గీతా కార్మికులకు ఎక్సగ్రేషియా రాక ఎదిరి చూస్తున్నారని త్వరగా ఎక్సగ్రేషియా అందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని వీరస్వామిగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గీతా కార్మికున్ని పరామర్శించిన వారిలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొమ్మిడి గణపతిరాజ్ గౌడ్ విలాసాగర్ గౌడ సంఘము ఉపాధ్యక్షులు ముంజాల చెన్నయ్య గౌడ్ పాల్గొన్నారు.

## హోటళ్లలో మేయర్ ఆకస్మిక తనిఖీలు

**కుళ్లిన మాంసం వాడుతున్న మొఘల్ రెస్టారెంట్**

**మేయర్ ఆదేశాలతో రెస్టారెంట్‌ను క్లోజ్ చేసిన అధికారులు**

**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**
హైదరాబాద్‌లో పలు హోటళ్లను మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీలు చేశారు. కుళ్లిన మాంసాన్ని గుర్తించి హోటల్ యజమానులకు చీవాట్లు పెట్టారు. ఖైరతాబాద్, లక్డీకపూల్ ఏరియాలోని హోటల్స్, రెస్టారెంట్లు, కిచెన్లలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఖైరతాబాద్‌లోని మొఘల్ రెస్టారెంట్లో ఆహార పదార్థాల తయారీని తనిఖీ చేసిన మేయర్.. కిచెన్ పూర్తిగా అపరిశుభ్రంగా ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ పక్కనే వంట చేస్తుండటం గమనించిన మేయర్.. రెస్టారెంట్ ఓనర్‌పై సీరియస్ అయ్యారు. కుళ్లిపోయిన నాన్ వెజ్ వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు.. మేయర్ ఆదేశాల మేరకు మొఘల్ రెస్టారెంట్‌ను క్లోజ్ చేశారు. రెస్టారెంట్‌ను సీజ్ చేసిన అధికారులు కిచెన్‌లో ఫుడ్ శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. కల్తీ ఆహార పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా మేయర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.

## జమ్ముకశ్మీర్ పెరుగుతున్న ఉగ్ర కార్యకలాపాలు

**స్థానికుల నుంచి సహకారం అందుతుందని సైనికుల అంచనా**

**భద్రత కట్టుదిట్టం చేసిన అధికారులు**



**జమ్ముకశ్మీర్, నవంబర్ 13 ( వెలుతురు) :**
జమ్మూ కశ్మీర్‌లో విదేశీ ఉగ్రవాదులు పెద్ద ఎత్తున కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఉగ్రవాదుల కార్యకలాపాలతో పాటు రిక్రూట్‌మెంట్‌లు నిర్వహించే పద్ధతుల్లో సైతం మార్పులు కనిపిస్తున్నది. సరిహద్దుల్లోకి చొరబడడం మాని అంతర్గత ప్రాంతాల్లో దాక్కొని దాడులకు తెగబడుతున్నారు. ఉగ్రవాదులకు స్థానికంగా తక్కువ మంది మాత్రమే సహకారం అందిస్తున్నట్లుగా సైన్యం వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో 119 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో 79 మంది పీర్ పంజాల్‌లో ఉన్నారు. 18 మంది స్థానికులు, 61 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు ఉన్నట్లు అంచనా. పీర్ పంజాల్‌కు దక్షిణాన 40 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారు. ఇందులో 34 మంది పాకిస్థానీలు కాగా.. ఆరుగురు స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. సమాచారం మేరకు.. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు 25 ఉగ్రవాద ఘటనలు రికార్డయ్యాయి. ఈ ఘటనల్లో 24 మంది జవాన్లు అమరులయ్యారు. గతేడాది ఈ సంఖ్య 27గా ఉన్నది. ఈ ఏడాది 61 మంది ఉగ్రవాదులు హతమవగా.. ఇందులో ఇంటీరియర్‌లో 45 మంది.. నియంత్రణ రేఖ వద్ద 16 మంది మరణించారు. ఇందులో 21 మంది పాక్ ఉగ్రవాదులు ఉన్నారు. ఇక నార్తర్న్ కమాండ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఎంవీ సుచీంద్ర కుమార్ వైట్ నైట్ కార్ప్స్‌ని సందర్శించారు. సైనిక సన్నద్ధతపై సమీక్షించారు. అప్రమత్తంగా ఉంటూ ఉగ్రవాదుల కోసం ఆపరేషన్ ముమ్మరం చేయాలని భద్రతా బలగాలను ఆదేశించారు. ఉగ్రవాదుల ఆచూకీ కోసం సైన్యం ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తూ వస్తోన్నది. ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో వృత్తి నైపుణ్యం, అప్రమత్తత పాటించాలని నార్తర్న్ కమాండ్ చీఫ్ ఆర్మీని కోరినట్లు ఆర్మీ సోషల్ మీడియా ద్వారా పేర్కొంది. ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడేందుకు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా.. ఆదివారం కిష్త్వార్‌లోని కేష్వాన్ అడవుల్లో ఉగ్రవాదులతో ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో ఆర్మీ స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన జేసీఓ రాకేశ్‌కుమార్ వీరమరణం పొందిన విషయం తెలిసిందే. అలాగే, మరో ముగ్గురు సైనికులు గాయపడ్డారు.

# ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు

## అధికారికంగా ప్రకటించిన చంద్రబాబునాయుడు



**తిరుమల, నవంబర్ 13 (వెలుతురు):**
ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఖరారయ్యారు. ఈ నిర్ణయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. డిప్యూటీ స్పీకర్ పదవికి ఇవాళ నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో బుధవారం ఆయన నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ రాజు ఎంపిక లాంఛనప్రాయంగానే జరగనుంది. ప్రస్తుతం అసెంబ్లీలో ఎన్డీయే కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. వైసీపీకి కేవలం 11 మంది ఎమ్మెల్యే ఉండటం.. పైగా వారు శాసన సభకు దూరంగా ఉండటంతో ఏకగ్రీవంగానే రఘురామ ఎన్నిక కానున్నారు. బీజేపీలో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన రఘురామ కృష్ణరాజు 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరారు. నరసాపురం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. కానీ కొంతకాలానికే జగన్‌పై ఆయన విమర్శలు చేస్తూ రెబల్‌గా మారారు. ఈ క్రమంలో గత ఎన్నికల ముందు రఘురామ టీడీపీలో చేరారు. ఉండి నుంచి ఎమ్మెల్యేగా పోటీ గెలిచారు.

# అసభ్య పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెడితే తప్పేముంది?

## పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వలేం





**అమరావతి, నవంబర్ 13 (వెలుతురు) :**
సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిపై పోలీసులు కేసులు పెడుతున్నారంటూ పిల్ వేయడంపై హైకోర్ట్ అభ్యంతరం తెలిపింది. సోషల్ మీడియా ఆక్టివిస్టలపై పోలీసులు మూకుమ్మడిగా కేసులు నమోదు చేయడంపై జర్నలిస్టు విజయబాబు వేసిన పిల్‌పై హైకోర్ట్‌లో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఈ కేసులకు సంబంధించి పిల్ వేయడంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసభ్యకర పోస్టులు పెట్టినవారిపై పోలీసులు కేసులు పెడితే తప్పేముందని న్యాయస్థానం ప్రశ్నించింది. ఒక దశలో న్యాయమూర్తులను కూడా అవమానపర్చేలా పోస్టులు పెట్టారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టీకరించింది. పోలీసులు పెట్టిన కేసులపై అభ్యంతరం ఉంటే సంబంధిత వ్యక్తులు నేరుగా కోర్టును ఆశ్రయించవచ్చని వెల్లడించింది. అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై పోలీసులు చట్టనిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తుంటే తాము ఎలా నిలువరించగలమని వ్యాఖ్యలు చేసింది. పిల్‌కు సంబంధించి తగిన ఉత్తర్వులు ఇస్తామని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఇటీవల కాలంలో కొన్ని సోషల్ మీడియాల్లో కొంతమంది మహిళలను కూడా దూషిస్తూ పెట్టిన పోస్టులను హైకోర్టు ధర్మాసనం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దీనికి ముందే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం మాత్రం జడ్జిలపై కూడా పోస్టులు పెట్టారని, ఇలా అసభ్యకరంగా పోస్టులు పెడితే తామెలా నిలువరించగలమని నిలదీసింది. అదేవిధంగా అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారిని పోలీసులు చట్టం ప్రకారం తప్పనిసరిగా వారిపై కేసులు నమోదు చేస్తారని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ హైకోర్టు బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వమని పునరుద్ఘాటించింది. ఈ విధంగా సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టడం క్షమార్హం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. కాగా.. సోషల్ మీడియా ఆక్టివిస్టలపై పోలీసులు మూకుమ్మడిగా కేసులు నమోదు చేయడంపై జర్నలిస్టు విజయబాబు హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే. అయితే జగన్ జమానాలో విజయబాబు కీలక పదవులు నిర్వహించారు. అంతేకాదు గతంలో ఒక పత్రికకు ఎడిటర్‌గా కూడా విజయబాబు వ్యవహరించారు.

# రోడ్డుపై బైఠాయించిన రైతులు

## సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**మహబూబ్‌నగర్, నవంబర్ 13 (వెలుతురు) :**



ధాన్యం కొనుగోళ్లలో రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోపన్‌పల్లి గ్రామంలో నేటికీ వడ్లు కొనుగోలు ప్రారంభించ లేదంటూ ఆగ్రహించిన రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎంతో కష్టపడి పంటలు పండిస్తే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం మొలకెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ట్రాక్టర్‌కి కట్టి ఊరేగించిన అనంతరం దహనం చేశారు.

# అక్రమ అరెస్టులను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆందోళన

**వికారాబాద్, నవంబర్ 13 (వెలుతురు):**
కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. నరేందర్ రెడ్డి వెంటనే విడుదల చేయాలని కోస్గిలో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తప్పుడు కేసులతో ప్రశ్నించే గొంతులను అణిచివేయలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడతు న్నదని ఆరోపించారు. ఆందోళనలు చేపట్టిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా వాహనాల్లో అక్కడ నుంచి తరలించారు. కాగా, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధైర్యం చెప్పారు. ఇవాళ ఉదయం హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో వాకింగ్ వెళ్లిన నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో పట్నం నరేందర్ రెడ్డికి కేటీఆర్ ఫోన్ చేశారు. అక్రమ అరెస్టుపై ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక నియంత విధానాలపై పార్టీ న్యాయపరంగా పోరాటం చేస్తూనే ఉంటుందని తెలిపారు. నరేందర్ రెడ్డి సతీమణి శృతికి కూడా కేటీఆర్ కాల్ చేసి ధైర్యం చెప్పారు. మీ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ మొత్తం అండంగా ఉంటుందని తెలిపారు. నరేందర్ రెడ్డి అరెస్టుపై బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ కోర్టులో న్యాయపోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు.

### బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది

### : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కొడంగల్‌లో రైతుల తిరుగుబాటుతో రేవంత్ రెడ్డి కంగుతిన్నారని అన్నారు. ఆ డ్యామేజీ కంట్రోల్ కోసమే లగచర్లలో జరిగిన ఘటనను బీఆర్ఎస్ పార్టీకి ఆపాదించే కుట్రలో భాగంగానే తనను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు ప్రజల గొంతుకై ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అని





పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. సమస్యలకు పరిష్కారం ఆలోచించకుండా ప్రతిపక్ష నాయకులను వేధించడం ప్రభుత్వ పనిగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం బాధ్యత మరిచినప్పుడు ప్రతిపక్షం ప్రశ్నిస్తూనే ఉంటుందని.. అది తప్పా అని ప్రశ్నించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో సోమవారం అధికారులపై దాడి ఘటనపై ఆ అర్ధరాత్రి నుంచే పోలీస్ యాక్షన్ షురూ అయింది. అర్ధరాత్రి వేళ.. కరెంట్ సరఫరా నిలిపేసి.. ఇంటర్నెట్ సేవలు బంద్ చేసి.. ఇండ్ల తలుపులు బద్దలు కొడుతూ.. ఇల్లిల్లూ సోదాలు చేసి.. సుమారు 300 మంది పోలీసులు 55 మందిని పట్టుకొని బంధించారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం 16 మంది రైతులకు కోర్టుకు రిమాండ్ చేశారు. వారికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వగా, పరిగి సబ్ జై లుకు తరలించారు. అలాగే బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్క్ వద్దకు వాకింగ్‌కు వచ్చిన పట్నం నరేందర్ రెడ్డిని కూడా అరెస్టు చేశారు. కాగా, నరేందర్ రెడ్డి అరెస్టుపై బీఆర్ఎస్ భగ్గుమంది. కొడంగల్ నియోజకవర్గవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చింది.

## కామారెడ్డిలో...

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని అజమాబాద్ గ్రామంలో అదనపు కలెక్టర్ ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. సన్న వడ్ల కొనుగోలులో సొసైటీ నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ విక్టర్ ఎదుట రైతులు తమ సమస్యలను ప్రస్తావించారు. సొసైటీ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైస్ మిల్లర్లు ధాన్యం కటింగ్ తీస్తుండడంతో తమకు ఆర్థిక నష్టం కలుగుతోందని, సొసైటీ అధికారులు సన్న వడ్ల కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం చూపిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. తక్షణమే సొసైటీ విధానంలో మార్పులు చేసి ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.



# హిందువులపై దాడులు ఎందుకు..


**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
మొన్న బంగ్లాదేశ్, ఈరోజు కెనడా.. రేపు ఇంకెక్కడా..? ఎందుకు హిందువులపై దాడులు జరుగుతున్నాయి..? దౌత్యపరంగా భారత్ కెనడాల మధ్య కొనసాగుతున్న విభేదాల మధ్యలో తాజాగా హిందువులు టార్గెట్ అవ్వడం విస్మయానికి గురిచేసింది. కెనడాలో దివాలీ పూజల కోసం వెళుతున్న హిందువులపై కెనడాలోని ఖలిస్తాన్ మద్దతుదారులు దాడులకు దిగారు. కెనడా పోలీసులు సైతం హిందువులపై దాడి చేశారు. ఈ దాడిని నిరసించే సమయంలోనూ కెనడా పోలీసులు రెచ్చిపోయారు. ఖలిస్తాన్ తీవ్రవాది నిజ్జర్ హత్యతో భారత్, కెనడా మధ్య దౌత్య వివాదాలు రాజుకున్నాయ్. అప్పటి నుండీ కెనడాలోని హిందువులపై, హిందూ దేవాలయాలపై దాడులు పెరిగాయి. వీటితో పాటు ఇరు దేశాల మధ్య దూరం కూడా పెరుగుతూ వచ్చింది. అయినప్పటికీ, కెనడా ప్రధాని మాత్రం తమ దేశంలోని సిక్కు తీవ్రవాదాన్ని సమర్థిస్తూనే ఉన్నారు. ట్రూడో మెతక వైఖరి వల్ల కెనడాలో మూడవ అతిపెద్ద మతంగా ఉన్న హిందూ మత ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి వస్తోందని హిందూ వాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉద్రిక్తతలు తగ్గెదెప్పుడా అని కెనడాలోని హిందువులు ఎదురుచూస్తున్నారు.ఏ దేశమైనా మరో దేశ అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చాలంటే ఒక అంతర్జాతీయ కారణం ఉండాలి. లేదంటే, అది తమ దేశంపై ఏదైనా ప్రభావం చూపుతుండాలి. అదీకాదూ అంటే, మానవహక్కుల ఉల్లంఘన వంటి వ్యవహారాల్లో సలహాలు, సూచనలు ఇవ్వొచ్చే. అలాకాదని, కేవలం తన రాజకీయ లాభాల కోసం భారతదేశంపై బురద చల్లాలనుకుంటున్నారు కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో. భారత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. కెనడా గడ్డపై జరుగుతున్న తీవ్రమైన నేరపూరిత చర్యల్లో భారత్‌కు ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఆరోపించినప్పటి నుండీ తన మాటల్లో నిజముందని చెప్పడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి సాక్ష్యాలను చూపించలేదు సరికదా.. ఇటీవల చేసిన కొత్త వాదనలో.. కెనడాలో ఖలిస్థాన్ అనుకూల అంశాలను లక్ష్యంగా చేసుకోవడానికి, లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో కలిసి భారత్ ఏజెంట్లు పనిచేస్తున్నారని కెనడా అధికారులు ఆరోపించారు. అక్టోబర్ 14 అర్ధరాత్రి ప్రెస్‌తో మాట్లాడిన రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ అధికారులు భారత్‌ను నిందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. నిజ్జర్ హత్యలో అనుమానితుల జాబితాలో కెనడాలోని భారత్ హైకమిషనర్ సంజయ్ వర్మ, ఇతర దౌత్యవేత్తల పేర్లను చేర్చారు.సిక్కు వేర్పాటు వాదులైన ఖలిస్థానీ తీవ్రవాదులు చేసే వ్యవస్థీకృత నేరాలతో సంబంధాలున్న వ్యక్తులకు కెనడా రక్షణ కల్పించడపై భారత్ దశాబ్దాలుగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే, ఈ ఏడాది మేలో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్..




నిజ్జర్ హత్యతో సంబంధం ఉన్న ముగ్గురు భారతీయులను అరెస్టు చేసిన తర్వాత కెనడా ఇమ్మిగ్రేషన్ విధానాన్ని విమర్శించారు. పంజాబ్ నుండి వ్యవస్థీకృత నేరాలతో లింక్‌లు ఉన్న చాలా మంది ఖలిస్థానీ తీవ్రవాదులను కెనడా స్వాగతిస్తుందనీ ఆరోపించారు. వీళ్లు భారతదేశంలో వాంటెడ్ క్రిమినల్స్ అనీ.. మీరు వారికి వీసాలు ఇచ్చారని కెనడా ప్రభుత్వాన్ని విమర్శించారు.ఇక, అక్టోబర్ 14న భారత హైకమిషనర్‌పై కెనడా అధికారులు ఆరోపణలు చేసిన తర్వాత, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఘాటైన ప్రకటనను విడుదల చేసింది. కెనడా ప్రధాని ట్రూడో ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నట్లు పేర్కొంది. దీనికి నిరసనగా, ఆరుగురు కెనడియన్ దౌత్యవేత్తలను బహిష్కరించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే, కెనడాలోని తమ హైకమిషనర్ సంజయ్ వర్మతో పాటు, మరికొందరు దౌత్యవేత్తలను కాల్ బ్యాక్ చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. అయితే, భారత్ ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల తర్వాత కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందించారు. ఆరుగురు భారత దౌత్యవేత్తలను తామే బహిష్కరించామని ఆయన చెప్పారు. నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వం సహకరించకపోవడమే ఇందుకు కారణమని ట్రూడో అన్నారు.కెనడాలో ఉన్న సిక్కు డయాస్పోరాలో ఖలిస్థాన్ ఉద్యమానికి మద్దతు ఉందనేది బహిరంగ రహస్యం. టెర్రర్ గ్రూపులకు మద్దతు ఇచ్చే కనీసం తొమ్మిది వేర్పాటువాద సంస్థలకు కెనడాలో స్థావరాలున్నట్లు సమాచారం ఉంది. వీటిపైన అనేకసార్లు బహిష్కరణ వేటుకూడా వేశారు. అయినప్పటికీ, కెనాడా దీనిపై చర్యలు తీసుకోలేదు. ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యతో సహా ఘోరమైన నేరాలకు పాల్పడిన ఖలిస్థాన్ తీవ్రవాదులపైన ఎటువంటి చర్యలు తీసుకోలేదని న్యూఢిల్లీలోని అధికారులు ఇటీవల వెల్లడించారు. వరల్డ్ సిక్ ఆర్గనైజేషన్-డబ్ల్యూఎస్ఓ, ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కెటిఎఫ్), సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె), బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బికెఐ) వంటి ఖలిస్తాన్ అనుకూల సంస్థలు కెనడియన్ నేలపైన పాకిస్తాన్ ఆదేశానుసారం పని చేస్తున్నాయని భారత్ ఆరోపిస్తూనే ఉంది. అయినప్పటికీ, కెనడాలో యదేచ్ఛగా తీవ్రవాద కార్యకలాపాలు నడుస్తూనే ఉన్నాయ్.ఖలిస్థాన్ వాంటెడ్ టెర్రరిస్టులు, గ్యాంగ్‌స్టర్ల బహిష్కరణ అంశాన్ని, గతంలో కెనడా, భారత్‌ల మధ్య జరిగిన అనేక దౌత్య, భద్రతా చర్చల్లో భారత అధికారులు ప్రస్తావించారు. కానీ, కెనడా అధికారులు ఈ సమస్యను పట్టించుకోక పోగా? ఉగ్రవాద వ్యవహారల్లో మద్దతు ఇస్తూ వస్తున్నారు. దీనికి ఆధారాలు కూడా లేకపోలేదు. కెనడాలో ఖలిస్థాన్ ఉద్యమానికి సపోర్ట్‌గా అనేక పత్రాలు వ్యాప్తిలో ఉన్నాయి. ఖలిస్థాన్ మద్దతులో నడిచే ర్యాలీలు, సభలు యధేచ్ఛగా నడుస్తున్నాయి. కెనడాలోని హిందూ దేవాలయాలే లక్ష్యంగా హిందూ, భారత వ్యతిరేక పోస్టర్లు, గ్రాఫిటీ ప్రచారాలు తరుచుగా దర్శనిమిస్తాయి.ఆగస్ట్ 2024లో, ఖలిస్తాన్ అనుకూల బృందం భారత స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ కోసం ఏర్పాటు చేసిన ఒక వేదిక వద్దకు వచ్చి, "కెనడియన్ హిందువులు భారతదేశానికి తిరిగి వెళ్లండి" అని అరిచారు. ఈ సంఘటనకు ముందు, వేర్పాటువాద గ్రూపు అయిన సిక్స్ ఫర్ జస్టిస్ సంస్థ? ఖలిస్తానీ సిక్కులు-కెనడియన్ హిందువుల మధ్య "ముఖాముఖి" కోసం పిలుపునిస్తూ ఫ్లైయర్‌లను ప్రసారం చేసింది. వాటన్నింటినీ కెనడా ప్రభుత్వం ఎప్పుడూ నిరోధించడానికి ప్రయత్నించలేదు. అలాగే, భారతీయ హిందువులపై జరిగి దాడులను కూడా ఆపలేదు.బంగ్లాదేశ్‌లో కూడా ఇటీవల హిందువులపై దాడులకు సంబంధించిన ఆందోళనలు పెరిగాయి. దీనిపై, అక్కడి తాత్కాలిక ప్రభుత్వ చీఫ్, నోబుల్ గ్రహీత మహ్మద్ యూనస్ స్పందిస్తూ? అలాంటి సంఘటనలు పెద్దగా జరగట్లేదన్నట్లే చెప్పారు. కెనడా ప్రధాని ట్రూడో మాదిరి యూనస్ కూడా బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పిస్తామంటూ హామీలిచ్చారు. ఇటు బంగ్లాదేశ్‌లో, అటు కెనడాలో హిందువులపై దాడులను చూస్తుంటే భవిష్యత్తు ఆందోళనకరంగా కనిపిస్తుంది. భారతదేశంపై ఉన్న ద్వేషాన్ని చూపించడానికి వాళ్ల దేశంలో పౌరులుగా ఉన్న హిందువులను హింసించడం అన్నది పౌర హక్కులకు భగం కలిగించడం మాత్రమే కాదు, ఇది మానవ హక్కులను కూడా కాలరాయడమే అవుతుంది. అంతకుమించి, రాజకీయ లబ్ధి కోసం తమ దేశ గౌరవాన్ని తగలబెట్టి, చలికాచుకోవడమే అవుతుంది.

# పదవుల భర్తీలో ఆలస్యంతో నైరాశ్యం

**హైదరాబాద్, నవంబర్ 13 (వెలుతురు) :**
పదేళ్లు పోరాడం. పొద్దున లేస్తే రోడ్డు మీదే ఉన్నాం. ఇప్పుడు పార్టీ పవర్‌లోకి వచ్చింది న్యాయం జరుగుతుందని అనుకున్నాం. ఏడాది అవుతుంది. ఇప్పటివరకు ఓ గుర్తింపు లేదు. పదవి లేదు. అంటూ గునుక్కుంటున్నారట కాంగ్రెస్ నేతలు. ఇంకో నెల అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో క్యాబినెట్ విస్తరణ జరగలేదు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులను కూడా మొత్తం భర్తీ చేయలేదు. ఇలా పదవుల భర్తీలో ఆలస్యం అవుతుండటంతో నేతల్లో నైరాశ్యం కనిపిస్తోందట. పార్టీ కోసం ఎంత మొత్తుకుని ఏం లాభం అంటూ నింటూర్పుతో ఉన్నారు కొందరు నేతలు.రోజులు గడుస్తున్నా పదవుల భర్తీకి సర్కారు పెద్దలు పచ్చజెండా ఊపకపోవడంతో లీడర్లు ఢీలా పడుతున్నారు. పూర్తిస్థాయి క్యాబినెట్ విస్తరణపై చాలాసార్లు కసరత్తు చేసినా..ముందడుగు పడటం లేదు. సీఎంతో సహా 11మంది మంత్రులతోనే ఇప్పుడు ప్రభుత్వం నడుస్తోంది. మిగతా ఆరు బెర్తుల కోసం తక్కువలో తక్కువ 20మంది ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు. అందుకోసం సీఎం రేవంత్‌తో పాటు ఢిల్లీ స్థాయిలో కూడా పైరవీలు చేస్తున్నారట. అయితే అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంతో మంత్రివర్గ విస్తరణ జరగడం లేదు. నేతల అమాత్య ఆశలు నెరవేరడం లేదు. క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు బెర్తులను భర్తీ చేయడానికి చాలా సమస్యలు



ఉన్నాయంటున్నారు. ఉమ్మడి జిల్లాల వారిగా ప్రాతినిధ్యంతో పాటు సామాజిక సమీకరణాలను కూడా బేరీజు వేసుకుంటున్నారు. ఇవేవీ కొలిక్కి రాకపోవడంతో పార్టీ అధిష్టానం వాయిదా వేస్తూ వస్తోందిఇక కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల భర్తీది అదే పరిస్థితి. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రకటించి ఆ తర్వాత మూడు నెలలకు గానీ జీవోలు ఇవ్వలేదు. ఇప్పటికీ ఇంకా 40 శాతం ఛైర్మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అవి ఎప్పుడు భర్తీ చేస్తారా అని నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.ఇప్పటికే ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో..కార్పొరేషన్ ఛైర్మన్ పదవి అయినా ఇస్తారా లేకపోతే తమ సంగతి ఇంతేనా అని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట నేతలు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కోసం చాలామంది నేతలు గాంధీభవన్‌తో పాటు సీఎం, మంత్రుల చుట్టూ తిరుగుతున్నారుఎవరి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో నేతలంతా నీరసించి పోతున్నారు. కార్పొరేషన్ ఛైర్మన్లకు క్యాబినెట్ విస్తరణకు ముడిపడి ఉండటంతో.. వ్యవహారం కొలిక్కి రావడం లేదు. ఇక వ్యవసాయ మార్కెట్ కమిటీలది అదే పరిస్థితి. ఇప్పటివరకు సగం మార్కెట్లకే కమిటీలు వేశారు. మిగతావి అన్ని పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలా ఇంకా చాలా పోస్టుల భర్తీని పెండింగ్‌లోనే ఉంచారు ప్రభుత్వ పెద్దలు. పదవులు భర్తీ చేయకపోవడంతో పార్టీ కోసం పనిచేసిన నేతలు..సీట్లు త్యాగం చేసినవారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.రోజులు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన తమకు మొండి చెయ్యి చూపిస్తున్నారని పార్టీ నేతలతో పాటు, ద్వితీయ శ్రేణి లీడర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వచ్చి ఇన్ని నెలలు అవుతున్నా పదవుల భర్తీకి ఆలస్యం ఎందుకు అవుతుందో కనీసం సీనియర్లు అయినా క్లారిటీ ఇవ్వాలంటున్నారు. ఇలా అయితే పార్టీ కోసం పనిచేయడం ఎలా అని ప్రశ్నిస్తున్నారట. త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల కోసం పనిచేయాలంటే పదవులు ఇవ్వాలంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా పదవి లేకుండా పని చేయమనడం ఎంతవరకు సాధ్యం అవుతుందని పీసీసీ పెద్దలను నిలదీస్తున్నారట పార్టీ నేతలు.పదవుల కోసం నేతల పైరవీలు ఎలా ఉన్నా..ఇప్పుడున్న పరిస్థితుల్లో క్యాబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ ఇంకా ఆలస్యం అయ్యే పరిస్థితులే కనిపిస్తున్నాయి. సంక్రాంతి తర్వాత క్యాబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ ఉండొచ్చన్న చర్చ జరుగుతోంది. అట్లైనా ఇంకో రెండు మూడు నెలలు అయితే వెయిట్ చేయక తప్పదు. దీంతో ఆశావహులను, ద్వితీయ శ్రేణి నేతలను సముదాయించడం ఎలా అని ఆలోచిస్తున్నారట పార్టీ పెద్దలు. హైకమాండ్ డెసిషన్ అంటూ దాటవేస్తున్నారట.




## వంగా సందిప్‌రెడ్డితో ప్రభాస్ మూవీ

గ్లోబల్ స్టార్ ప్రభాస్ యానిమల్ ఫేం సందీప్ రెడ్డి వంగాతో సినిమా చేయబోతున్నాడని తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ స్పిరిట్. కాగా సినిమా ఎప్పుడు మొదలవుతుందంటూ తెగ చర్చించుకుంటున్న అభిమానులకు క్లారిటీ ఇచ్చేశాడు టీ సిరీస్ ఎండీ భూషణ్‌కుమార్. ఈ విషయంపై భూషణ్‌కుమార్ ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇస్తూ.. స్పిరిట్ సినిమా పూజా కార్యక్రమం డిసెంబర్‌లో ఉండబోతుంది. సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం స్క్రిప్ట్ రైటింగ్‌తోపాటు మ్యూజిక్ డైరెక్టర్‌తో కలిసి పాటలు సిద్ధం చేసే పనిలో ఉన్నాడు. స్పిరిట్ పూర్తిగా కాప్ డ్రామా నేపథ్యంలో ఉండబోతుంది. రెగ్యులర్ షూటింగ్ 2025 జనవరి నుంచి షురూ కానుంది. త్వరలోనే దీని గురించి ప్రకటిస్తాం. అంతేకాదు కేవలం 6 నెలల గ్యాప్‌లోనే స్పిరిట్ షూట్ పూర్తి చేస్తాం. 2026 ప్రథమార్థంలో విడుదల చేస్తామని క్లారిటీ ఇచ్చాడు. భూషణ్ కుమార్ కామెంట్స్ ప్రభాస్ అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. స్పిరిట్‌లో పాపులర్ సౌత్ కొరియన్ యాక్టర్ మడాంగ్‌సియోక్ విలన్‌గా కనిపించబోతుండగా.. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ పాన్ ఆసియన్ మూవీని భారతీయ భాషలతోపాటు చైనీస్, కొరియన్ భాషలో విడుదల చేసేలా ప్లాన్ రెడీ చేసిందట సందీప్ రెడ్డి వంగా టీం. ఇక ప్రభాస్ కెరీర్‌లో తొలిసారి స్పిరిట్ సినిమా కోసం ఖాకీ డ్రెస్ వేసుకుంటుండటంతో ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నారు అభిమానులు. ఈ మూవీని సందీప్‌రెడ్డి వంగాతో కలిసి టి సిరీస్ అధినేత భూషణ్‌కుమార్ స్పిరిట్ నిర్మిస్తున్నారు.




## కంగువా స్పెషల్ షోకు సర్కార్ అనుమతి

దర్శకుడు సిరుత్తై శివ – హీరో సూర్య కాంబినేషన్‌లో రూపొందిన 'కంగువా' చిత్రం ఈ నెల 14వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానున్న నేపథ్యంలో అదనపు ఆట (స్పెషల్ షో)కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రోజూ ప్రదర్శించే నాలుగు ఆటలతో పాటు అదనంగా మరో ఆట వేసేందుకు అంగీకారం తెలిపింది. అయితే, తొలి షో ఉదయం 9 గంటలకు, చివరి ఆట అర్ధరాత్రి 2 గంటల్లోపు ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ సహా ఏకంగా పదికిపైగా భాషల్లో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పెషల్ షో ప్రదర్శనకు అనుమతివ్వాలంటూ నిర్మాణ సంస్థ చేసిన విజ్ఞప్తికి తమిళ నాడు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఒక్క రోజు మాత్రమే అదనపు ఆట ప్రదర్శించుకునేందుకు అనుమతిచ్చింది. ఇటీవల ఏ సినిమాకు కూడా తమిళనాడు ప్రభుత్వం అదనపు షోలకు అనుమతి ఇవ్వలేదు. ఒక థియేటర్‌లో బెనిఫిట్ షో జరిగిన యాక్సిడెంట్ తర్వాత, తమిళనాడు ప్రభుత్వం అదనపు షోలకు అనుమతి నిరాకరిస్తూ వస్తోంది. పెద్ద హీరోలు రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్ వంటి వారి సినిమాలకు కూడా అదనపు షోలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఇంతకు ముందు వచ్చిన విజయ్ 'ది గోట్' సినిమాకు మాత్రం ఉదయం 9 గంటల ఆటలకు అనుమతి ఇచ్చారు. ఇప్పుడు సూర్య సినిమాకు ఉదయం 9 గంటల ఆటతో పాటు రాత్రి 2 గంటల లోపు మరో ఆటను ప్రదర్శించుకునేలా అనుమతి ఇవ్వడం విశేషం. అయితే, అనుమతి ఇచ్చినప్పటికీ అది ఒక్క రోజుకే పరిమితం చేయడం గమనార్హం. అలాగే ఎర్లీ మార్నింగ్ షోలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఇదిలా ఉంటే, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రం 'కంగువా' తొలి ఆట తెల్లవారు జామున 4 గంటలకే ప్రదర్శించనున్నారు. తమిళనాడులో మాత్రం ఇలాంటి అనుమతి లభించలేదు. ఈ ఒక్కరోజు అనుమతి ఇవ్వడానికి కూడా కారణం విజయ్ పెట్టిన పార్టీనే అని తెలుస్తోంది. ప్రభుత్వాలు సరిగా పనిచేయడం లేదని, అందుకే తను పార్టీ పెట్టాల్సి వస్తుందనేలా విజయ్ చేసిన కామెంట్స్‌తో.. ఇకపై సినిమాల విషయంలో, అందులోనూ స్టార్ హీరోల సినిమాల విషయంలో ప్రభుత్వం కొన్ని నిబంధనలను సడలించే ప్రయత్నం చేస్తోంది. సూర్య 'కంగువా' సినిమాతో ఆ సడలింపులు మొదలయ్యాయి.




## బహుబలి.2ని పుష్ప.2 బీట్ చేస్తుందా..?

ప్రస్తుతం పాన్ ఇండియా ప్రేక్షకులతో పాటు వరల్డ్ వైడ్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప 2. 2021లో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తుంది ఈ చిత్రం. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా విడుదలకు ఇంకా నెల రోజులు కూడా లేదు అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. మరోవైపు ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా టీం కూడా ఫుల్ బిజీగా గడుపుతుంది. ఇప్పటికే ఇండియా వైడ్ భారీ ఈవెంట్‌లను ప్లాన్ చేసిన చిత్రబృందం బిహార్ రాజధాని పాట్నాలో పుష్ప 2 ట్రైలర్‌ను నవంబర్ 17న లాంఛ్ చేయనుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా సృష్టించే రికార్డులపై ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. కొందరు ఏమో ఈ సినిమా అమీర్ ఖాన్ నటించిన దంగల్ రికార్డును బద్దలు గొడుతుందని కామెంట్లు చేస్తుండగా.. మరికొందరు ఈ మూవీ ప్రభాస్ ఆల్‌టైం రికార్డు ఉన్న బాహుబలి 2 సినిమా కలెక్షన్లను బద్దలు కొడుతుందని కామెంట్లు పెడుతున్నారు. ఒకవేళ ఇదే జరిగితే అల్లు అర్జున్ పుష్ప2 సినిమాతో సరికొత్త రికార్డును సృష్టించనున్నాడు. ఎందుకంటే ఇప్పటివరకు అత్యధిక కలెక్షన్లు సాధించిన ఇండియన్ సినిమాలు చూసుకుంటే మొదటి స్థానంలో అమీర్ ఖాన్ నటించిన దంగల్ (రూ.2100 కోట్లు) ఉండగా.. రెండో స్థానంలో బాహుబలి 2(రూ.1800 కోట్లు) ఉంది. వీటి తర్వాత ఆర్‌ఆర్‌ఆర్(రూ.1300 కోట్లు), కేజీఎఫ్(రూ.1200 కోట్లు) చిత్రాలు ఉన్నాయి. పుష్ప పార్ట్ 1 చిత్రం ఇండియా వైడ్‌గా రూ.400 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ చిత్రంకు వచ్చిన పాపులారిటీ వలన ఇప్పుడు కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

## ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ ప్రాజెక్టులో కాంతర నటుడు




టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. రానున్న ఈ ప్రాజెక్ట్ రీసెంట్‌గా లాంఛ్ అవ్వగా.. డిసెంబర్‌లో షూటింగ్ స్టార్ట్ చేయనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్‌లో మరో స్టార్ నటుడు నటించనున్నట్లు తెలుస్తుంది. కాంతారతో పాన్ ఇండియా వైడ్ గుర్తింపు తెచ్చుకున్న రిషబ్ శెట్టి ఈ సినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు రిషబ్‌తో పాటు ప్రశాంత్ నీల్ కజిన్. కన్నడ రోరింగ్ స్టార్ శ్రీ మురళిని కూడా ఈ మూవీకి అనుకుంటున్నట్లు సమాచారం. కాగా.. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బడ్జెట్‌తో నిర్మించబోతుండగా.. జనవరి 09 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. తారక్ ప్రస్తుతం వార్ 2 సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. వార్ 2 షూటింగ్ అనంతరం ప్రశాంత్ నీల్ సెట్స్‌లో జాయిన్ అవ్వనున్నాడు. మరోవైపు ప్రశాంత్ నీల్ కూడా సలార్ 2 ప్రాజెక్ట్‌ను రీసెంట్‌గా మొదలుపెట్టాడు.

## మరో మగాడే లేనట్లు.. మా నాన్న కావాలా..?

టెలివిజన్ నటి రూపాలీ గంగూలీ..సారాభాయ్ వర్సెస్ సారాభాయ్, అనుపమ అనే సీరియల్స్‌తో ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో 'ప్రేమంటే ఇంతే' అనే సినిమాలో కూడా ఒక కీలక పాత్రలో నటించింది. టెలివిజన్ ఇండస్ట్రీలోనే రిచెస్ట్ నటిగా రూపాలీ రికార్డ్ క్రియేట్ చేసింది. 2013లో వ్యాపారవేత్త అయిన అశ్విన్ కె వర్మను వివాహం చేసుకుంది. అయితే అప్పటికే అశ్విన్‌కు పెళ్లి అయ్యి ఒక కుమార్తె కూడా ఉంది. ఆమె పేరే ఇషా. రూపాలీని పెళ్లి చేసుకోవడానికే అశ్విన్.. మొదటి భార్య స్వప్నకు విడాకులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అశ్విన్‌కు రూపాలీ జంటకు ఒక బాబు ఉన్నాడు. నిత్యం సోషల్ మీడియాలో ఆమె తన కుటుంబంతో కలిసి దిగిన ఫోటోలను రూపాలీ షేర్ చేస్తూ ఉంటుంది. అయితే రూపాలీ గురించి అశ్విన్ మొదటి భార్య కూతురు అయినా ఇషా ఒక వీడియోలో సంచలన వ్యాఖ్యలు చేసింది. "నా తండ్రిని ఆమె దూరం చేసింది. నా తల్లికి అన్యాయం చేసింది. పెళ్లి అయిన మగాడితో సంబంధం పెట్టుకొని నా కుటుంబాన్ని విడగొట్టింది. బలవంతంగా నా తండ్రి చేత విడాకుల పత్రాలపై సంతకం చేసేలా చేసింది. రూపాలీ కోసమే మా నాన్న మలేషియా వదిలి ఇండియాకు వెళ్ళిపోయాడు. మరో మగాడే లేనట్లు.. పెళ్లి అయిన మగాడితో సంబంధం పెట్టుకోవడం తప్పు" అంటూ మాట్లాడింది. ఈ వీడియో నెట్టింట పెద్ద దుమారాన్నే రేపింది. ఈ వీడియోపై రూపాలీ కూడా సీరియస్ అయ్యింది. ఇషాపై రూ. 50 కోట్లకు పరువు నష్టం దావా వేస్తూ లీగల్ నోటిసులు పంపించింది. దీంతో ఇషా ఆ వీడియోను డిలీట్ చేయడమే కాకుండా.. తన ఇన్‌స్టా అకౌంట్‌ను ప్రైవేట్‌లో పెట్టింది. బాలీవుడ్‌లో ఇప్పుడీ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.



## డబ్బింగ్ స్టూడియో రష్మికా..




కన్నడ భామ రష్మిక మందన్నా ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. వీటిలో ఒకటి మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్రాంఛైజీలో టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ బ్యూటీ డబ్బింగ్ స్టూడియోలో ఉన్న స్టిల్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ సినిమాకు సంబంధించిన క్రేజీ అప్‌డేట్స్‌ను షేర్ చేసుకుంది. శ్రీవల్లి పాత్రకు డబ్బింగ్ చెబుతున్న స్టిల్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పుడు వినోదం, ఆటలు ముగిశాయి. బిజినెస్ నుంచి దిగిపోవాల్సిన టైం వచ్చేసింది. పుష్ప షూటింగ్ దాదాపు పూర్తయింది. పుష్ప ది రూల్ ఫస్ట్ హాఫ్ డబ్బింగ్ పూర్తయింది. ప్రస్తుతం సెకండాఫ్ డబ్బింగ్ కొనసాగుతోంది. సినిమా ప్రేక్షకులకు మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌ప్రీరియన్స్ అందించడం పక్కా. వెయిట్ చేయలేక పోతున్నానంటూ రాసుకొచ్చింది రష్మిక మందన్నా. ఇప్పుడీ స్టిల్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు పుష్ప మూవీ లవర్స్. ఫస్ట్ పార్టుకు సూపర్ హిట్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా అదిరిపోయే ఆల్బమ్ రెడీ చేసినట్టు ఇప్పటికే విడుదలైన పాటలు చెబుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోన్న సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు



**నిర్మల్, నవంబర్ 13 ( వెలుతురు):**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంల బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. 15వేల రూపాయల లంచం తీసుకుంటూ మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ షాకీర్ పట్టుపడ్డాడు. బిల్ కలెక్టర్ భరత్ సర్వీస్ బుక్ ఎంట్రీ కొరకు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. కాగా, మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేస్తుండటంతో ఉద్యోగ వర్గాల్లో కలవరం మొదలైంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చేనేత కార్మికుడి ఆత్మహత్య

**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 13 ( వెలుతురు):**
రాష్ట్రంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఆదరణ కరువై నేతలన్నలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన చేనేత రంగం నేడు ఆర్డర్లు లేక వెలవెలబోతున్నాయి. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరో నేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలోని ఎర్రం కొమ్రయ్య (55) అనే వ్యక్తి ఇంట్లో ఊరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య కమల, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, సాయి కిరణ్, కూతురు వరలక్ష్మి ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి వేడుకలు



**తిరుమల, నవంబర్ 13 ( వెలుతురు):**
కైశిక ద్వాదశి పర్వదినం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేకువఝామున 4.30 నుంచి 5.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారని వివరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి, టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**శ్రీవారికి హుండీకి రూ. 3.81 కోట్లు ఆదాయం**

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 23 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని వివరించారు. నిన్న స్వామివారిని 61,446 మంది దర్శించుకోగా 21,374 తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 3.81 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు.

## శాసనమండలి నుంచి వైసీపీ ఎమ్మెల్సీలు వాకౌట్




**అమరావతి, నవంబర్ 13 ( వెలుతురు) :**
ఏపీలోని విశాఖపట్నం జిల్లాలో డయేరియాతో మరణాలు జరిగితే అసలు మరణాలే లేవంటూ శాసన మండలి సమావేశంలో మంత్రి పేర్కొనడాన్ని నిరసిస్తూ శాసనమండలి నుంచి వైసీపీ ఎమ్మెల్సీలు బుధవారం వాకౌట్ చేశారు. ఈ సమావేశంలో మండలి ప్రతిపక్ష వైసీపీ నేత , మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డయేరియా కేసుల గురించి ప్రశ్నోత్తరాల సమయంలో సమస్యను లేవనెత్తారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ సమాదానమిస్తూ డయేరియాతో ఎవరూ చనిపోలేదని సమాదానం ఇచ్చారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గుర్ల గ్రామంలో డయేరియాతో 200 మంది బాధితులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందగా పదుల సంఖ్యలో చనిపోయరాని ఆరోపించారు. అధికారులు కూడా వచ్చి పరిశీలించారని వివరించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వచ్చి 10 మంది చనిపోయారని చెప్పారని గుర్తు చేశారు. సంబంధిత మంత్రి ఎవరూ చనిపోలేదని ఎలా చెబుతారని ప్రశ్నించారు. డయేరియా మరణాలను తగ్గించడంలో ప్రభుత్వం విఫలమైందని బొత్స విమర్శించారు. బాధిత కుటుంబాలకు వైఎస్ జగన్ రూ. 2 లక్షల సహాయం చేశారని వెల్లడించారు. ప్రభుత్వం ఎందుకు ఇప్పటివరకు పరిహారం ప్రకటించలేదని నిలదీశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

# యుద్ధం రాస్తున్న డైరీ

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
నేను డైరీ ఎందుకు రాద్దామనుకుంటున్నాననే విషయానికి వస్తా. నాకు స్నేహితులు లేరు. నన్ను మరింత స్పష్టంగా చెప్పనియ్యి. పదమూడేళ్ల బాలిక ఈ ప్రపంచంలో పూర్తిగా ఒంటరితనం అనుభవిస్తోందంటే ఎవరూ నమ్మరు” అంటూ 1942 జూన్ 12న మొదలు పెట్టి, 1944 ఆగస్టు 1 వరకు.. 26 నెలల పాటు తనను అనాథను చేసిన యుద్ధం మిగిల్చిన ఒంటరితనాన్ని ఒక డైరీలో రాస్తుంది ఓ అనాథ. డచ్ భాషలో రాసిన ఈ డైరీ 1947లో ‘ద డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్’ పేరుతో ప్రచురితమైంది. ఇలాంటి అనాథలు.. రాయడానికి అవకాశంలేని విషాదగాథలు.. కన్నీళ్లు మిగిల్చిన జీవితాలు.. దిక్కుతోచని బతుకులు అనేకం. యుద్ధం, కరువు, వలసలు, సామాజిక హింస, పేదరికం, ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధులు వంటివి పిల్లలు అనాథలుగా మారడానికి కారణమౌతాయి. ప్రపంచవ్యాప్తంగా 18ఏళ్ల లోపు పిల్లలు 15.3 కోట్లమంది అనాథలుగా మారుతున్నారని యునిసెఫ్ వెల్లడించింది. ‘ప్రపంచంలో ఎంతోమంది ఒక్క పూట తిండి కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో మరెంతోమంది కన్నప్రేమను కోల్పోయి తల్లడిల్లుతున్నారు’ అంటారు మదర్ థెరిసా. రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది చిన్నారులను అనాథలుగా మిగిల్చాయి. ఇది చరిత్ర రాసిన డైరీ. తాజాగా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలై దాదాపు రెండేళ్లకుపైగా అయింది. గాజాపై ఇజ్రాయెల్ నరమేధం మొదలై ఏడాది దాటిపోయింది. ఈ దేశాల నుంచి లక్షలాది మంది వలసపోయారు. లక్షలాది జీవితాలు అతలాకుతలం అయ్యాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడిలో చనిపోయినవారు కాకుండా దాదాపు 19వేలకు పైగా చిన్నారులు



అనాథలయ్యారని ఐరాస పిల్లల సంస్థ (యునిసెఫ్) నివేదించింది. ప్రపంచమంతా యుద్ధం గురించి, ఆర్థిక సంక్షోభం గురించే మాట్లాడుతోంది కానీ, యుద్ధం మిగిల్చిన చిన్నారుల గురించి, వారికి యుద్ధం చేసిన గాయాల గురించి అనాథలుగా మారిన వైనం గురించి దృష్టి సారించాల్సిన సమయం ఇది. వారి భవిష్యత్ ఏమిటో అర్థంకాని దుస్థితిలో వారున్నారు. అలాగే, కరువు, వరదలు, విపత్తులు మిగిల్చిన అనాథలు మరికొందరు. అనాథలుగా మిగిలిన వారు అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వుంటుంది. సరైన సంరక్షణ, పేదరికం, అనారోగ్యం, చదువు లేకపోవడం, దోపిడీకి గురవడం వీరిని వేధించే ప్రధాన సమస్యలు. వీరెవరూ పుట్టుకతో అనాథలు కాదు. ఆధిపత్యం కోసం, మతవ్యాప్తి కోసం.. జాతి, భాష, ప్రాంతం వంటి వివక్షతలతో చెలరేగుతున్న యుద్ధాలు మిగిల్చిన అనాథలు వీరు. బంధువుల మధ్య పెరుగుతున్నవారు కొందరైతే ఏ తోడూ లేకుండా అనాథలుగా గడుపుతున్నవారు మరికొందరు. ఏ కొద్దిమందో తప్ప.. ఎక్కువమంది జీవితాలు దారితప్పి ఆగమైపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 100కోట్ల మందికి పైగా చిన్నారుల జీవితాలు కడు దుర్భరంగా మారాయి. ప్రతి పదిమందిలో తొమ్మిది మంది పిల్లలు వేధింపులకు గురవుతున్నారని డబ్ల్యుహెచ్ఓ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆండ్రూ జాక్సన్ వంటి ప్రపంచ నాయకులు, లియో టాల్‌స్టారు వంటి రచయితలు, ఆరోన్ హెర్నాండెజ్ వంటి క్రీడాకారులు, మార్లిన్ మన్రో వంటి సెలబ్రిటీలు కూడా అనాథలుగానే తమ జీవితాలను ప్రారంభించి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. సంకల్పం వుంటే.. సాధించలేనిది లేదు. అనాథ పిల్లలు కూడా సమాజంలో అంతర్భాగమే. వారిని సంఘవిద్రోహ శక్తులుగా మారకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా దారి చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అనాథ పిల్లల చదువు, సంరక్షణ బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలి. ‘చిట్టితల్లుల బెదురు కళ్ళలో/ చెదిరిపోతున్న నిదుర కలలు/ ప్రపంచ శాంతి కాముకులకు/ కునుకు పట్టని రాత్రుల్ని/ బహూకరిస్తున్నాయి’ అంటారొక కవి. అనాథలవుతున్న పిల్లల దుస్థితిని ఈ ప్రపంచానికి తెలియజెప్పడం కోసం, తల్లిదండ్రులు లేని పిల్లలకు అవగాహన కల్పించడం కోసం, వారి హక్కులను ప్రోత్సహించడం కోసం ప్రత్యేకంగా ఒక రోజును ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం నవంబర్ రెండో సోమవారం ‘ప్రపంచ అనాథల దినోత్సం’ నిర్వహిస్తారు. ‘కూలిన ప్రతి కష్టం దగ్గర/ నిశ్శబ్దంగా కూర్చుని చూస్తాను/ మొలకలాంటిదేదైనా/ కవితని ఎత్తుకుని పైకి లేస్తుందని’ అంటారు కవయిత్రి మెర్సీ మార్గరెట్. చిన్నారుల జీవితాలకు భరోసానివ్వాలి. పిల్లలులేని తల్లిదండ్రులు అనాథ బిడ్డలను దత్తత తీసుకునే సత్‌సాంప్రదాయం పరిఢవిల్లాలి. అన్నిటికీ మించి అనాథల శ్రేయస్సు కోసం సమగ్ర చట్టం తేవాలి.

# జగన్ మౌనం... వ్యూహాత్మకమా...

**విజయవాడ, నవంబర్ 13 ( వెలుతురు):**
పవిత్ర తిరుమలలో లడ్డూ తయారీలో కల్తీ, నటి జత్వానీ వ్యవహారంలో ఐపీఎస్ అధికారుల సస్పెన్షన్, ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొట్టిన ఘటనలో కుట్ర కోణాలు, మదనపల్లి ఫైల్స్ దహనం.. ఇలా ఒక్కో వ్యవహారం ఒక్కో ఆటం బాంబులా ఆంధ్ర రాజకీయాల్లో పేలుతున్నాయి. వీటన్నింటికీ మించి షర్మిళ ? జగన్ ఆస్తుల పంచాయితీ కీలక మలుపు కాగా, ఇంతలోనే రిషికొండ ప్యాలెస్ అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చారు. అసలు ఎందుకు.. ఇలా ఒక్కో అంశం తెరపైకి వస్తుంది అంటే.. అధికార పార్టీ వ్యూహంలో భాగమే అనే మాటలు వినిపిస్తున్నాయి. వీటన్నింటి వెనుక ఉన్న ఏకైక టార్గెట్? వైఎస్ జగన్. గత ఐదేళ్లలో జగన్ చేసిన ఘనకార్యాలు ఇవీ అంటూ ప్రజలకు చూపించడమే వారి లక్ష్యంగా కనిపిస్తోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు వైసీపీ వైఫల్యాలపై నిత్యం విమర్శలు గుప్పిస్తూ, వీలున్నంత మేరకు అన్ని అంశాల్లో జగన్ ను దోషిగా నిలబెట్టేందుకు చూస్తుంటే.. జగన్ మాత్రం సైలెంట్ గా ఉండిపోయారు. ఏ వ్యవహారంలోనూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది లేదు. దాంతో.. వైసీపీ క్యాడర్ ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. అధినేత మౌనం.. వ్యూహాత్మకమా.? ఎలా ఎదుర్కోవాలో తెలియని పరిస్థితా.? అనేది తెలియక ఇబ్బందులు పడుతున్నారు. 2014లో మొదటిసారి ఎన్నికల్లో ఓడిపోయాక.. మళ్లీ వస్తాం, ఈసారి బలంగా కొడతాం అంటూ మీడియా ముందు ఆవేశంగా ప్రకటించిన జగన్.. అదే తీరుగా క్షేత్రస్థాయిలో బలంగా పనిచేశారు. నిత్యం యాక్టివ్ గా ఉంటూ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. కానీ.. ఇప్పుడు కూటమి నేతలు, వారి సోషల్ మీడియా ప్రచారంపై జగన్ తీరుకు.. సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరి జగన్ ఎందుకు బలంగా కౌంట్ ఎటాక్ చేయడం లేదు అంటూ సందిగ్ధంలో పడిపోయారు. అధికారంలో ఉన్న జగన్ ? ఇప్పటి జగన్ తీరుకు పొంతన లేక.. ఏం జరుగుతోందంటూ తలలు పట్టుకుంటున్నారు. తమ నాయకుడి మౌనం అర్థం కాక, అధికారపక్ష విమర్శలకు ఎలా కౌంటర్ ఇవ్వాలో తెలియక సతమతం అవుతున్నారు. 2019 ఎన్నికల్లో కనీవిని ఎరుగని స్థాయిలో 151 సీట్లు గెలుపొంది అధికారం చేపట్టిన జగన్.. లక్షల కోట్ల రూపాయలను వివిధ పథకాల పేరుతో ప్రజల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఆ సంక్షేమమే మళ్లీ పట్టం కడుతుంది అని ఆశపడి భంగపడ్డారు. ఎలా అయితే పైకి లేచారో.? అలాగే



దారుణంగా కిందపడిపోయారు. కేవలం 11 సీట్లతో ప్రతిపక్షం హోదాను సైతం దక్కించుకోలేని స్థితిలో.. ఈ ఫలితాలు చూసి హిమాలయాలకు వెళ్ళిపోవాలనిపించింది అంటూ జగన్ అప్పట్లో వ్యాఖ్యానించారు. ఫలితాలను జగన్ ఏ తీరుగా తీసుకున్నారో చెప్పేందుకు ఇదే మంచి ఉదాహరణ అంటున్నారు.. రాజకీయ విశ్లేషకులు. ఓటమి బాధను జీర్ణించుకోలేక.. ఇంకా ఆ పరిస్థితుల నుంచి జగన్ పూర్తిగా బయటపడలేదని, అందుకే.. సరైన కౌంటర్ లేకుండా పోయిందంటున్నారు.కేవలం ఎన్నికల ఫలితాలు మాత్రమే కాదు. అధికారంలో ఉన్నప్పుడు పదవీ బాధ్యతలను అడ్డుగా చూపి కోర్టులకు హాజరు కాలేదు. అనేక కేసుల విచారణలోనూ తీవ్ర జాప్యానికి కారణమయ్యారు. ఇప్పుడు అధికారం కోల్పోవడం, మళ్లీ కేసులు యాక్టీవ్ అవుతుండడంతో ఎలా ఎదుర్కోవాలో అని మథనపడుతున్నారంటున్నారు.. విశ్లేషకులు. అన్నీ కేసులు ఒకెత్తు అయితే.. వైఎస్ వివేకానంద హత్య కేసు మరో ఎత్తు. ఈ కేసు తిరిగి తిరిగి వైసీపీ ముఖ్య నేతలకే చుట్టుకోవడం, ఒకవేళ.. ఈకేసులో తన పాత్రపై విచారణ జరిగితే రాజకీయంగా ఎదురుకానున్న వ్యతిరేకతలు జగన్ ను నిద్రపోనివ్వడం లేదన్నది సన్నిహితుల మాట.జగన్ ముఖ్యమంత్రిగా గెలిచిన సందర్భంలో వైసీపీ సోషల్ మీడియా చాలా యాక్టీవ్ గా పనిచేసింది. జగన్.. కాలు తీసి కాలు బయటపెట్టినా విపరీతంగా హైప్ క్రియేట్ చేసింది. జగన్ ప్రతీ మాటను, చేసిన ప్రతీ వాగ్దానాన్ని అన్ని వర్గాల ప్రజలకు చేరవేసేలా విస్తృత ప్రచారం కల్పించింది. ఎదుటి పక్షం ఎవరైనా జగన్ పై కామెంట్ చేస్తే తీవ్రంగా విరుచుకుపడింది. అలాంటి సోషల్ మీడియా.. జగన్ అధికారం కోల్పోయిన తర్వాత ఒక్కసారిగా స్తబ్దుగా మారిపోయింది. కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు చేసే విమర్శలకు దీటుగా బదులివ్వలేక చతికిల పడిపోతోంది. దాంతో.. అధికార పక్షం వాదనే బలంగా ప్రజల్లోకి వెళుతుంది అంటున్నారు.. రాజకీయ విశ్లేషకులు.ఎన్నికల్లో జగన్ అద్భుత విజయం వెనుక వ్యూహాలు సిద్ధం చేసింది.. ప్రశాంత్ కిషోర్ టీం. ఎన్నికలకు రెండు మూడేళ్ల ముందు నుంచే ప్రశాంత్ కిషోర్ టీం.. జగన్ తో కలిసి పని చేసింది. రాష్ట్రంలో విస్తృతంగా సర్వేలు చేపట్టి, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుకూలంగా పార్టీ మేనిఫెస్టో రూపకల్పన చేసింది. పీకే టీమ్ చేసిన సోషల్ మీడియా ప్రచారం వైసీపీకి మంచి బూస్టింగ్ ఇచ్చింది. జగన్ తప్పితే వేరే వాళ్లు వస్తే అభివృద్ధి జరగదు అనే స్థాయిలో అన్ని రకాలుగా ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో పీకే టీం సక్సెస్ అయ్యింది. నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలతో పాటు ఇతర పార్టీల్లోని అసంతృప్తులను వైసీపీ వైపు మళ్లించడంలో సక్సెస్ సాధించింది. అలాంటి బలమైన, వ్యూహాత్మకమైన పీకే టీం.. ఇటీవల ఎన్నికల్లో జగన్ వెంట లేకుండా పోయింది. పీకే టీమ్ మద్ధతు లేని లోపం జగన్ వ్యూహాల్లో స్పష్టంగా కనిపించింది అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. పీకే లేకపోతే.. జగన్ వ్యూహాలు పనిచేయడం లేదని వైరి పార్టీలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి.ఐ? ప్యాక్ టీంలోని కీలక సభ్యుడే ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డికి రాజకీయ వ్యూహకర్తగా ఉన్నారు. అయినా గతంలో మాదిరిగా జగన్ టీం వ్యూహాలు ఫలించడం లేదు. ఎన్ని ఎత్తులు రచించినా.. ప్రస్తుత పరిస్థితుల్లో అవేవీ పనిచేసేలా కనిపించడం లేదన్నది వారి వాదన. ప్రజాక్షేత్రంలో ఘోర ఓటమి, సొంత పార్టీని వీడి అధికార పార్టీలో చేరేందుకు వైసీపీ కీలక నాయకులు ప్రయత్నాలు, సహా.. ఇంకా ప్రజల్లో జగన్ పై ఏర్పడిన వ్యతిరేకత తగ్గకపోవడం ఇందుకు కారణాలుగా విశ్లేషిస్తున్నారు. పైగా బంపర్ మెజారిటీతో అధికారం అందుకున్న నూతన ప్రభుత్వం.. ఇప్పటికీ అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తుండటం జగన్ టీం వ్యూహాలకు ఎప్పటికప్పుడు చెక్ పెట్టినట్లు అవుతుంది అంటున్నారు.

# సర్వేపై ప్రజల పెదవిరుపులు..

**హైదరాబాద్, నవంబర్ 13 ( వెలుతురు):**
తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే పై జనాభిప్రాయం వింతగా కనిపిస్తుంది. సమగ్ర సర్వే పై ప్రజలు పెదవి విరుస్తున్నారు. సర్వే వల్ల తమకు ఉపయోగం ఏంటన్న ప్రశ్న కుటుంబాల నుంచి ఎదురవుతుంది. ప్రభుత్వ పథకాలు ఇస్తారంటే ప్రజలు ఆసక్తిని సాధారణంగా కనపరుస్తారు. కానీ ఉత్తుత్తి సర్వే వల్ల తమకు ప్రయోజనకరమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఎందుకీ ఉపయోగం లేని సర్వేలంటూ ప్రజలు అక్కడక్కడా సిబ్బందిపై తిరగబడుతున్నారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వెనుదిరుగుతున్నారు ప్రభుత్వ సిబ్బంది. ఇప్పటికే తెలంగాణలో చాలా ప్రాంతాల్లో నివాస ప్రాంతాలను సిబ్బంది గుర్తించారు. ప్రతి ఇంటికి స్టిక్కర్లు వేశారు. మూడు రోజుల పాటు స్టిక్కర్లు వేసే కార్యక్రమం జరిగింది. ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయులు వస్తుండటం దాదాపు యాభై ప్రశ్నలకు పైగానే వేస్తూ సమాధానాలు చెప్పమని అడుగుతుండటంతో కొంత విసుగుకు ప్రజలు లోనవుతున్నారు. ఒక్కో కుటుంబం వద్ద గంట సేపు ప్రశ్నలకే పడుతుండటంతో వారు కొన్నింటికి సమాధానం చెప్పలేక మరికొందరు తప్పుడు సమాచారం ఇస్తున్నట్లు కూడా తెలుస్తోంది. ఈ సమగ్ర సర్వే ఎందుకు జరుగుతుందన్నది ప్రజలకు ఎన్యుమరేటర్లు వివరించలేకపోతున్నారు. దీంతో ఎందుకొచ్చిన సర్వే అంటూ వారు విసుగు చెంది ఏదో సిబ్బంది అడిగిన ప్రశ్నలకు కొన్నింటికి మాత్రమే సమాధానం ఇచ్చి మిగిలిన వాటికి దాటవేస్తున్నట్లు తెలిసింది. సమగ్ర సర్వే వల్ల బీసీలకు మాత్రమే ప్రయోజనం అన్న టాక్ బాగా పడిపోయింది. సర్వే వల్ల తమకు గతం నుంచి అందుతున్న పథకాలు రాకుండా ఎక్కడ పోతాయోనన్న ఆందోళన కూడా ప్రజల్లో ఉంది. ఆధార్ కార్డు నెంబరు ఇచ్చేందుకు కూడా కొందరు ఇష్టపడటం లేదు. ఇక తమ ఆదాయం విషయంలో కూడా స్పష్టత రాకుండా పోయింది. ఆదాయం తమకు వచ్చేది చెబితే ప్రభుత్వ పథకాలు అందవేమోనన్న భయం ప్రజల్లో నెలకొంది. ఇప్పటికే కొన్ని పథకాలు అందకుండా పోయాయి. దీంతో తమ పూర్తి వివరాలను అందించేందుకు పెద్దగా ఇష్టపడటం లేదు. దీంతో అసలు ప్రభుత్వ ఆలోచన నెరవేరుతుందా? ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందా? అన్న సందేహం నెలకొంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో అయితే తమకు ఉన్న పొలం వివరాలను కూడా సక్రమంగా చెప్పడం లేదు. ఎన్ని ఎకరాలుంటే రైతు భరోసా ఇస్తుందో ఏ ప్రభుత్వం అని సందేహం పట్టిపీడుస్తుండటంతో తమకు ఎన్ని ఎకరాలున్నదీ ఎన్యుమరేటర్లకు చెప్పడానికి ఇష్టపడటం లేదు. ఇక సొంత ఇల్లు విషయంలోనూ అసలు నిజం చెప్పకుండా కొందరు దాచేస్తున్నారు. మరికొందరు మాత్రం తమ కొడుకు పేరు, కుమార్తెల పేర్ల మీద ఇల్లు ఉందని చెబుతూ తప్పించుకుంటున్నారు. అందుకే తమ వ్యక్తిగత వివరాలను చెప్పడానికి ఇష్టపడకపోవడంతో ఈ సర్వే అసలు లక్ష్యం నెరవేరే అవకాశం లేదన్నది ఎక్కువ మంది అభిప్రాయంగా కనిపిస్తుంది. స్వాగతించిన కేటీఆర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కులగణనను స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? కులగణను స్వాగతిస్తున్నామని పాజిటివ్ గా మాట్లాడుతూనే రాజకీయ, ఆర్థిక నేపథ్యంపై ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు. కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్ ప్రకటించి ఏడాది పూర్తైందని, బలహీన వర్గాలకు, ఆడబిడ్డలకు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ హామీలు ఇచ్చిమోసం చేసిందని తెలిపారు. కొత్త హామీలు దేవుడెరుగు కానీ ఉన్నవాటిని కూడా రద్దుచేశారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందని, వెనుకబడిన వర్గాలకువెన్నుపోటు పొడిచిం దని వ్యాఖ్యానించారు. చేతి గుర్తుకు ఓటేస్తే, చేతివృత్తులవారి గొంతు కోసిందని మండిపడ్డారు. ఇప్పుడు బీసీల ఓట్ల కోసం కులగణన పేరుతో నాటకం ఆడుతోందని ఆరోపించారు. సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారని అన్నారు. జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని పొంగులేటి అంటున్నారని, 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని చెప్పారు. రూ.3 లక్షల బీసీల ఫీజు రీ అంబర్స్మెంట్, బీసీ గురుకు లాలు, బీసీ డిగ్రీ కళాశాలలు ఎటు పోయాయని అడిగారు.చేసిన మోసానికి రేవంత్ రెడ్డి బీసీలకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ చిత్తశుద్ధిపై తమకు అనుమానాలు ఉన్నాయని, 60 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి బీసీలకు ఒరగబెట్టింది ఏమి లేదని విమర్శించారు. బీసీ డిక్లరేషన్ పై బీసీలను చైతన్యం చేస్తామని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ డిక్లరేషన్ లపై వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తమ ఎమ్మెల్యేల పై దాడి చేస్తున్నారని, దమ్ముంటే ఇచ్చిన హామీలు నెరవేర్చాలని చెప్పారు. సిగ్గు ఎగ్గు, నీతి, లేకుండా రేవంత్ రెడ్డి దగుల్బాజీ మాటలు మాట్లాడాడని మండిపడ్డారు. మహారాష్ట్రకు వెళ్లి చేయని పనులు, చేసినట్లు చెప్పారని విమర్శించారు. రైతులకు 500 బోనస్ ఇచ్చినట్లు మహారాష్ట్రలో చెప్పారని, అది నిరూపిస్తే తాము రాజీనామా చేస్తామన్నారు. 420 హామీలు, 6 గ్యారెంటీలు అమలు చేసేదాకా వెంటపడతామని హెచ్చరించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com